ఆంధ్రప్రదేశ్  శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

మంగళవారం, మార్చి 21, 2017,

ఇరవై ఎనిమిదవ సమావేశం, సంపుటం–2, నంబరు–1,

దుర్ముఖినామ సం.ఫాల్గుణ బ.8

**TUESDAY, THE 21ST DAY OF MARCH, 2017,**

**TWENTY EIGHTH SESSION, VOLUME - 2, NO.1**

**30TH ,PHALGUN 1938 S.E.**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

వెలగపూడి,

అమరావతి – 522503.

**LEGISLATURE SECRETARIAT,**

**VELAGAPUDI,**

**AMARAVATHI - 522503.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | : | శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీమతి పమిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు<br>శ్రీ మెట్టు గోవిందరెడ్డి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## మంగళవారం, మార్చి 21, 2017.

# అధికార నివేదిక

---

## విషయ సూచిక

---

(1) ప్రశ్నోత్తరాలు

(2) సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు

1.ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు, 2015-16 సంవత్సరానికి, ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్, 16వ వార్షిక నివేదిక ప్రతిని, 2013, కంపెనీల చట్టంలోని 394 సెక్షను క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ

2.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, 2015-16, సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ లిమిటెడ్, 41వ వార్షిక నివేదిక ప్రతిని, 2013, కంపెనీల చట్టంలోని 394 సెక్షను క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ

3.సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పల్లె రఘునాథ రెడ్డి, 2009-2010,2010-2011,2011-2012,2012-2013 సంవత్సరాలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సహాయ సంస్థ లిమిటెడ్, వార్షిక నివేదికలు, లెక్కల ప్రతులను, 1956, కంపెనీల చట్టంలోని 619(ఎ)(3) సెక్షను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సహాయ సంస్థ లిమిటెడ్ సంస్థాపన పత్రం, నిబంధనావళిలోని పరిచ్ఛేదం 99 (ఎ),(బి) క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ.

(3) ప్రత్యేక ప్రస్తావన

(4) ప్రభుత్వ తీర్మానాలు

1. తిరుపతి విమానాశ్రయం పేరు శ్రీ వెంకటేశ్వర విమానాశ్రయం, తిరుపతిగా మార్చాలని భారత ప్రభుత్వ పౌర విమానయాన మంత్రిత్వ శాఖను కోరాలని సభ ఏకగ్రీవ తీర్మానం
2. విజయవాడ విమానాశ్రయం పేరును నందమూరి తారక రామారావు విమానాశ్రయం, అమరావతిగా మార్చాలని భారత ప్రభుత్వ పౌర విమానయాన మంత్రిత్వ శాఖను కోరాలని సభ ఏకగ్రీవ తీర్మానం.

(5) 2017-18 సంవత్సరానికి వార్షిక ఆదాయ వ్యయ పట్టిక (బడ్జెటు) పై సాధారణ చర్చ కొనసాగింపు

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్

# మంగళవారం, 21వ తేదీ, మార్చి, 2017

----

**( సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది )**

**( గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు )**

----

MR CHAIRMAN: Now Question Hour.

## 1.ప్రశ్నోత్తరాలు:

ప్రశ్న నెం. 9549 (61)

### వాహనాలకు నంబరు ప్లేట్లు

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రహదారులు, భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్ల ముందు '0' అంకెను జోడించడం తప్పనిసరి చేయడమయిందా?

ఆ) అయితే, అందుకు కారణాలు ఏమిటి?

గౌరవనీయులైన రవాణా, రహదారులు, భవనాల శాఖ మంత్రి (శ్రీ శిద్ధా రాఘవరావు)

అ & ఆ)

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వాహనం రిజిస్ట్రేషన్ గుర్తుగా రాష్ట్ర కోడ్ 'ఏపి'గా ఉండాలని ఆ తరువాత రిజిస్ట్రేషన్ చేసే అధికారి కోడ్ నెంబర్, అంటే జిల్లాకోడ్ మరియు రిజిస్ట్రేషన్ గుర్తుగా వినియోగించేవి 4 అంకెలు మించకుండా ఉండాలని 12-06-1989వ తేదీగల ఎస్.ఒ.నెం. 444(ఇ) ద్వారా కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్ విశదీకరిస్తుంది. అంతేకాక, 1988, మోటారు వాహనాల చట్టంలోని 63వ విభాగం ప్రకారం, రాష్ట్రంలో నమోదుచేసిన మోటారు వాహనాల యావత్ సమాచారాన్ని ప్రతి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి అందించాలి. తద్వారా, కేంద్ర ప్రభుత్వం, జాతీయ రిజిస్టర్‌ను నిర్వహిస్తుంది. ఇది మొత్తం మోటారు వాహనాల కీలకమైన డేటా / సమాచారానికి కేంద్ర కోశాగారంగా ఉంటుంది. జాతీయ రిజిస్టర్‌కు ఎలక్ట్రానిక్ సమాచారాన్ని నిక్షిప్తంచేసే క్రమంలో వాహన రిజిస్ట్రేషన్ సంఖ్యలో ఈ క్రిందివి ఉండాలి.

1. రాష్ట్ర కోడ్, అందులో ఇంగ్లీషులో 2 అక్షరాల శ్రేణి ఉంటుంది.
2. అరబిక్ సంఖ్యావాచకంలో 2 అంకెలతో రిజిస్టర్ చేసి అధికారి కోడ్ ఉంటుంది.
3. ఇంగ్లీషులో, రెండు అక్షరాలతో సిరీస్.
4. అరబిక్ సంఖ్యావాచకంలో నాలుగు అంకెలు.

పై పరిస్థితి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు, వాహనాల రిజిస్ట్రేషన్ గుర్తుగా నాలుగు అంకెలను ఇవ్వడమవుతున్నది. ఉదాహరణకు ఒకే అంకెగల సంఖ్యకు సంబంధించి, రిజిస్ట్రేషన్ గుర్తుకు ముందు మూడు సున్నాలు (0) ఉంటాయి.

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం (స్థానిక సంస్థలు–తూర్పుగోదావరి) : అధ్యక్షా, ఇది అమలు జరుగుతున్నటువంటి విధానం గురించి మంత్రిగారు చాలా స్పష్టంగా చెప్పారు. నేను అడుగుతున్న ప్రశ్న ఏమిటంటే ప్రజల అవసరాలకు, మనోభావాలకు అనుగుణంగా రాజ్యాంగాన్నే సవరించాలని ప్రభుత్వమే చెప్తుంది. ఇప్పుడు ఉదాహరణకు సింగిల్ ఒకటికానీ, సింగిల్ తొమ్మిదికానీ, 999కానీ, లేకపోతే 9999కానీ కావాలంటే రూ.50,000 వరకూ ఛార్జీలు పెట్టాము. ఈ సున్నా సెంటిమెంట్‌గా ఉండకూడదనే ఉద్దేశంతోనే ఐదు, పది లక్షలరూపాయలైనా కట్టి తమకు నచ్చిన నంబరు పాడుకుంటున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మళ్ళీ 0007 అనీ, 0001 అనీ వేసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. అందుకనే నేను మంత్రిగారిని అడుగుతున్నదేమంటే మొదట ఉన్న సున్నాకి విలువలేనప్పుడు అది మార్చే ప్రయత్నాలేమైనా చేస్తున్నారా అని నేను స్పష్టంగా మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి (స్థానిక సంస్థలు – విశాఖపట్టణం) : రెడ్డి సుబ్రహ్మణ్యంగారు అడిగిన ప్రశ్న సవ్యంగానే ఉంది. కానీ వాస్తవానికి అమలులో జరగడంలేదు. వాహనాలపై నాలుగు అంకెలులేని వారిమీద ప్రభుత్వం అసలు ఏ చర్యలు తీసుకుంటోంది? ఎందుకంటే సాక్షాత్తూ పెద్ద పెద్దవాళ్ళే పేర్లు చెప్పాలంటే చాలా చెప్పవచ్చు. ఆ సున్నా లేకుండా అంకెలతో తిరుగుతున్న వాహనాల మీద చర్యలేం తీసుకుంటారు? ఈ ప్రాంగణంలోకి వచ్చే అటువంటి కార్లను బయటే ఆపారా అనేది కూడా చెప్తే బాగుంటుంది.

శ్రీమతి పి.శమంతకమణి (శాసనసభా నియోజక వర్గం) : అధ్యక్షా, రాష్ట్ర విభజన జరిగింది కదా. ఇప్పుడేమైనా మన రాష్ట్రానికి కొత్త అంకెలతో సిరీస్ మొదలవుతుందా? లేకపోతే పాత రిజిస్ట్రేషన్ నెంబర్లే ఉంటాయా అనే వివరాలను తెలియజేయాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు (శాసనసభా నియోజక వర్గం) : అధ్యక్షా, అదృష్ట సంఖ్యలనీ, ఫ్యాన్సీ నెంబర్లనీ కొన్ని అంకెలకు ఆర్.టి.ఏ కార్యాలయంలో ప్రత్యేకమైన రేట్లుపెట్టి వేలంవేసి అమ్మడం, న్యూమరాలజీ అని ప్రజల్లోని అశాస్త్రీయమైన నమ్మకాన్ని సొమ్ముచేసుకునే వైఖరి సరైందికాదు. అది మానుకోవాల్సిన అవసరముంది. అదేవిధంగా సీరియల్‌లో ఎవరికి ఏ నెంబరు వస్తే దానిని కేటాయించే పరిస్థితి ఉండాలి. ఇష్టంలేనివాళ్ళు తీసుకోకపోతే మళ్ళీ ఇంకొక నెంబరు వచ్చేవరకూ నిరీక్షించాలి.

హరియాణ, పంజాబు, కొత్తదిల్లీవంటి కొన్ని రాష్ట్రాల్లో ఆటో డిప్పర్‌లు అమర్చి ప్రమాదాలను నియంత్రిస్తున్నారు. ఆటో డిప్పర్లు అమర్చుకుంటే ఒకదానికొకటి వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు, ఆ వాహనం లైటు పడగానే ఈ వాహనం యొక్క డిప్పర్ ఆటోమేటిగ్గా ఆన్ అయిపోయి అవతలివారికి

హెచ్చరికనిస్తుంది. దీనివల్ల వాహన డ్రైవర్ ఎదురుగా వస్తున్న వాహనాలకు సిగ్నల్ పంపించే పరిస్థితి ఉంటుంది. సింగరేణి కాలరీస్ వంటి గనుల్లో పనిచేసే వర్కర్స్‌కూడా ఆ గనులలోపల చీకటిగా ఉండి కనబడదు కాబట్టి అవతల ఒక వ్యక్తి కనుక వస్తున్నట్లయితే ఆటో డిప్పర్స్ పెట్టడం జరిగింది. ఈ ఆటో డిప్పర్‌ను ఏర్పాటుచేయడానికి మన రాష్ట్రంలో కూడా ఏమైనా ప్రయత్నం చేస్తున్నారా? ఆ దిశగా చర్యలేం చేపట్టారో గౌరవ మంత్రిగారిని తెలుపవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ శిద్దా రాఘవరావు: అధ్యక్షా, సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యంగారు అడిగిన ప్రశ్న మేరకు డేటా అంతా ఆటోమేటిక్ విధానం ఉండడంవల్ల కరెక్టు చేయడం కష్టమవుతుంది. అందువల్లనే 0001 కానీ, 0002 కానీ ఇలా నాలుగు అంకెలు రావాల్సిన అవసరముంది. ఏదేమైనప్పటికీ ఒకసారి పరిశీలించి, కేంద్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాసి దాని మీద క్లారిటీ తీసుకుంటాము. ఇది మన ఒక్క రాష్ట్రానికే సంబంధించింది కాదు. యావత్ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించింది. దానిమీద క్లారిటీ తీసుకుని ముందుకు పోవడానికి ప్రయత్నం చేస్తాము.

అలాగే మూర్తిగారు అడిగినట్లుగా కొన్ని వాహనాలకు అమలు జరగడంలేదు. వాటిమీద కూడా మా ట్రాన్స్‌పోర్టు కమీషనర్‌గారికి ఆదేశాలిచ్చి వాటిని కూడా గుర్తించి అవసరమైతే కేసులు రాయమని చెప్తాను. వాటిని అమలుచేసి రాబోయే రోజుల్లో ఒక పద్ధతి ప్రకారం చేయడానికి ప్రయత్నం చేస్తామని చెప్తున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణిగారు అడిగినట్లుగా రాష్ట్ర విభజన తరువాత కొత్త రాష్ట్రం ఏర్పాటు చేసినప్పటికీ సిరీస్‌మీద కొత్త ఆలోచనలేదు. ఏ.పి అనే సిరీస్‌తోటే ఉంది.

ఉ. 10.10

గౌరవ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు గారు అడిగిన ప్రశ్నలో కూడా వాస్తవాలు ఉన్నాయి. డిప్పర్స్‌కి సంబంధించి కూడా వారు మా కార్యాలయానికి వచ్చి మాట్లాడడం జరిగింది. తప్పకుండా మా కమీషనర్‌గారితో మాట్లాడి, రాబోయే రోజుల్లో దానికి కూడా ఒక జీ.వో ఇచ్చి, తప్పకుండా ఆ డిప్పర్స్‌ని వాడే విధానం తీసుకువస్తాము. ఎందుకంటే, రాత్రిపూట ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటాయి. అటువంటివి ఆటోమేటిక్‌గా పనిచేసే ఎక్విప్‌మెంట్లను మనం అరేంజ్ చేసుకుంటే, భవిష్యత్తులో మనం ప్రమాదాలను కూడా నివారించడానికి అన్ని విధాలుగా బావుంటుంది. త్వరలోనే తప్పకుండా వాటికి సంబంధించిన నిర్ణయాలను తీసుకోబోతున్నాము. అంతేగాకుండా, ఫ్యాన్సీ నంబర్లకు సంబంధించి వారు అడిగారు. భవిష్యత్తులో ఎక్కడా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ప్రజలకు అసౌకర్యం లేకుండా వాటిని ఏ విధంగా చేయాలో ఆలోచించి తగిన విధంగా చర్యలు తీసుకుంటాము.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజక వర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం) : అధ్యక్షా, ఇప్పుడు ఆక్షన్ ద్వారా ఏదైతే నెంబర్లు తీసుకునే అవకాశం ఉందో, వాటికి సంబంధించి ఎంఎల్ఏలు, ఎం.ఎల్.సి.లకు అవకాశం ఇవ్వకపోతే మాకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఉదాహరణకు ఏ నెంబరు అయితే మేము పెడతామో, కొంతమంది వచ్చి ఆక్షన్ వేస్తున్నారు. ఒకవేళ మేము కనుక ఆక్షన్ వేస్తే, ఎం.ఎల్.సి.లు ఇన్ని లక్షలతో నెంబరు కొనుక్కున్నారని చెపుతున్నారు. అలా అని మేము ముందుకు వెళ్ళలేకపోతున్నాము. ఆ నెంబర్లను వదులుకోలేక పోతున్నాము. ఇది చాలా గిల్టీగా ఉంది. అధ్యక్షా, నేను ఒక కారు తీసుకుని దాదాపు ఆరు నెలలు అవుతోంది. ఇంతవరకూ నెంబరు రాలేదు. నేను ప్రతిసారీ నెంబరు కోసం వెడితే, ఎవరో ఒకరు ఆక్షన్ వేయడం, నేను వెనక్కి రావడం జరుగుతోంది. ఇది

మాత్రం నిజం. నేను ప్రాక్టికల్‌గా అనుభవిస్తున్నాను. అలాగే, అందరు సభ్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారని నేను భావిస్తున్నాను. కనీసం గవర్నమెంటు ఏ ధరను అయితే నిర్ణయించిందో, ఆ ధరను మేము కడతాము. ఆక్షన్ లేకుండా మాకు ఆ నెంబర్లను కేటాయించేటట్లు చేయమని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ఎందుకంటే, మేము ప్రభుత్వ ఆదాయానికి ఏమీ అడ్డుపడము. కానీ, ఎంఎల్ఏ, ఎం.ఎల్.సి., ఎం.పి.లకు గౌరవార్ధం మీరు ఏ రేటు పెడతారో, ఆ రేటును మేము చెల్లిస్తాం కానీ, ఆక్షన్ లేకుండా చేయవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ శిద్ధా రాఘవరావుః గౌరవ సభ్యులు ముఖ్యమంత్రిగారికి ఒక రిప్రజెంటేషన్ ఇచ్చినట్లయితే, దానిపైన కూడా ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటాము.

Mr. CHAIRMAN: Question No's 9435, 9512, 9409, 9414 are postponed at the request of the Members. Now, next question:

## వ్యాధులను నియంత్రించడం

ప్రశ్న నెం.9609 (66)

శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధుల వ్యాప్తి పెరిగిందా?

(ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రి (డా. కామినేని శ్రీనివాస్)

(అ) లేదండీ.

(ఆ) డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులను అరికట్టడానికి తీసుకున్న చర్యలను సభా సమక్షంలో ఉంచడమయింది.

**శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి. గారు ఇచ్చిన నోటీసులోని (ఆ) ఖండానికి సమాధానం.**

**డెంగీను అరికట్టడానికి ఈ క్రింది చర్యలను తీసుకోవడమయింది :**

- 15 సెంటినెల్ సర్వైలెన్స్ కేంద్రాలను గుర్తించడమయింది. అవసరమైనన్ని 346 మాక్ ఎలీసా టెస్ట్ కిట్‌లను సరఫరా చేయడమయింది మరియు డెంగీ లక్షణాలు ఉన్న 24,762 అన్ని అనుమానిత కేసులకు సెరలాజికల్ పరీక్షలను నిర్వహించి, 3417 డెంగీ వ్యాధి నిర్ధరణ కేసులను గుర్తించడమయింది.
- డెంగీ కేసులకు సంబంధించి రోగికి మంచి చికిత్సను అందించడానికి ప్రతి జిల్లా ఆసుపత్రిలోనూ ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడమయింది.
- వ్యాధులను వ్యాపింప చేసే కీటకాల పుట్టుక సంభావ్యతను తెలుసుకోవడానికి కేసులు నమోదైన అన్ని ప్రాంతాలలో ఎడిస్ లార్వా సర్వేను నిర్వహించి, లార్వా ఉత్పత్తిని తగ్గించే పద్ధతులను అనుసరించడమయింది. డెంగీ పీడిత ప్రాంతాలను గుర్తించి, వ్యాధులను వ్యాపింప చేసే కీటకాల నియంత్రణ చర్యలను చేపట్టడమయింది.
- డెంగీ వ్యాధి సోకిన వారి గృహాలన్నింటికి మరియు ఆ పరిసరాలలోని 50 గృహాలకు పైరెత్రం సేస్‌ను పిచికారి చేయడమయింది.

❖ సంబంధిత శాఖలు అంటే; పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల సమన్వయంతో నిల్వవున్న త్రాగునీటిలో ఎడిస్ లార్వా పుట్టుకను అరికట్టడానికి, తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో క్రమం తప్పకుండా రక్షిత త్రాగునీరు సరఫరా అయ్యే విధంగా చూడడమయింది.

❖ గౌరవ ముఖ్యమంత్రిగారు 2016, సెప్టెంబరు నెలలో దోమలపై దండయాత్ర, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించి, 2016, డిసెంబరు వరకు ఆ కార్యక్రమాన్ని కొనసాగించడమే కాకుండా దోమల వల్ల వచ్చే వ్యాధులను నిరోధించి, నియంత్రించడానికి ప్రజలలో చైతన్యం కలిగించడం జరిగింది. ప్రచారం సందర్భంలో సంచార మలేరియా, డెంగీ క్లినిక్‌లను ఏర్పాటు చేసి మలేరియా, డెంగీ కేసులను గుర్తించడానికి శిబిరాలను నిర్వహించడమయింది.

**మలేరియాను అరికట్టడానికి ఈ క్రింది చర్యలను తీసుకోవడమయింది** :

❖ ప్రత్యేక వ్యాధులు వ్యాపించే మరియు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలలో నిఘా కార్యకలాపాలను ముమ్మరం చేయడమయింది.

❖ వ్యాధిని ముందుగానే గుర్తించి, జ్వరాల కేసులన్నింటికి మరియు వ్యాధి సోకిన వారికి పూర్తి చికిత్స అందించడమయింది.

❖ సత్వర నివారణ చర్యలు తీసుకోవడం కోసం మందులు, లార్వా నివారణ మందులు మరియు క్రిమి సంహారకాలు సరఫరా అయ్యే విధంగా చూడటమయింది.

❖ వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి జిల్లాలలోని గిరిజన ప్రాంతాలలో దీర్ఘకాలం మన్నిక ఉండే కీటకాలను నివారించే 3,50,000 తెరలను పంపిణీ చేయడమయింది.

**టైఫాయిడ్ నివారణకు ఈ క్రింది చర్యలను చేపట్టడమయింది** :

❖ త్రాగునీటి ఎద్దడి మరియు క్రమరహిత పంపిణీ ఉన్నచోట ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో నీటి ద్వారా మరియు కీటకాల వలన వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి.

❖ క్రమం తప్పకుండా రక్షిత త్రాగునీటిని అందించే విధంగా చూడవలసిందిగా పురపాలక పరిపాలన మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖలను ఆదేశించడమయింది.

❖ ఎ.డబ్ల్యు.డబ్ల్యు / ఆషా వర్కర్ల స్థాయి వరకు వాంతుల నివారణ, విరోచనాల నివారణ, యాంటీ బయోటిక్స్, ఐ.వి. ఫ్లూయిడ్‌లు, క్లోరిన్ టాబ్లెట్లు, ఓఆర్ఎస్‌తో సహా అంటు వ్యాధుల నివారణ మందులను తగిన పరిమాణంలో సిద్ధంగా ఉంచడం వంటి కార్యకలాపాలను చేపట్టడమయింది.

శ్రీమతి పమిడి శమంతకమణిః అధ్యక్షా, డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయనే ప్రశ్న అడిగాను. ఈ మూడూ కూడా చాలా ప్రాణాంతకమైన వ్యాధులుగా మనం చూస్తున్నాము. డెంగీ వ్యాధి వచ్చిందంటే ఆ పిల్లవాడి యొక్క పరిస్థితి, రోగిని బాగు చేయడానికి ఎంత ఖర్చు పెట్టాలో, ఆ తల్లిదండ్రులు పడే మనోవేదన ఎంతటిదో మనం ప్రాక్టికల్‌గా చూస్తున్నాము. ఇక మలేరియా విషయమైతే మేము చిన్నప్పుడు ఇంటింటికి మలేరియా గురించి ఒక మందు కిట్టును కొట్టేవారు. ఆ మందును పిచికారీ చేసిన తరువాత, బల్లులు, బొద్దింకలు మొదలైన క్రిములన్నీ చనిపోయి ఇల్లంతా శుభ్రంగా ఉండేది. కానీ, ఇప్పుడు దోమలపై దండయాత్ర అన్నారు. ఈ యాత్ర బాగానే ఉంది కానీ, ఎక్కడా కూడా సక్రమంగా ఆ కార్యక్రమాలు జరగడం లేదు. లేదా మూడు నెలలకు ఒకసారి అంగన్‌వాడీ టీచర్లో, ఆశా వర్కర్లో ఇంటింటికి వెళ్ళి, మీ ఇంట్లో ఏ జబ్బు వచ్చిందని సర్వే చేయడం తప్ప, లేదంటే కుండలలోను, మూతల మీద ఉన్న నీళ్ళను బయట పడేయండి అని చెప్పడమే జరుగుతోంది. అంతేగానీ, మురుగు కాలువలలో స్ప్రే కొట్టడం గానీ, మందులు కొట్టడం మొదలైనవేమీ జరగడం లేదు. ముఖ్యంగా విజయవాడనే మన ముఖ్య కేంద్రంగా అనుకుంటున్న సమయంలో ఆ పంట కాలువల దగ్గర మధ్యాహ్నం

కాగానే నా అంత లావు దోమలు లోపల ఉంటాయి. ఆ పంట కాలువ అనేది దోమల ఉత్పత్తి కేంద్రం. కాబట్టి, దాని నివారణ ఏమిటనేది చెప్పకుండా, ఏదో లేదని, ఉత్పన్నం కాదని అంటే ఎలా అధ్యక్షా?

శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి (శాసనసభా నియోజక వర్గం) : అధ్యక్షా, మన రాష్ట్రంలో ఉన్నటువంటి దోమలపై దండయాత్ర అని సి.ఎం. గారు పెట్టిన కార్యక్రమం చాలా అద్భుతమైనది. కాకపోతే, ఈ కార్యక్రమంలో ఏమిటంటే, ఎక్కువగా మైదాన ప్రాంతాలలో కాస్త అయినా అమలుజరిగింది కానీ, గిరిజన ప్రాంతాలలో అయితే ఈ కార్యక్రమం పూర్తిగా అమలు జరగలేదు. అధ్యక్షా, ఒకసారి వర్షం పడిన తరువాత దోమలు మొదలైనవన్నీ చాలా ఎక్కువగా ఉండి, కొండ ప్రాంతాలలో ఎక్కువగా ప్రాణహాని జరగడం, మనుషులు చనిపోవడం జరుగుతోంది. గత అసెంబ్లీ సమావేశాలలో దానిపైన కూడా సభలో చర్చిద్దామని అనుకున్నాము. అయితే, ఆ సమయంలో ఎందుకు కుదరలేదో తెలియదు కానీ, ఎక్కువగా గిరిజనుల మరణాలు జరగడానికి కారణం వర్షాలు పడిన తరువాత దోమలు బాగా ప్రబలడం వల్ల మరణాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. కాబట్టి, దోమల నివారణకు మూడుసార్లు దోమల నివారణ మందును పిచికారీ చేస్తారు. కానీ, కొండ ప్రాంతాలలో ఆ విధంగా స్ప్రే చేయడం లేదు. దీనిని హెల్త్ డిపార్టుమెంటు బాగా అశ్రద్ధ చేయడం వల్ల, సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరేదేమిటంటే ఈ గిరిజన ప్రాంతాలలో దోమల నివారణకు సంబంధించి స్ప్రే కొట్టడమనేది ఒక క్రమశిక్షణతోను, బాధ్యతాయుతంగా చేయమని తమ ద్వారా వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

డా. కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, ఈ డెంగీ లక్షణాలు ఉన్న 24,762 మందిలో అన్ని అనుమానిత కేసులలోను సెరలాజికల్ పరీక్షలను నిర్వహిస్తే, అందులో దాదాపు 3,417 డెంగీ వ్యాధి నిర్ధారణ కేసులు పాజిటివ్‌గా వచ్చాయి. దీనిమీద ప్రతి ఆసుపత్రిలోను, అలాగే జిల్లా ఆసుపత్రులలో కూడా స్పెషల్ వార్డులను ఏర్పాటు చేశాము. ఏ ప్రాంతాలలో అయితే ఈ కేసులను గుర్తించామో, వాటికి చుట్టుప్రక్కల దాదాపు 50 ఇళ్ళ దగ్గర మలాథియాన్ అనే మలేరియా మందును, పైరెత్రం సేస్‌ను పిచికారీ చేయమన్నాము. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అలాగే పంచాయతీరాజ్ డిపార్టుమెంట్లతో కలిపి త్రాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరిగేలా చూడమని చెప్పాము. మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తీసుకున్న 'దోమలపై దండయాత్ర' కార్యక్రమానికి సంబంధించి మా శాఖ తరఫున కొంతమంది అధికారులు, సెక్రటరీలు శ్రీలంక కు వెళ్ళి స్టడీ చేశారు. ఎందుకంటే, శ్రీలంకలో మలేరియా పూర్తిగా నిర్మూలించబడింది. అందుకని రేపు కేబినెట్‌లో Mosquito Breeding Prevention Act తీసుకురాబోతున్నాము. ఎందుకంటే, ప్రైవేట్లో కానీ, ప్రభుత్వంలో కానీ, చాలా చోట్ల ఖాళీ ప్రదేశాలు ఉండి, అందులో నీళ్ళు చేరి ఎవరూ పట్టించుకోకుండా ఉంటే అందులో దోమలు పెరుగుతూ ఉంటాయి. కాబట్టి, వాటిపైన కూడా తగిన చర్యలు తీసుకుంటాము. అలాగే, మలేరియా, డెంగీకి సంబంధించి కూడా త్రాగునీటికి సంబంధించి సక్రమంగా త్రాగునీరు సరఫరా అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకుంటాము.

అధ్యక్షా, కేవలం ఇవే కాకుండా, ఆయా హెడ్‌క్వార్టర్స్‌లో నోడల్ ఆఫీసర్లను పెట్టి, జిల్లాలలో Rapid response team ఏర్పాటు చేశాము. Epideomiologist, Social & Preventive Medicine and General Physicianతో పెట్టి చేస్తారు. తప్పనిసరిగా ఈ సీజన్ వచ్చినప్పుడు గౌరవ సభ్యులు చెప్పినట్లుగానే ఈ గిరిజన ప్రాంతాలలో మనం గృహాలలో స్ప్రే చేసే విధానానికే అధిక ప్రాధాన్యతను ఇస్తే బావుంటుంది. కొన్ని చోట్ల ఇంటిలోపల స్ప్రే చేయడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. వారందరికీ కూడా కౌన్సిలింగ్ చేసి, గృహాలలో కూడా స్ప్రేచేయడం ద్వారా దోమల నివారణకు అవకాశం ఏర్పడుతుందని, ఆ విధంగా చేయమని చెపుతున్నాను.

శ్రీ మేకా శేషుబాబు (స్థానిక సంస్థలు – పశ్చిమ గోదావరి) ః అధ్యక్షా, ఈ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులన్నీ పెద్దఎత్తున ప్రబలి రోగులు ఎలా ఆసుపత్రి పాలవుతున్నారో మనమందరం చూస్తున్నాము. దోమల మీద దండయాత్ర అనే కార్యక్రమాన్ని కేవలం ఒక ప్రచార కార్యక్రమంగా చేసుకుంటున్నాము తప్ప, క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు జరగడంలేదు. కేవలం రాత్రిపూటే కాకుండా పగలు కూడా దోమలు కుట్టేటటువంటి పరిస్థితి అన్ని గ్రామాలలోను, పట్టణాలలో కూడా ఉంటోంది. దీని నివారణకు సంబంధించిన మెటీరియల్ అంటే మలాథియాన్ కానీ, స్ప్రేలు కానీ అధికారులు కొనుగోలు చేస్తున్నారు, వాటి బిల్లులను కూడా చూపిస్తున్నారు తప్ప, క్షేత్రస్థాయిలో ఆ మందులు కొట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదని తమ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలు, అట్టడుగున ఉన్నటువంటి ప్రజలందరూ కూడా ఆసుపత్రుల పాలయ్యి, చాలా డబ్బులను ఖర్చుపెట్టుకుని ప్రాణాలను కోల్పోతున్న పరిస్థితి ఉన్నది. దీని గురించి ప్రభుత్వం సీరియస్‌గా యాక్షన్ తీసుకుని జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా మానిటరింగ్ చేసి వీటి మీద తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు (పట్టభద్రుల నియోజక వర్గం – కృష్ణా, గుంటూరు) : అధ్యక్షా, గౌరవ మంత్రిగారు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. కానీ, సమాధానం మాత్రం 'లేదండీ' అనేది మాత్రం వాస్తవం కాదు. ఎందుకంటే, కృష్ణా జిల్లాలోని ఎ. కొండూరు, రెడ్డిగూడెం మండలాలలోను, తండాలలోను, దళిత వాడలలోను గత సంవత్సరం ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఆ విషయం గౌరవ మంత్రిగారికి కూడా తెలుసు. ఎందుకంటే, అక్కడ మంచినీళ్ళు కలుషితమయ్యాయని లేదా పారిశుద్ధ్యం సరిగ్గా లేదనే విషయాలను చెపుతున్నారు. కాబట్టి, ఖచ్చితంగా దీనికి సంబంధించి ఏయే ప్రాంతాలు ప్రభావితమవుతున్నాయో, వాటిపైన ప్రభుత్వం ఖచ్చితంగా దృష్టి పెట్టవలసినటువంటి అవసరం ఎంతైనా ఉందని తమ ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, మరొక అంశం ఏమిటంటే దోమల మీద దండయాత్ర అన్నారు. ఏ దండయాత్రలు వచ్చినా, మన విద్యార్థులే పాఠశాలలు వదిలిపెట్టి, దండయాత్రలకు పోయే పరిస్థితే వస్తోంది. అది కూడా కరెక్టు కాదు. ఖచ్చితంగా ఆయా ప్రాంతాలలో ప్రజలలో అవగాహన కలిగించే ప్రయత్నం చేయాలని తమ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అంతేగాకుండా, ఏదైనా వ్యాధిని నిర్ధరణ చేసే సందర్భంలో వంద కిలోమీటర్లకు దూరంగా ఉన్నటువంటి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళ్ళవలసి వస్తోంది. కాబట్టి, అక్కడికక్కడ పరీక్షలు చేయించి, వైద్యం చేసేటటువంటి పరిస్థితి ఉండాలి. ఆ ప్రాంతాలలో ప్రత్యేకమైన క్యాంపులు పెట్టి చేయకపోతే చాలామంది మరణించే పరిస్థితులు కూడా ఉన్నాయి. ఈ కృష్ణాజిల్లాలోని ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాలలో కూడా గతంలో అనేక సంఘటనలు జరిగాయి. దాదాపు 15 మంది వరకు చనిపోయిన పరిస్థితి ఉందని తమ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. అంతేగాకుండా దీనిపైన ఒక కన్‌స్ట్రక్టివ్ కార్యక్రమం తీసుకుంటేనే మనం సక్సెస్ అవుతామని మీ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను.

ఉ.10.20

మిస్టర్ ఛైర్మన్ః దోమల నివారణ మీద అరగంట పాటు చర్చ జరిగినట్లయ్యింది. సెప్టెంబర్ 16వ తేదీన శ్రీకాకుళం, ఆముదాలవలస, సాలూరు, పార్వతీపురం ప్రాంతాలకు నేనూ, హెల్త్ మినిస్టర్ గారు కలిసి వెళ్లాం. డెంగీ వ్యాధి గురించి ఎక్కడెక్కడ ఫిర్యాదులు వచ్చాయి, ఏ రకమైనటువంటి చికిత్స చేస్తున్నారు అనే విషయంలో, we had a couple of meetings with the Principal Secretary and District Collector. పాలకొండ, సీతానగరం ఏరియాలకు కూడా వెళ్లాం.

డా.ఎం.వి.వి.ఎస్ మూర్తిః అధ్యక్షా, మీరూ, మంత్రిగారు ఒకసారి విజయవాడకు వస్తే బాగుంటుంది. విజయవాడలో కూడా దోమలు ఎక్కువగా ఉన్నాయి. అక్కడ కూడా దోమతెరలన్నా సప్లై చేయండి. విశాఖపట్నం నుండి వచ్చిన వాళ్లకి చాలా ఇబ్బందిగా ఉంది.

శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజక వర్గం) ః అధ్యక్షా, మున్సిపాలిటీలలో గానీ, పంచాయతీలలో గానీ దోమల నివారణకు సంబంధించి సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి గారు చెప్పారు. దోమల నివారణకు కొనేటువంటి పెస్టిసైడ్స్ గానీ, మందులను గానీ మున్సిపల్ కార్పోరేషన్‌లు, మున్సిపాలిటీలు వినియోగిస్తున్నాయా, లేదా? టెండర్ల ద్వారా కొనుగోలు చేసే వాటిలో సగం లేదా 100 శాతం కొనుగోలు చేసి 10 శాతమే మందులు తీసుకుంటున్నారా? అలాగే, వారానికి ఒక రోజు ప్రతి కార్పోరేషన్‌లో గానీ, మున్సిపాలిటీలో గానీ, గ్రామ పంచాయతీలలో గానీ దోమల నివారణకు స్ప్రే చేసే విధానాన్ని ఎక్కడైనా అనుసరిస్తున్న పరిస్థితి ఉందా? ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు దోమల నివారణకు సంబంధించి యుద్ధం ప్రకటించారు. యుద్ధం చేయవలసిన అధికారులు, సన్నద్ధంగా లేకుండా కొన్నటువంటి మెటీరియల్‌ను కార్పోరేషన్‌లలో గానీ, మున్సిపాలిటీలలో గానీ, గ్రామ పంచాయతీలలో గానీ, ట్రైబల్ ఏరియాల్లో గానీ వినియోగించే విధానంలో ఘోరంగా వైఫల్యం చెందినందున, ముఖ్యమంత్రి గారు యుద్ధం ప్రకటించారు. యుద్ధం ప్రకటిస్తే సన్నద్ధంగా ఉన్నారా? అవినీతి నుండి ప్రక్కకు వైదొలిగే మార్గం ఉందా? ఈనాడు డెంగీ వ్యాధి విజయవాడకు కూడా వ్యాపించింది. మన అసెంబ్లీ హాల్‌లో కూడా నన్ను, శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావు గార్ని దోమలు కరిచాయి. ఇక్కడ కూడా దోమలు కరిచే పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధులుగా మనం దీనిపైన చర్చించుకుంటాము. ఇది హెల్త్ మినిస్టర్ మీద దండయాత్ర చేయడం కాదు. క్రింద పనిచేసే వ్యవస్థ మీద దోమలు కుట్టే పరిస్థితి లేదు. నేను పుష్కరాలప్పుడు చూశాను. హెల్త్‌కి సంబంధించి కొనవలసినటువంటి మందులు ఎంత కొంటున్నారు, ఎంత నిలవ ఉంచుతున్నారని పరిశీలన చేస్తే ఎక్కడ కూడా వారుకొనే లక్షల బస్తాలలో పాతికవేల బస్తాలు కూడా లేవు.

మిస్టర్ ఛైర్మన్ః అది కాదు సోము వీర్రాజు గారు...

శ్రీ సోము వీర్రాజుః అధ్యక్షా, ప్రతి ప్రశ్నకు వారు సమాధానం చెబుతారు.

మిస్టర్ ఛైర్మన్ః ఒక్క నిమిషం వీర్రాజు గారూ. ఎవరైనా లోపలికి రావాలంటే పాస్ అథారిటీ ఉంటేనే లోపలికి వస్తారు. మరి దోమలు పాస్ లేకుండా ఎలా వస్తాయండీ. ఇక్కడ కూర్చున్న వాళ్లు ఎవరైనా చూడండి. నా అనుమతి లేకుండా దోమలు ఏ విధంగా లోపలికి వస్తాయి.

(సభ్యులు హర్షధ్వానాలు)

శ్రీ సోము వీర్రాజుః కాదు అధ్యక్షా, మాకు దోమలు కుడతాయి. దోమలు కుడుతున్నాయని వారికి చెప్పాము.

మిస్టర్ ఛైర్మన్ః మా పర్మిషన్ లేకుండా ఎలా వస్తాయండి! మీరు కూడా పాస్ కోసం నా దగ్గరికే వస్తారు. విజిటర్స్ వచ్చారని పాస్ కోసం కూడా నా దగ్గరికే వస్తారు. Nobody can come without my permission.

శ్రీ సోము వీర్రాజుః అధ్యక్షా, దీనిని అధ్యయనం చేయడం కోసం హౌస్ కమిటీ ఒకటి వేసి కొనవలసినటువంటి మెటీరియల్ని కొంటే, దానిని వినియోగిస్తే కొంత నిరోధించడానికి అవకాశం ఉంటుంది. అప్పుడప్పుడు ఫాగింగ్ మిషన్లు తిరుగుతాయి. గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్లు తిరిగే పరిస్థితే లేదు. ట్రైబల్ ఏరియాలో నిజంగా వారు పర్యటించారు. గిరిజనులు ఎక్కడో కొండ ప్రాంతాలలో ఉంటారు. పక్కనే పశువులను, గుర్రాలను కట్టివేస్తారు. ఆ గ్రామాలలోకి వెళ్లినప్పుడు, పాడేరులో ఇంటిరీయర్ ప్లేస్కి వెళ్లినప్పుడు చాలా ఇబ్బందికరమైనటువంటి వాతావరణంలో గిరిజనులు ఉంటున్నారు. వారిని కొద్దిగా ఎడ్యుకేట్ చేయాలి. డెంగీ వ్యాధి ప్రబలినప్పుడు అంత దూరంలో ఉన్న వారిని, పాడేరు వంటి సుదీర ప్రాంతానికి వెళ్లి వైద్యం చేయించుకోవడం కష్టమైనటువంటి పరిస్థితులలో చత్తీస్ఘడ్లో ట్రైబల్ ప్రాంతాలలో ఈ రకమైనటువంటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని, ట్రైబల్స్ అందరినీ కూడా 3,4 వేల మందితో హ్యాబిటేషన్లను ఏర్పరిచి, వ్యవసాయం చేసుకోవడానికి ట్రాన్స్పోర్టేషన్ ఏర్పాటుచేసి వారు గ్రామాలలోకి వెళ్లి వ్యవసాయం చేసుకుని మళ్లీ తిరిగివచ్చే పరిస్థితి ఉంది. అక్కడ పెట్టే ఖర్చు కంటే ప్రభుత్వం వారు అధ్యయనం చేసి, ట్రైబల్ ఏరియాలో పెడితే రోగాల బాధ లేకుండా, విద్యాపరంగా కూడా అన్ని అంశాల్లో వారు ఆరోగ్యంగా ఉంటారనేది గమనించడం జరిగింది. ఒక కమిటీ వేయడం, అధ్యయనం చేయడం, రిపోర్ట్ ఇవ్వడం, ఇంప్లిమెంట్ చేస్తే బాగుంటుందని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావుః అధ్యక్షా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులే కాకుండా చికున్ గున్యా లాంటివి, కొన్ని ఏ జబ్బులో తెలియనటువంటి కొత్త కొత్త వ్యాధులు వైరస్ల ద్వారానూ, దోమల ద్వారానూ వ్యాపిస్తున్నాయి. గత ప్రభుత్వం గానీ, ప్రస్తుత ప్రభుత్వం గానీ, ఏ ప్రభుత్వమైనా గానీ వీరి పాలసీ ఏమిటంటే – వ్యాధి సోకిన వారు హాస్పిటల్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి, వైద్యులు వచ్చినప్పుడు, ఉన్నప్పుడు చూపించుకుని బ్రతికితే బతుకు, లేకపోతే చావు అనేటువంటి పద్ధతుల్లో ప్రభుత్వ పాలసీ ఉన్నది. ఇది మంత్రిగారో, లేదా అధికారులో తీర్చే సమస్య కాదు. ప్రజల వద్దకే వైద్యాన్ని మనం తీసుకెళతామా? వ్యాధి సోకిన వారు మా దగ్గరికి వస్తే వీలైతే, చేతనైతే, మందులుంటే, డాక్టర్ ఉంటే వారికి ఏదైనా చేస్తాము, చూస్తాము. తగ్గితే బ్రతుకుతాడు, లేకపోతే పోతాడనే క్యాజువల్ అప్రోచ్ అనేది నిర్ణయించవలసిన అవసరం ఉంది. శ్రీలంకలో, క్యూబాలో, లాటిన్ అమెరికన్ దేశాలలో గానీ చూడండి. నేను యూరప్ గురించి రిఫర్ చేయడం లేదు. యూరప్లాంటి శీతల ప్రాంతంలో సమశీతోష్ణ మండలంగా ఉండే ట్రాపికల్ కంట్రీస్లో ఈ దోమలను ఏ విధంగా ఎరాడికేట్ చేశారు, అక్కడ ఉన్న పద్ధతి ఎటువంటిదనేది ఒకటి. రెండవది, వైద్యం ప్రజల దగ్గరికి వెళుతుంది అధ్యక్షా. ఒక గ్రామం లేదా వార్డు గాని ఉంటే, ఎంతమంది ప్రజలు ఉన్నారు, వారికి ఏ విధమైన ఇబ్బందులు ఉన్నాయని లెక్క చూసుకొని ఆ విధంగా ఎవరికైనా జ్వరం వస్తే ఏ విధంగా చర్య తీసుకోవాలని, అక్కడి గ్రామ సేవకులు గానీ, ఆశా వర్కర్లతో వైద్యం చేసే వ్యవస్థ ఉండాలి.

అధ్యక్షా, రెండవ సమస్య ఇదొక పెద్ద వ్యాపారం అయిపోయింది. నాకు తెలుసు. ప్రకాశం జిల్లాలో ఒంగోలు, కందుకూరు ప్రాంతంలో ప్రతి ఏటా వందల సంఖ్యలో వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లగానే మీ ప్లేట్లెట్స్ పడిపోయాయి, ఇమ్మీడియట్గా యాక్షన్ తీసుకోకపోతే ప్రాణం పోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఎక్కడా లేనటువంటి విధంగా డబ్బులు కట్టమని 70,80 వేల రూపాయలు

తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులకు చూపిస్తే, వాళ్లు ఎంత అబద్ధాలు చెబుతున్నారంటే ప్లేట్‌లెట్స్ కొద్దిగా పడిపోతే ఇబ్బందే కాదు, దానికి మందులు ఇస్తే సరిపోతోందని చెబుతున్నారు. ఇది ఒక వ్యాపారం అయిపోయింది. నేను గౌరవ మంత్రి గారిని కోరేది ఏమిటంటే పాలసీలో మీరు నిర్ణయం తీసుకోండి. ప్రజల వద్దకు ఆరోగ్యాన్ని ఎలా తీసుకుపోవాలి, వ్యాధిని ఎలా నిరోధించాలి. దానికి సంబంధించినటువంటి వ్యవస్థీకృతమైనటువంటి చర్యలు ఎలా చేపట్టాలనేది ప్రధానమైనది. హాస్పిటల్, దోమలు అనేవి తరువాతి అంశాలు.

శ్రీమతి పమిడి శమంతకమణిః అధ్యక్షా, స్ప్రే కొట్టడం వీటన్నిటికంటే హరిజన కాలనీలో గాని, గిరిజన తండాల్లో గాని, మన్యం ప్రాంతాలలో గానీ ఉండేవారు పేదవారు. ఇవన్నీ సక్రమంగా జరుగుతున్నాయా? జరగలేదా? గిరిజనులు ఆసుపత్రులకు వెళుతున్నారా, లేదా? ఇదంతా చాలా లాంగ్ ప్రాసెస్. దానికన్నా ఇంటింటికి ఒక దోమ తెర ఇస్తే, కనీసం పిల్లల్ని అయినా దోమ తెర వేసి కాపాడటానికి వీలవుతుంది. ఇవన్నీ కూడా పక్కదారి పడుతున్నాయి. వీటిని ఎవ్వరూ కాదనలేము.

ఉ.10.30

ముఖ్యంగా సంక్షేమ వసతి గృహాలలో పిల్లలు, దోమతెరలు లేకపోవడం వలన ఎంత ఇబ్బంది పడుతున్నారో చెప్పలేకపోతున్నాము. రెసిడెన్సియల్ స్కూల్స్, మోడల్ స్కూల్స్ మరియు కస్తూర్బా స్కూల్స్‌లో చదివే పిల్లలకు దోమ తెరలు లేవు. దయచేసి ప్రభుత్వం దీని మీద దృష్టి పెట్టి తప్పనిసరిగా రాబాయే మూడు నెలలలోనే దోమతెరలు ఇవ్వవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

డా. కామినేని శ్రీనివాస్ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీమతి పి.శమంతకమణి గారు, డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు చెప్పినట్లు గిరిజన ప్రాంతాలలో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలలో 3.5 లక్షల ఇన్‌సెక్టిసైడ్‌తో స్ప్రే చేసిన దోమతెరలను పంపిణీ చేయడం జరిగింది. అలాగే పుట్టిన పిల్లలకు దాదాపుగా ఎన్.టి.ఆర్ బేబీకిట్స్, దోమతెరలు తప్పనిసరిగా ఇస్తున్నాము. అలాగే మీరు చెప్పినట్లు వసతిగృహాలలో ఉన్నటువంటి పిల్లలకు కూడా తప్పనిసరిగా దోమతెరలను పంపిణీ చేస్తామని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ పి.జె.చంద్రశేఖర రావు గారు కొత్తగా వ్యాధులు వస్తున్నాయన్నారు. వ్యాధులు వస్తున్నాయి. ప్రతి సారి వైరల్ వ్యాధులు మారుతూ ఉంటాయి. గతంలో చికున్‌గున్యా, ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ. అలా మారుతూ ఉన్నాయి. ప్రపంచంలో కూడా కొత్త వ్యాధులు వస్తున్నాయి. వాటిని డిఫరెంట్‌గా తీసుకుంటాము. వారు చెప్పినట్లు ప్లేట్‌లెట్స్ తగ్గిపోతే భయపడతారు. బ్లీడింగ్ అవుతుంటే ప్లేట్‌లెట్స్ బ్లీడింగ్ కాకుండా ఆపుతాయి. అందువల్ల బ్లీడింగ్ అయ్యే వారికి ప్లేట్‌లెట్స్ ఎక్కువగా ఉండేటట్లు చేస్తారు. నాలుగు లక్షలు ఉండాల్సిన ప్లేట్‌లెట్స్ ఇరవై వేలకు పడిపోతే చాలా భయపడతారు. అందుకనే మేము కొన్ని రూల్స్ పెట్టాము. ప్రైవేట్ ఆసుపత్రులకు ఎవరైనా డెంగీ ఫీవర్‌తో వెళితే వారి రక్త పరీక్షల వివరాలు తప్పనిసరిగా డి.ఎమ్.అండ్.హెచ్.వోకు నోటిఫై చేయాలి. వారి రక్త పరీక్షల నమూనాను చూపించకుండా వారికి చికిత్స చేయకూడదు. ఆ రక్త పరీక్షల నమూనాలను కూడా డి.ఎమ్.అండ్.హెచ్.వోకు పంపిస్తే వారి దగ్గర కూడా పరీక్షించి వ్యాధి నిర్ధరణ జరిగిన తరువాతనే చికిత్స చేయాలని రూల్ పెట్టాము. ఇలా కాకుండా వ్యతిరేకంగా చేసిన వారిని సస్పెండ్ చేశాము. ఎక్కడైనా ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకోవచ్చు . కానీ ముందుగా ఆ వ్యాధి డెంగీనా కాదా అనేది ప్రభుత్వ ఆసుపత్రులలో నిర్ధరణ చేయించుకుని అక్కడ

నోటిఫై చేయించుకుని చికిత్సను చేయించుకోవచ్చు. లేదంటే ప్రతీదానికి ప్రైవేట్ ఆసుపత్రుల వారు డెంగీ ఫీవర్ అని చికిత్స ఇచ్చే అవకాశం ఉందని ఈ విధమైన చర్యలు చేపట్టాము.

గౌరవ సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు చెప్పినట్లు మెటీరియల్ వాడడంలో తప్పకుండా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్ శాఖా మంత్రులతో కోఆర్డినేట్ చేస్తాము. గౌరవ సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు, శ్రీ పి.జె.చంద్రశేఖర రావు గారు దోమలు కరుస్తున్నాయంటున్నారు. కానీ, దోమలు కరవవు. కుడతాయి. కుక్కలు కరుస్తాయి. ముఖ్యమంత్రిగారు దోమలు మీద దండయాత్ర అనే పదం ఎందుకు వాడాల్సి వచ్చిందంటే దోమలు మీద దండయాత్ర, పరిసరాల పరిశుభ్రత అనేది కంటిన్యూస్‌గా గత 60, 70 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉంది కానీ, నివారించలేక పోతున్నాము. శ్రీలంకలో కూడా దోమల్ని నివారించలేకపోయారు. కానీ, మలేరియా వ్యాధిని నివారించారు. అందువలన శ్రీలంకను మలేరియా ఫ్రీ కంట్రీ క్రింద డిక్లేర్ చేశారు. మనం కూడా ఆ చట్టాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం, ప్రైవేట్ అందరూ దీని మీద దృష్టి పెట్టి ప్రజల్ని కూడా భాగస్వాముల్ని చేస్తే తప్ప ఇది సాధ్యం కాదనే ఉద్దేశంతో, దీని మీద అవగాహన కల్పించడానికి దోమల మీద దండయాత్ర అని పేరు పెట్టారు. రేపటి నుండి దాని మీద ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని మీ ద్వారా తెలియజేస్తున్నాము.

MR. CHAIRMAN: Good discussion. Next Question No.9617 (67) postponed at the request of the Member. Today, majority of Members are absent. I think, the Members are at voting counting place.

## సౌది అరేబియా నుండి పనివారిని తిరిగి రప్పించేందుకు తీసుకున్న చర్యలు

ప్రశ్న నెం.9443(68)
డా. ఎం.వి.వి.ఎస్.మూర్తి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సమాచార, పౌర సంబంధాలు, సమాచార సాంకేతిక పరిజ్ఞాన, ఎలక్ట్రానిక్ & కమ్యూనికేషన్లు మరియు ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) మన రాష్ట్రంలోని పెక్కు మంది కార్మికులు రాష్ట్రానికి తిరిగి వచ్చేందుకు ఎటువంటి వనరులు లేకుండా సౌదీ అరేబియాలో పనిచేస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, వారిని తిరిగి తీసుకురావడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన సమాచార, పౌర సంబంధాలు, సమాచార సాంకేతిక పరిజ్ఞాన, ఎలక్ట్రానిక్ & కమ్యూనికేషన్లు మరియు ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ పల్లె.రఘునాథ రెడ్డి)

అ) అవునండీ.

ఆ) సౌదీ అరేబియాలో చిక్కుకుపోయిన వలసదారులకు స్వదేశాలకు వెళ్లేందుకు వీసాలు ఏర్పాటు చేయవలసిందిగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా సౌదీ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆ ప్రకారంగా, 2016, ఆగస్టు నుండి ఇప్పటి వరకు సుమారు 43 మంది తెలుగు వలసదారులను స్వదేశానికి తిప్పిపంపేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. కొత్త ఢిల్లీ విమానాశ్రయం మరియు హైదరాబాదులోని శంషాబాద్ విమానాశ్రయానికి వారు చేరుకున్న

మీదట వారి స్వస్థలాలకు చేరుకోవడానికి ప్రభుత్వ ఖర్చుతో రవాణా సదుపాయం కల్పించేందుకు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసింది.

డా. ఎం.వి.వి.ఎస్.మూర్తిః అధ్యక్షా, ప్రత్యేకంగా నేను గౌరవ మంత్రిగారిని అభినందిస్తున్నాను. ఎందుకంటే, అక్కడ పనిచేసే వారందరి మీద శ్రద్ధ తీసుకుని మన రాష్ట్రానికి రప్పించినందుకు వారికి, అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. సౌదీలో ఆర్థిక సంక్షోభం వచ్చిన తరువాత మన భారతదేశం నుండి వెళ్లిన సుమారు 10 వేల మంది అక్కడ చిక్కుకుపోయారు. వారు వేరే కంపెనీలలో లేబర్స్‌గా పనిచేయడం వలన వారికి 6 నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదు. వారికి జీతాలు ఇవ్వకపోవడం వలన, మన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం 3,172 workers are facing distress in Saudi-Arabia for want of food, not only for repatriation. ఇటువంటి దుర్భరమైనటువంటి సంఘటనలో చిక్కుకుపోయారు. మరి ఇంకెవరైనా ఉన్నారేమో పూర్తి వివరాలు తెలియడం లేదు. ఇంకా ఎవరైనా ఉంటే ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తే, వారిని రప్పించడానికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఎక్కువ మంది పనివారు శ్రీకాకుళం జిల్లా నుండే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పని చేయడానికి అక్కడకు వలస వెళ్లారు. అక్కడ జీతాలు ఎక్కువగా ఇస్తారని ప్రత్యేకంగా మూడు కంపెనీలలో i.e. Saudi-Oger, Saudi-Binladin Group & Saad and Group. ఈ గ్రూప్ వారు వర్కర్స్ అందరినీ తీసుకుని అక్కడ పని చేయడానికి పెట్టుకున్నారు. కానీ, వారికి జీతాలు ఇవ్వడం లేదు. వారిని మన దేశానికి తీసుకురావడంతోబాటు ఆ 43 మందికి రావాల్సిన జీతాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా శ్రద్ధ తీసుకుని ఇప్పించే ఏర్పాటు చేయాలని మీ ద్వారా కోరుకుంటున్నాను. ప్రస్తుతం మన ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయ కూలీలు దొరకడం చాలా కష్టంగా ఉంది. కానీ, వారంతా ఎక్కువ జీతాల కోసం కష్టపడి, జీవితంలో బాగుపడాలని, కొంచెం ఎక్కువ డబ్బు సంపాదించుకోవాలని ఇతర దేశాలకు వెళ్లడంలో ఏమీ తప్పులేదు. కాబట్టి, అలాంటి వారి జీతాల కోసం ప్రభుత్వం శ్రద్ధ పెట్టి వారి జీతాలను వారికి ఇప్పించడానికి చర్యలు తీసుకోవల్సిందిగా మీ ద్వారా గౌరవ మంత్రిని గారిని కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః అధ్యక్షా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలోను మధ్యప్రాచ్య దేశాలకు ముఖ్యంగా సౌదీ అరేబియా, దుబాయ్‌కు హౌస్ మెయిడ్స్‌గా మహిళలు వెళ్లడమనేది గత రెండు దశాబ్దాలుగా పెరిగినటువంటి విషయం మనందరికీ తెలుసు. వీరు అక్కడకు వెళ్లి అక్కడ వారి ఇళ్లలో పనిచేస్తున్న వారిపై అనేక రకాలైనటువంటి అఘాయిత్యాలకు పాల్పడి వారు వ్యతిరేకిస్తే జైలులో పెట్టబడిన వారు కూడా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వారు ఎంత మంది ఆ జైళ్లలో ఉన్నారనే సమాచారం ఉందా? ఉంటే వారిని విడుదల చేయించడానికి అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి, కేంద్రప్రభుత్వానికి లెటర్ వ్రాయడం లాంటి సంప్రదాయబద్ధమైనటువంటి వ్యవహారం కాకుండా, డైరెక్టుగా అక్కడ ఉన్న మన తెలుగు ప్రజల అసోసియేషన్‌తో మాట్లాడి డీల్ చేసేటువంటి యంత్రాగాన్ని ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా?

ఉ. 10.40

ఆ తరువాత ఇక్కడ నుండి విదేశాలకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి పంపించే ట్రావెల్ ఏజెంట్స్ ఎవరైతే ఉన్నారో, వాళ్లు పాస్‌పోర్టులను వాళ్ల జేబుల్లో పెట్టుకుని అమాయకులను కట్టుబానిసలుగా చేసే వ్యవహారం జరుగుతున్నది. దీనిని కంట్రోల్ చేయడానికి కేంద్రప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించింది. ఆ ప్రభుత్వాల మీద గట్టిగా ఒత్తిడి తీసుకువచ్చి మన దేశానికి చెందిన కార్మికులకు రక్షణ కల్పించే విషయంలో మన ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నది? I am sorry to say, మనకు

అంతర్జాతీయ కారణాల దృష్ట్యా చాలా బలహీనతలు ఉన్నప్పుడు కేరళ, పంజాబ్ రాష్ట్రాలు అక్కడ ఉన్నటువంటి వాటితో సంబంధం లేకుండా ఆయా రాష్ట్రాల తరఫున వారి అసోసియేషన్ల ద్వారా విదేశాలలో ఇబ్బంది పడుతున్న ప్రజలకు పునరావాసం కల్పించడం, విడుదల చేయించడం, లీగల్ ఎయిడ్ ఇవ్వడం గానీ లేదా ట్రాన్స్‌పోర్టు ఛార్జెస్ ఇవ్వడం వంటి మెకానిజాన్ని అభివృద్ధి చేశారు. అటువంటి దిశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏమైనా చర్యలు చేపడుతున్నదా?

శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ (స్థానిక సంస్థలు – కృష్ణాజిల్లా) : అధ్యక్షా, అరబ్ దేశాలకు వెళ్లే తెలుగు పనివాళ్ల సమస్యలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఆ సమస్యలు ఈ రోజు కొత్తగా వచ్చినవి కావు. చాలా సంవత్సరాల నుండి కూడా ఈ సమస్యలు ఉన్నాయి. వీటికి ఇప్పటివరకూ శాశ్వత పరిష్కారం చూడకపోవడమనేది చాలా బాధాకరం. ఈ విషయంలో నా స్వంత అనుభవం ఉన్నది. మా గ్రామానికి చెందిన ఒక మహిళ పనికొరకు వెళితే, ఆ యజమాని పాస్‌పోర్టు, వీసాను తీసుకుని ఆ మహిళను బయటకు గెంటివేయడం జరిగింది. ఇప్పుడు అక్కడ పనిచేసుకోవడానికి వీసా పర్మిట్ లేదని వేరే వాళ్లు పని ఇవ్వరు. పోనీ, ఇండియాకు తిరిగి వద్దామంటే, పాస్‌పోర్టు ఇవ్వరు. ఈ విధంగా చాలామంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఏజెంట్స్ కూడా మోసం చేస్తున్నారు. దీనికి శాశ్వత పరిష్కార మార్గమేమిటి? ఏదో అక్కడ మన వాళ్లు ఇబ్బంది పడుతున్నారని తెలిసినపుడు విదేశాంగ శాఖామంత్రి శ్రీమతి సుష్మా స్వరాజ్ గారి దగ్గరకు డా.పల్లె రఘునాథరెడ్డి గారు వెళ్ళి మాట్లాడడం, రిక్వెస్ట్ చేయడం, ఒక లేఖ పెట్టించడం చేస్తున్నారు. ఒకటి, అరా సక్సెస్ అవుతున్నారు, వాళ్లను వెనక్కి తీసుకురావడం జరుగుతోంది. కానీ, లక్షలాది మందికి శాశ్వత పరిష్కారం చూపించాలి. అక్కడకు వెళ్లిన వారి కొరకు మన ఎంబసీలో గానీ లేదా శ్రీ పి.జె. చంద్రశేఖర్ గారు చెప్పినట్లు తెలుగు అసోసియేషన్ వాళ్లు, మన రాష్ట్రం నుండి ప్రత్యేకమైన హెల్ప్ సెంటర్‌లో మన వాళ్ల పాస్‌పోర్టు, వీసా అనుమతులు పెట్టుకోవడానికి అవకాశం ఉంటుందా అనేది పరిశీలించాలని మంత్రిగారిని కోరుతున్నాను.

విదేశాలకు పంపించే ఏజెంట్లను ప్రభుత్వం ఏ రకంగా నియంత్రిస్తుంది? వాళ్లపై ఏ రకంగా కఠిన చర్యలు తీసుకుంటుంది? అక్కడ ఇబ్బందులు పడి రోడ్లపాలైనవాళ్లు రోడ్ల మీదే చనిపోతున్న సంఘటనలు ఉన్నాయి. వాళ్ల డెడ్‌బాడీలను తీసుకురావాలన్నా కష్టతరంగా ఉంటున్నది. రాష్ట్రప్రభుత్వం ఒక పాలసీ తీసుకుని ఈ రకంగా ఇబ్బంది పడేవాళ్లందరికీ శాశ్వత పరిష్కారంగా రీహాబిలిటేషన్ సెంటర్‌ను పెట్టిస్తే బాగుంటుంది. దీనిపై దీర్ఘకాలిక పథకాన్ని రూపకల్పన చేసే ఆలోచనను చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. థాంక్యూ అధ్యక్షా.

డా. పల్లె రఘునాథరెడ్డిః అధ్యక్షా, గౌరవ సభ్యులు డా.ఎంవివిఎస్ మూర్తి గారు, శ్రీ పి.జె. చంద్రశేఖర రావు గారు, శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ గారు చాలా మంచి ప్రశ్నలు వేశారు. దీనిపై కొద్దిగా క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నాను.

అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో వేలాది మంది గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారు. దళారులు వచ్చి మీకు గల్ఫ్ దేశాలలో మంచి ఉద్యోగాలున్నాయి, మంచి జీతాలు వస్తాయి, మీ జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలు అవుతుందని చెప్పి లేనిపోని ఆశలు, భ్రమలు కల్పిస్తున్నారు. దానికి అక్కడకు పోతే జీవితం బాగుపడుతుందనే ఆశచేత అమాయకులు, పేదవారు వాళ్లు చెప్పినవి నమ్మి గల్ఫ్‌దేశాలకు

వెళుతున్నారు. ఆ విధంగా వెళ్లేటప్పుడు విజిటింగ్ వీసాతో కొంతమంది వెళతారు, ఫేక్ వీసాతో కొంతమంది వెళతారు. ఆ కంపెనీ వాళ్ల దగ్గర దళారులు డబ్బులు తీసుకుని ఉద్యోగానికి వెళ్లిన వారిని అప్పగించి, పాస్‌పోర్టు, వీసా, ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్లు ఉన్న సర్టిఫికెట్లను కంపెనీ ఓనర్లకు ఇచ్చేస్తున్నారు. ఆ కంపెనీ వాళ్లు ఉద్యోగానికి వచ్చిన వారిని పెద్ద కంటైనర్లు, చీకటి గదులలో పెట్టి 8 నుండి 12 గంటలపాటు పనిచేయిస్తున్నారు. రూ.60,000లు ఇస్తామన్న వాళ్లు రూ.5,000లు, రూ.10,000లు ఇచ్చి సరైన జీతాలు ఇవ్వకుండా నరకమంటే ఏమిటో అక్కడ ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. ఈ విధంగా జరగడం వల్ల వాళ్లు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి చాలాసార్లు రావడం జరిగింది. డా. ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి గారు చెప్పినట్లు ఈ పర్టిక్యులర్ ఇష్యూలో సౌదీ అరేబియాలో చమురు ధరలు పడిపోవడం వల్ల సౌదీ ఓగర్, సాద్ గ్రూప్‌లో గానీ చాలామంది ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లింది. వారిని తీసివేయాల్సి వచ్చింది. ఆ కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 4,830 మంది భారతీయులను తీసివేయడం జరిగింది. ఇది తెలిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు విదేశాంగ శాఖా మంత్రి శ్రీమతి సుష్మా స్వరాజ్ గారికి లేఖ వ్రాయడంతో బాటు, నేను కూడా స్వయంగా మేడమ్‌ని కలవడం జరిగింది. వారిలో తెలుగువారు 43 మంది ఉన్నారు. అక్కడ నుండి సౌదీ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి, వారిని రిక్వెస్ట్ చేసి ఎవరైతే పనివాళ్లు ఉన్నారో, ఈ 43 మంది తెలుగువారికి 6 నెలల నుండి రావలసిన జీతాలు, బకాయిలు ఇవ్వమని కోరడం జరిగింది. అక్కడ రెసిడెంట్ పర్మిట్స్ మీద ఇన్ని రోజులు ఉండాలని ఉంటుంది, అది దాటితే వయొలేషన్స్ ఉంటే, దానిపై జరిమానా వేస్తారు. అందుకని ఆ జరిమానాను తీసివేయమని, ఎగ్జిట్ వీసాని ఇవ్వమని, ఒక ఛార్జీని కూడా వాళ్లనే భరించమని రిక్వెస్ట్ చేశాము. వాళ్లు రీపాట్రియేషన్ చేశారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన వెంటనే మా అధికారి శ్రీ అశోక్ కుమార్ గారు స్వయంగా వెళ్లి, వాళ్ల ప్రాంతాలకు పంపడం జరిగింది. వచ్చిన వారికి కనీస మౌలిక సదుపాయాలు, భోజన సౌకర్యం కల్పించి, వెహికిల్స్‌ను ఏర్పాటు చేసి వారి వారి ఊళ్లకు పంపించాము. ఇవన్నీ చాలా జరుగుతున్నాయి. అయితే, దురదృష్టమేమంటే, కొన్ని విషయాలు సభ దృష్టికి కూడా తీసుకురావాలి. ఇరాక్‌లో అంతర్యుద్ధం వస్తే, 161 మందికి ఇబ్బంది కలిగింది. ఇక్కడ నుండి రెసిడెంట్ కమీషనర్ ఆఫ్ ఏపి భవన్, అక్కడ నుండి ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ మినిస్టర్ మాట్లాడతారు. నేరుగా మేము కూడా కొన్ని విషయాలు మాట్లాడాము. హై కమీషనర్, అంబాసిడర్స్‌తో కూడా మేము నేరుగా మాట్లాడాము. అక్కడ ఉండేవాళ్లు సమన్వయం చేసుకుని 161 మందిని తీసుకురావడం జరిగింది. ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ మినిస్ట్రీ వారు కొంత ఛార్జెస్ భరించి ఎయిర్‌పోర్టు వరకూ తీసుకువచ్చారు, అక్కడ నుండి మేము తీసుకువచ్చి వారిని వాళ్ల ఊళ్లకు చేర్చడమైనది. ఈ 161 మందిలో పశ్చిమ గోదావరి జిల్లావారు 123 మంది ఉన్నారు.

లిబియాలో 500 మంది టెక్నికల్ వర్కర్స్ ఇబ్బంది పడ్డారు. వారిని కూడా మేము రమ్మని అడిగితే 75 మంది ఇమ్మిగ్రెంట్స్ మాత్రం మేము మినిస్ట్రీ ఆఫ్ ఎన్ఆర్ఐ ఎఫైర్స్ ద్వారా తీసుకురావడమైనది. ఉజ్బెకిస్తాన్‌లో కూడా ఇండియన్ ఇమ్మిగ్రెంట్స్ ఉన్నారు. వాళ్లకు ఫిలిప్పైన్ లేబర్‌తో కొంత ఇబ్బంది వస్తే వారిని కూడా ఇక్కడకు తీసుకువచ్చాము. మా దృష్టికి వచ్చిన వెంటనే ప్రభుత్వం వెంటనే స్పందిస్తున్నదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

అదే విధంగా నైజీరియాలో శ్రీ టంగుటూరి శ్రీనివాస్ కిడ్నాప్ అయితే, ఆయన విషయంలో కూడా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని అంబాసిడర్‌తో మాట్లాడి అక్కడున్న తెలుగు అసోసియేషన్‌తో చెప్పి వారిని కూడా తీసుకురావడం జరిగింది. ఈ మధ్య కాలంలో డా. రామ్మూర్తిని తీసుకువచ్చాము. చిలీ దేశంలోని ఆండీస్ మంచు పర్వతాలపై చనిపోయిన పర్వతారోహకుడు శ్రీ మల్లి మస్తాన్ బాబు డెడ్‌బాడీని గుర్తించి, వాళ్ల సోదరికి కూడా ఎయిర్ టికెట్ ఇచ్చి అక్కడ నుండి తీసుకురావడమైనది. మీడియా ద్వారా గానీ, వేరే విధంగా గానీ మా దృష్టికి వచ్చిన అంశాలపై వెంటనే స్పందిస్తున్నాము. కొన్ని విషయాలను మాత్రం మనం అర్థం చేసుకోవాలి. కొంతమంది బాధితులు ఎవరైతే ఉన్నారో, వారు రిజిస్టర్డ్ ఏజెంట్స్ ద్వారా వెళ్లడం లేదు. నాన్ రిజిస్టర్డ్ ఏజెంట్స్, ఫేక్ ఏజెంట్స్ ద్వారా వెళుతున్నారు. దానిపై అవగాహనా సదస్సులను ఏర్పాటు చేయమని, వాల్ పోస్టర్లు వేయించమని జిల్లా కలెక్టర్లకు, జిల్లా ఏజెంట్స్‌కు ఆదేశాలిచ్చాము. కొన్ని కరపత్రాలు కూడా వేయించమని, ఇతర చర్యలు తీసుకోమని మేము ఆదేశాలిచ్చాము. ఈ అంశాలను జిఎడి ప్రొటోకాల్ అధికారి శ్రీ అశోక్ బాబు గారు కూడా పర్యవేక్షిస్తున్నారు.

ఉ. 10.50

అధ్యక్షా, ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాలి. ఈ మధ్యకాలంలో ఇది జరిగిన వెంటనే అందరు ఎస్పీలకు, కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చాము. అనంతపూర్ ఎస్పీ చేసిన కృషిని మనం గమనించాలి. 10 మండలాల్లోని 114 గ్రామాల్లో సర్వే చేస్తే, 144 మంది మహిళలు గల్ఫ్ దేశాలకు వెళ్లడం జరిగింది. వారిలో 27 మంది వెనక్కు వచ్చేశారు. 50 మందితో డైరెక్టుగా ఫోన్‌లో మాట్లాడితే కొంతవరకు బాగానే ఉందని చెప్పారు. మిగతా వాళ్లు మిస్సయ్యారు. దాదాపు పుణె, ఢిల్లీ, భివాండి, బళ్లారి, అనంతపురం, బెంగళూరు, కర్నూలు ప్రాంతాల్లో రెయిడ్ చేసి 114 మంది దళారుల్ని అరెస్టు చేసి కేసులు కూడా పెట్టాము. 265 మందిని రెస్క్యూ చేసి రీహాబిలిటేషన్ సెంటర్స్‌కు తరలించడం జరిగింది. అధ్యక్షా, ఈ సందర్భంలో అనంతపురం ఎస్పీ రాజశేఖర్ గార్ని నిజంగా అభినందించాలి. ఎందుకంటే, దీని మీద 2008, 2010, 2014లో కేసులు నమోదు చేసి బాగా పని చేయడం జరిగింది.

ఇంకొకటేమంటే, ఏపీఎన్ఆర్ఐ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం ఒకటి ఉంది. దాంట్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకు రూ.250 కట్టాల్సి ఉంటే కూడా గౌరవ ముఖ్యమంత్రి గారి సూచన మేరకు ఆ రెండు వందల యాభై రూపాయలు తీసేయడం జరిగింది. అక్కడ అథెంటికేషన్ ఆఫీసర్ ఉంటారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా గల్ఫ్ దేశాలకు వెళితే తప్పకుండా వారికి న్యాయం జరుగుతుంది. అదే సమయంలో సభ్యులు రాజేంద్రప్రసాద్ గారు ఒక సూచన ఇచ్చారు. మనకు సౌదీలో గానీ, ఇతర దేశాల్లో గానీ తెలుగు అసోసియేషన్లు చాలా ఉన్నాయి. ఆ శాఖ కూడా నా క్రిందకే వస్తుంది. వాళ్లతో మాట్లాడటం జరిగింది. అక్కడ ఒక్కో దేశానికి కోఆర్డినేటర్‌ని పెట్టి ఏవైనా ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులు వచ్చినప్పుడు వెంటనే ఆ దేశంలో ఉండే ఈ కోఆర్డినేటర్లు స్పందించేలా కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సాయాన్ని అందించడానికి కూడా ఆ కోఆర్డినేటర్లను నియమించడం జరిగింది. అది కూడా రెండో కార్యక్రమంగా చేయడం జరిగింది.

అంతేగాకుండా, వర్కర్లు ముఖ్యంగా మేస్త్రీలు, కార్పెంటర్లు గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లాలనుకుంటే ఈ సభ ద్వారా నేను వారికి చెప్పేదేమంటే రికగ్నైజ్డ్ ఏజెంట్స్ ద్వారా వెళ్లాలి, అథెంటికేషన్ చేయించుకోవాలి. ఏపీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అందుకోసం సంబంధిత కలెక్టరేట్లలో కూడా ఒక మెంబర్‌ని పెట్టి హెల్ప్ డెస్క్‌లు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాము. ఈ ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోంది. కాకపోతే అక్కడుండే వాళ్ల సంఖ్య నాకు తెలియదు. ఎందుకంటే, పాస్‌పోర్టు, వీసాజారీ వంటివి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటాయి. మేము కూడా చాలాసార్లు రిక్వెస్ట్ చేశాము. నేనే స్వయంగా విదేశాంగ శాఖ మంత్రి శ్రీమతి సుష్మాస్వరాజ్ గారిని కలిసి ఆ వివరాలు మాకిమ్మని అడిగాము. ఇప్పుడు ఏపీఎన్ఆర్‌టి అని ఒక సొసైటీని కూడా ఏర్పాటు చేశాము. తప్పకుండా ఈ ప్రభుత్వం విదేశాల్లో ఉండే తెలుగువారి భద్రత కోసం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి సారథ్యంలో అన్ని విధాలా, సకల చర్యలు తీసుకుంటుంది. దీనికి అన్ని విధాలా సహకరించవలసిందిగా సభ్యులందర్నీ కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః అధ్యక్షా, గల్ఫ్ దేశాల్లో ఎంతమంది తెలుగువారున్నారన్న విషయంలో పూర్తి సమాచారం లేని ప్రభుత్వం సార్ ఇది. కేంద్ర ప్రభుత్వం దగ్గర నుండి మన తెలుగువాళ్లు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాళ్లు ఎంతమంది గల్ఫ్ దేశాల్లో ఉన్నారో సమాచారం సేకరించలేకపోయామంటే that itself is a weakness. దాన్ని ముందు రెక్టిఫై చేయండి. నిజంగా ఉద్యోగాల్లో ఎంతమంది ఉన్నారు, జైళ్లలో ఎంతమంది ఉన్నారు, ఇరాక్‌లో గానీ, మరో గల్ఫ్ దేశంలో యుద్ధం వచ్చినప్పుడు జనాన్ని ఎయిర్‌లిఫ్టింగ్ ద్వారా తీసుకురావడం వంటి వాటి గురించి పెద్దలు డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు అడగలేదు. గల్ఫ్ దేశాల్లో ఉండి జైళ్లలో మగ్గుతున్న వాళ్లు, ఇంకా రకరకాల వాళ్ల గురించి మాత్రమే అడుగుతున్నారు.

డా.పల్లె రఘునాథ రెడ్డిః అధ్యక్షా, సభ్యులు శ్రీ పి.జె.చంద్రశేఖర్ రావు గారు మా ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తారని అనుకున్నాను. కానీ, పాజిటివ్‌గా రావడం లేదు. ఎన్నిరాత్రులు మేము నిద్ర లేకుండా, ఎంత ఇబ్బంది పడతామో వారికి తెలియదు. రాత్రి పన్నెండు, ఒంటి గంట సమయంలో ఫలానా వాళ్లు ఇరుక్కుపోయారని ఫోనొస్తుంది. మా అశోక్‌కుమార్‌కు, మాకు నిద్దరుండదు. వాస్తవానికి ఫేక్ వీసాతో ఇతర దేశాలకు వెళ్లిన వాళ్ల వివరాలు మన వద్ద ఉండవు. అన్‌రికగ్నైజ్డ్ ఏజెంట్స్ ద్వారా వెళ్లిన వాళ్ల వివరాలు కూడా మన దగ్గర ఉండవు. ఆ వివరాలు కావాలని సెంట్రల్ గవర్నమెంట్‌ని రిక్వెస్ట్ చేశాము. ఎంతమంది జైల్లో ఉన్నారనే వివరాలను బయటకు తీయమని, నేరం ఎదుర్కొంటున్న ఏజెంట్స్‌కు కూడా చెప్పాము. ఎవరైనా ఇబ్బంది పడుతున్నారని మా దృష్టికి వస్తూనే, సమస్యని వెంటనే పరిష్కరిస్తున్నాము.

MR.CHAIRMAN: Next question [Q.No.9529(69)] postponed at the request of the Member. Last Question. Mr.Ummareddy Venkateswarlu garu, please put your question.

SRI.UMMAREDDY VENKATESWARLU: Sir, I put the question.

## కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు

ప్రశ్న నెం.9524 (70)

సర్వశ్రీ ఉమ్మా రెడ్డి వెంకటేశ్వర్లు, దేవసాని చిన్న గోవింద రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలోని కౌలు రైతులకు రూ.1 లక్ష వరకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయడమయిందా?

ఆ) అయితే, ఇప్పటి వరకు జిల్లావారీగా రుణాలు మంజూరు చేయబడిన కౌలురైతుల సంఖ్యకు సంబంధించిన వివరాలేమిటి?

గౌరవ వ్యవసాయ, అగ్రిప్రాసెసింగ్, మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధన, పాడిపరిశ్రమాభివృద్ధి & మత్స్య పరిశ్రమల శాఖ మంత్రివర్యులు (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు)

అ) అవునండీ.

ఆ) వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

**శాసనపరిషత్తు ప్రశ్న నెం. 9524 లోని (బి) ఖండానికి సమాధానం**

**2011-12 నుండి 2016-17 వరకు (20-03-2017 వరకు) రుణ మరియు ఇతర అర్హతా కార్డులు మరియు రుణాలతో జారీ చేయబడిన జిల్లా వారీ కౌలు రైతుల వివరాలు**

(రూ.కోట్లలో)

| వరుస సంఖ్య | జిల్లా | 2011-12 | | 2012-13 | | 2013-14 | |
|---|---|---|---|---|---|---|---|
| | | రుణాలతో పాటు జారీ చేసిన ఎల్ఇసిల సంఖ్య | మొత్తం | రుణాలతో పాటు జారీ చేసిన ఎల్ఇసిల సంఖ్య | మొత్తం | రుణాలతో పాటు జారీ చేసిన ఎల్ఇసిల సంఖ్య | మొత్తం |
| 1 | శ్రీకాకుళం | 2050 | 2.08 | 1517 | 1.69 | 347 | 0.47 |
| 2 | విజయనగరం | 4512 | 4.78 | 6949 | 6.92 | 8873 | 7.32 |
| 3 | విశాఖపట్టణం | 4686 | 6.34 | 357 | 0.68 | 632 | 2.27 |
| 4 | తూర్పు గోదావరి | 20315 | 34.07 | 27290 | 38.27 | 50545 | 89.43 |
| 5 | పశ్చిమ గోదావరి | 42034 | 100.02 | 50565 | 147.08 | 62116 | 135.96 |
| 6 | కృష్ణ | 28211 | 49.11 | 7431 | 15.04 | 9519 | 25.72 |
| 7 | గుంటూరు | 22926 | 50.90 | 8648 | 20.13 | 11556 | 26.54 |
| 8 | ప్రకాశం | 1162 | 3.58 | 2771 | 2.91 | 770 | 3.00 |
| 9 | నెల్లూరు | 5864 | 19.29 | 5100 | 25.00 | 4887 | 20.18 |
| 10 | కర్నూలు | 6552 | 36.06 | 4603 | 10.50 | 3500 | 5.02 |
| 11 | అనంతపురము | 2965 | 1.52 | 70 | 1.29 | 91 | 0.20 |
| 12 | కడప | 523 | 4.94 | 974 | 2.72 | 3151 | 1.34 |
| 13 | చిత్తూరు | 22325 | 9.51 | 986 | 2.26 | 388 | 0.68 |
| | మొత్తం | *164125* | *322.20* | *117261* | *274.49* | *156375* | *318.13* |

## 2014-15 మరియు 2015-16 లలో రుణ మరియు ఇతర అర్హతా కార్డులు మరియు రుణాలతో జారీ చేసిన జిల్లా వారీ కౌలు రైతుల వివరాలు

(రూ. కోట్లలో)

| వరుస సంఖ్య | జిల్లా | 2014-15 | | 2015-16 | |
|---|---|---|---|---|---|
| | | రుణాలతో పాటు జారీ చేసిన ఎల్ఇసిల సంఖ్య | మొత్తం | రుణాలతో పాటు జారీ చేసిన ఎల్ఇసిల సంఖ్య | మొత్తం |
| 1 | శ్రీకాకుళం | 27 | 0.02 | 670 | 2.01 |
| 2 | విజయనగరం | 180 | 0.11 | 707 | 0.82 |
| 3 | విశాఖపట్టణం | 32 | 0.08 | 2143 | 3.72 |
| 4 | తూర్పు గోదావరి | 35290 | 59.17 | 44272 | 84.63 |
| 5 | పశ్చిమ గోదావరి | 316 | 0.52 | 23067 | 43.93 |
| 6 | కృష్ణ | 39 | 0.08 | 19713 | 65.58 |
| 7 | గుంటూరు | 3204 | 23.31 | 653 | 3.26 |
| 8 | ప్రకాశం | 109 | 1.66 | 6832 | 27.28 |
| 9 | నెల్లూరు | 0 | 0.00 | 758 | 6.34 |
| 10 | కర్నూలు | 126 | 0.19 | 10 | 0.07 |
| 11 | అనంతపురము | 0 | 0.00 | 650 | 1.99 |
| 12 | కడప | 0 | 0.00 | 715 | 2.12 |
| 13 | చిత్తూరు | 80 | 0.26 | 241 | 1.66 |
| | మొత్తం | ***39403*** | ***85.39*** | ***100431*** | ***243.41*** |

**2016-17 (20-03-2017 వరకు) లో రుణ మరియు ఇతర అర్హతా కార్డులు మరియు రుణాలతో జారీ చేసిన జిల్లా వారీ కౌలు రైతుల వివరాలు**

(రూ. కోట్లలో)

| వరుస సంఖ్య | జిల్లా | 2016-17 as on 20-03-2017 | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | రుణాలతో పాటు జారీ చేసిన ఎల్ఇసిల సంఖ్య | మొత్తం | రుణాలతో పాటు జారీ చేసిన సిఓసిల సంఖ్య | సిఓసి రుణ మొత్తం | రుణాలతోపాటు జారీ చేసిన ఎల్ఇసిలు మరియు సిఓసిల మొత్తం సంఖ్య | వెరశి మొత్తం |
| 1 | శ్రీకాకుళం | 478 | 1.04 | 3 | 0.01 | 481 | 1.05 |
| 2 | విజయనగరం | 577 | 2.96 | 460 | 0.78 | 1037 | 3.74 |
| 3 | విశాఖపట్టణం | 825 | 1.65 | 11 | 0.04 | 836 | 1.69 |
| 4 | తూర్పు గోదావరి | 53129 | 116 | 105 | 0.18 | 53234 | 116.18 |
| 5 | పశ్చిమ గోదావరి | 17841 | 41.48 | 133 | 0.45 | 17974 | 41.93 |
| 6 | కృష్ణ | 1757 | 6.7 | 94 | 0.34 | 1851 | 7.04 |
| 7 | గుంటూరు | 1250 | 8.97 | 0 | 0.00 | 1250 | 8.97 |
| 8 | ప్రకాశం | 828 | 5.08 | 1667 | 5.15 | 2495 | 10.23 |
| 9 | నెల్లూరు | 850 | 5.03 | 353 | 1.86 | 1203 | 6.89 |
| 10 | కర్నూలు | 1569 | 9.91 | 0 | 0.00 | 1569 | 9.91 |
| 11 | అనంతపురము | 815 | 4.15 | 0 | 0.00 | 815 | 4.15 |
| 12 | కడప | 547 | 1.84 | 4 | 0.01 | 551 | 1.85 |
| 13 | చిత్తూరు | 0 | 0 | 5 | 0.02 | 5 | 0.02 |
| | మొత్తం | ***80466*** | ***204.81*** | ***2835*** | ***8.84*** | ***83301*** | ***213.65*** |

ప్రత్తిపాటి పుల్లారావు,
వ్యవసాయ, అగ్రి-ప్రాసెసింగ్, మార్కెటింగ్ & గిడ్డంగులు,
పశు సంవర్ధన, పాడి పరిశ్రమాభివృద్ధి & మత్స్య పరిశ్రమల
శాఖ మంత్రి

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (స్థానిక సంస్థలు – గుంటూరు) ః అధ్యక్షా, మంత్రి గారు సభా సమక్షంలో దీనికి సంబంధించిన సమాచారాన్ని పెట్టారు. అయితే, మంత్రి గారే ఒకసారి నిశితంగా పరిశీలిస్తే రాష్ట్రంలో కౌలుదార్ల పరిస్థితి ఏవిధంగా దిగజారిపోయిందో కనబడుతుంది. ఈ రోజు ఎవరు కాదన్నా, అవునన్నా రాష్ట్రంలో ప్రత్యేకంగా గోదావరి జిల్లాల్లో గానీ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గానీ భూ యజమానులంతా ఉద్యోగాలు చేసుకుంటూ హైదరాబాదులోనో, ఇంకోచోటో స్థిరపడి ఉన్నారు. ఇది వాస్తవం. దాన్ని కాదనడం లేదు. ఆ భూమి కౌలుదార్లకే పోతోంది. కాబట్టి, ఈ ప్రాంతంలోని 60 నుండి 65 శాతం భూముల్ని కౌలుదార్లే సాగు చేస్తున్నారు. ఒకసారి ఆలోచిస్తే, కౌలుదార్లకు బ్యాంకుల నుండి సరైనటువంటి రుణాలు దొరకడం లేదు. ప్రభుత్వం నుండి వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి కౌలుదారులకు పోవడం లేదు. కౌలుదార్లు బ్యాంకులకు వెళుతుంటే మీ పాసు పుస్తకాలు తెమ్మని చెబుతున్నారు. అలాంటప్పుడు కౌలుదార్లకు పాసు పుస్తకాలు ఎక్కడ నుండి వస్తాయో అర్థం కావడం లేదు. ఇన్ని విధాల కౌలుదార్లను బ్యాంకర్లు ఇబ్బందిపెడుతుంటే వారు వ్యవసాయం ఎలా చేస్తారు? నకిలీ విత్తనాలు వాడి కౌలుదార్లు నష్టపోతే, ఎకరానికి రూ.25,000 నుండి రూ.30,000 వరకు ఈ మిర్చి పంటలాంటి దానికి కౌలు ఇవ్వాల్సి

ఉన్నప్పుడు, ఆ పంటను తీసేసి మళ్లీ పంటను వేసుకుంటే కౌలుదార్లకు వ్యవసాయం ఏవిధంగా గిట్టుబాటు అవుతుందనే దానిమీద ఒక క్షుణ్ణమైన పరిశీలన జరగడం లేదు.

అధ్యక్షా, ఇటీవల తిరుపతిలో ఒక సభ జరిగింది. ఆ విషయం మంత్రి గారికి కూడా తెలుసు. వ్యవసాయ శాఖాధిపతులు, శాస్త్రజ్ఞులు అందరూ ఆ సభకు వెళ్లారు. 2016, డిసెంబరులో ఆ సభ జరిగింది. ఆ సభకి నీతి ఆయోగ్ సభ్యులు శ్రీ రమేష్ చంద్ర కూడా హాజరయ్యారు. ఆయన వచ్చినప్పుడు చాలా క్షుణ్ణంగా డిస్కస్ చేశారు. కౌలుదార్ల పరిస్థితి ఏమిటనేది చర్చించారు. కౌలుదార్ల పరిస్థితి ఏమిటన్నప్పుడు వాళ్లు రెండు, మూడు సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. నీతి ఆయోగ్ సభ్యులు ఆ సమస్యల్ని ఎందుకు సమీక్షించారంటే, ఇక్కడున్నటువంటి వ్యవసాయ శాఖ, అనుబంధ సంస్థల యంత్రాంగం కానీ, లేకుంటే ఉన్నతాధికారులు గానీ సమీక్షించలేదు. అక్కడ సమీక్షించిన వాటిల్లో మూడు అంశాలు క్షుణ్ణంగా చెప్పేశారు. ఒకటేమంటే ఎన్‌పిఏలు వ్యవసాయ శాఖ నుండి చాలా తక్కువ. బ్యాంకులకు రీపేమెంట్ చాలా బాగాచేసేవాళ్లు ఎవరైనా ఉన్నారంటే అది వ్యవసాయదారులే. వారు తీసుకున్న రుణాలే రీపేమెంట్ చేస్తున్నారు. 90 శాతం పైనే రికవరీ ఉంటుంది. కేవలం ఏడెనిమిది శాతం మంది రైతులు మాత్రమే బకాయి పడుతున్నారు. అందువల్ల అప్పులిస్తే, రైతుల దగ్గర నుండి డబ్బులు తిరిగి రావేమోనన్న భయం బ్యాంకర్లకు లేదు. అయితే, ఎంఎస్‌పి నిర్ణయంలో హేతుబద్ధత లేదని కూడా ఆ సభలో చెప్పారు. ఎంఎస్‌పి సక్రమంగా నిర్ణయించడం లేదు. ఆ విషయంలో స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు కూడా తుంగలో తొక్కేశారు. అంతేగాకుండా, స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల్లో చాలా పంటలకు ధర తగ్గినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని కూడా ఆయన సిఫార్సు చేశారు, వాటిని కూడా ఇవ్వడం లేదని క్షుణ్ణంగా ఆ సభలో చెప్పినప్పుడు డేటా పరిశీలించాము. ఇప్పుడు మంత్రి గారిచ్చిన డేటా చూస్తే, ఆశ్చర్యమేమంటే, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో జీరోపర్ఫార్మెన్స్ ఉంది. ఒక్కరికి కూడా కొత్త రుణాలు ఇవ్వలేదు. దాదాపు 23 లక్షల మంది కౌలురైతులు రాష్ట్రంలో ఉన్నారంటే, వాళ్లలో రెన్యువల్ చేసింది కేవలం 4 లక్షల మందికి మాత్రమే. కొత్తగా కార్డులిచ్చిన వాళ్లు లక్షన్నర మంది కూడా లేరు. రుణ అర్హత కార్డులివ్వనివ్వండి.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావుః ఎనభై వేలండి.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుః అధ్యక్షా, కొత్తగా కార్డులిచ్చింది ఎనభై వేల మందికి. ఇంత నిర్లక్ష్య వైఖరితో ప్రభుత్వం పని చేస్తుంటే ఎలా? రాబోయే రోజుల్లో ఎక్కువ మంది కౌలు రైతుల చేతుల్లోనే వ్యవసాయం ఉండబోతుంటే, వారి ప్రయోజనాలను చూడకుండా, వారి అవసరాలను కనిపెట్టకుండా, వారు నష్టపోయినప్పుడు ప్రభుత్వం ఆదుకోలేకపోతే ఏ విధంగా వ్యవసాయం ముందుకు వెళుతుందో ఒకసారి మంత్రి గారు ఆలోచించి, దీన్ని సరిదిద్దడానికి ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారనేది చెప్పవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను .

ఉ. 11.00

కౌలురైతుల చట్టం 2011 సంవత్సరం నుంచి ఉన్నది. కానీ, మన రాష్ట్రంలో అది అమలు కావడం లేదు. ఆ చట్టాన్ని ఏవిధంగా సరిదిద్దుకుందామనే ఆలోచన మన ప్రభుత్వం చేయడం లేదు. కౌలు రైతులు నేడు పెరుగుతున్న నేపథ్యంలో వారి ప్రయోజనాలను కాపాడి, వారితో వ్యవసాయాన్ని సక్రమంగా

చేయించాలి. వ్యవసాయమే కాక ఫిషరీస్‌లో ఉన్న వారితో కూడా సక్రమంగా చేయించి వారి ద్వారా ఈ రాష్ట్రంలో ఆహారధాన్యాల ఉత్పత్తులను పెంచడానికి, ఈ రాష్ట్రంలో ఆహారభద్రతను కాపాడడానికి ప్రభుత్వం కొత్తగా ఎటువంటి చర్యలు చేపట్టబోతుందనే విషయాన్ని మంత్రిగారు తెలియజేయాలి. ఈ విషయాన్ని మంత్రిగారు ప్రాక్టికల్‌గా ఆలోచించి ఒక డైరక్షన్‌ను ఇచ్చి మా సలహాలను కూడా వాస్తవిక రూపంలోనే తీసుకోవలసిందిగా నేను కోరుతున్నాను. కౌలురైతులకు ఏవిధంగా కొత్తగా రుణాలు ఇవ్వబోతున్నారు? చిత్తూరు జిల్లాలో ఒక్క కౌలురైతు కూడా లేరా? ఎందుకంటే, వారిచ్చిన డేటా ప్రకారం చిత్తూరు జిల్లాలో, ప్రకాశం జిల్లాలో జీరో అని చూపించారు. తూర్పుగోదావరి జిల్లాలో కొంత ఎక్కువమంది ఉన్నారు తప్ప మిగిలిన జిల్లాల్లో ఎవరూ లేరు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని కాపాడడానికి, కౌలురైతులను కాపాడడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నదో చెప్పవలసిందిగా నేను తమరిద్వారా కోరుతున్నాను.

శ్రీ సి.రామచంద్రయ్య (శాసనసభా నియోజక వర్గం) ః అధ్యక్షా, ఇండియాలో రైతు ఎప్పుడూ కూడా సెల్లర్స్ మార్కెట్‌లో లేడు. సరకు కొనేవాడు ఏ రేటును ఇస్తే ఆ రేటుకు అమ్మే పరిస్థితి రైతుకు ఉంది. ధాన్యం కొనుగోలుకు గత మూడు సంవత్సరాలు కనీస మద్ధతు ధర 3 శాతం పెంచారు. కానీ, గోధుమకు కనీస మద్ధతు ధర కొంచెం ఎక్కువ శాతం పెంచారు. కేంద్రప్రభుత్వం ధాన్యానికి కనీస మద్ధతు ధర 3 శాతం పెంచింది. కానీ, average inflation rate 5 శాతంగా ఉంది. అంటే, వారు పెంచినటువంటి కనీస మద్ధతు ధర ద్రవ్యోల్బణాన్ని కవర్‌చేసే పరిస్థితిలో లేదు. మరి ఏవిధంగా రైతుల ఆదాయం మారుతుంది? రాబోయే ఐదు సంవత్సరాలలో డబుల్ చేస్తామని చెప్పారు. కాబట్టి ఎప్పుడు కేంద్రప్రభుత్వాన్ని మనం కన్‌విన్స్ చేయలేకపోతామో అప్పుడు రాష్ట్రప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ముందుకు రావాలి. మొన్ననే కేరళలో బోనస్ ఇచ్చారు. ఆ విధంగా మనం కూడా రైతులకు బోనస్ ఇవ్వాలి. ప్రభుత్వం ఎప్పుడూ రైతులకోసం కమిటెడ్‌గా ఉన్నట్లు ఇంతకుముందు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చెప్పారు. స్వామినాథన్ కమీషన్ రిపోర్టును అమలుచేస్తున్నామని చెబుతున్నారు. దేశంలో ఆయనను శ్రీ నారా చంద్రబాబునాయుడు గారే ఛాంపియన్‌గా చేశారు. ఆయనే ఇక్కడ అధికారంలో ఉన్నాడు. రైతులది చాలా జటిలమైన సమస్య. రైతుల ఆత్మహత్యలు మొదలైనాయి. రాష్ట్రంలో విపరీతంగా కరవు విలయతాండవం చేస్తోంది. వాళ్లను రాష్ట్రప్రభుత్వం రక్షించవలసిన అవసరముంది. కనీస మద్ధతు ధరను పెంచడం కోసం కేంద్రప్రభుత్వాన్ని కన్‌విన్స్ చేయమనండి లేదా రైతులకు బోనస్ అయినా ఇవ్వమనండి.

శ్రీ సోము వీర్రాజుః అధ్యక్షా, కొత్తగా శాసనపరిషత్ సభ్యుడిగా నేను సభలోకి ప్రవేశించాను. నా మనసులో ఉన్న అభిప్రాయాన్ని చెప్పడానికి నేను ప్రయత్నిస్తున్నాను. నేడు మనం క్వింటాలు ధాన్యాన్ని రూ.1,050 లకు కొనుగోలు చేస్తున్నాము. వాటిని బియ్యంగా ఆడిస్తే రూ. క్వింటాలు ధర రూ.2,100 లు అవుతుంది. దీని ప్రకారం కిలో బియ్యం లాభంతో కలిపి రూ.25.00 లు అమ్మవలసి ఉండగా మార్కెట్‌లో రూ.40 లకు అమ్ముతున్నారు. గతంలో సభ్యులు శ్రీ చంద్రశేఖర రావు గారు కిలో బియ్యం రూ.50.00 లకు కూడా మార్కెట్‌లో కొనుగోలు చేసినట్లు సభలో చెప్పారు. నేను శాసనపరిషత్ సభ్యునిగా ఎన్నికైన తర్వాత మార్కెటింగ్ శాఖాధికారులను సభ్యులను కూడా కలిశాను. క్వింటాలు ధాన్యం మనం రూ.1,500 లకు కూడా కొనుగోలు చేయడం లేదు. కానీ, కిలో సన్నబియ్యం రూ.53.00 లకు కూడా మార్కెట్‌లో అమ్మడం జరుగుతోంది. రాష్ట్రప్రభుత్వం క్వింటాలు ధాన్యం రూ.2,000 లకు కొనుగోలు చేయించి, సన్నబియ్యం

మార్కెట్‌లో రూ.45 లకు అమ్మితే, వినియోగదారునికి ఎనిమిది రూపాయలు కిలోబియ్యానికి మిగులుతుంది. వ్యవసాయదారునికి క్వింటాలు ధాన్యానికి రూ.2,000 చెల్లిస్తే, వారికి రూ.500 లు ఒక బస్తాకు అదనంగా వస్తుంది. ఇది మన రాష్ట్రంలో మనం చేయలేమా? ఈ సమస్యకు ఎప్పటికైనా పరిష్కారం జరగాలి. సభ్యులు శ్రీ రామచంద్రయ్యగారు చాలా మంచి విషయం చెప్పారు. అది రాష్ట్రప్రభుత్వం ఆలోచించవలసిన విషయం. ఇది పరిష్కారం చేయవలసినటువంటి అంశం. ప్రతి సంవత్సరం రూ.10 వేలకోట్లు రైతులు నష్టపోతున్నారు. అదనపు రేటుతో ప్రజలు కొనుగోలు చేసి వారు కూడా నష్టపోతున్నారు. దీనిగురించి మన రాష్ట్రప్రభుత్వం ఆలోచించవలసిన అవసరముంది. ఒక కొబ్బరికాయకు కేవలం రూ. 2 లు మాత్రమే రైతుకు మిగులుతుంది. రైతు నుంచి కేవలం రూ.3 లకే కొబ్బరికాయను కొనుగోలు చేసి మార్కెట్‌లో రూ.20 లకు అమ్ముతున్నారు. మన రాష్ట్రంలో మనమే ఒక సొసైటీని ఏర్పాటుచేసి రైతునుంచి రూ.6 లు లేదా రూ.7 లకు కొబ్బరికాయను కొనుగోలు చేసి రూ.10 లకు మార్కెట్‌లో అమ్మించాలి. రాష్ట్రంలో అనేక దేవాలయాలు ఉన్నాయి. అన్ని దేవాలయాలు కొబ్బరికాయలను కొనుగోలు చేసి మార్కెట్‌లో అమ్మే విధంగా దేవాదాయ శాఖ మంత్రిగారికి ఆదేశాలను ఇప్పించండి. అదే విధంగా వివిధ రకాల సరకుల గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలి. దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలి. నేను ఎవరినీ విమర్శించడం లేదు. వీటిపై విజ్ఞులైనటువంటి సభ్యులంతా ఆలోచించాలి.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు లేవనెత్తిన అంశం గురించి గతంలో నుంచి ఒక ఆలోచన ఉంది. దీనిని మంత్రిగారికి కూడా గుర్తుచేస్తున్నాను. National Commission for Agricultural Costs and Prices (NCACP) జాతీయ స్థాయిలో ఉండే కంటే రాష్ట్ర స్థాయిలో ఉంటే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారిని కూడా దృష్టిలో పెట్టుకుని స్థానిక వ్యవసాయ పరిస్థితులను అక్కడున్న ఖర్చులను ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కనీస మద్దతు ధరను ఫిక్స్ చేసుకోవచ్చు. నా సలహా ఏమిటంటే, కేంద్రంలో ఉండే NCACP కంటే రాష్ట్ర స్థాయిలో State Level Commission for Agricultural Costs and Prices సంస్థను కూడా పెట్టుకోవడానికి జాతీయ స్థాయిలో మంత్రిగారు ప్రయత్నం చేస్తే ఇక్కడ ఏదైనా చేసుకోవడానికి మనకు అవకాశముంటుందని నేను తమరిద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

ఉ. 11.10

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, పెద్దలు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు, శ్రీ సి. రామచంద్రయ్య గారు, శ్రీ సోము వీర్రాజు గారు కౌలు రైతులకు సంబంధించిన అంశాలను సభ దృష్టికి తీసుకు రావడం జరిగింది. ప్రభుత్వ అంచనాల ప్రకారం మన రాష్ట్రంలో 16లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వారికోసం కౌలు రైతుల చట్టాన్ని కూడా తీసుకురావడం జరిగింది. ప్రధానంగా ఉమ్మారెడ్డి గారు చెప్పినట్లు, ఆర్థిక సమస్యల నుండి రుణం పొందడానికి కానీ, సబ్సిడీ సౌకర్యం పొందడానికి, పంటల బీమా చేయడానికి, పంట నష్టపరిహారం పొందడానికి చట్టాలను చేశారు. కానీ, ఈ సంవత్సరం, 6,00,717 మందికి లోన్ ఎలిజిబిలిటి కార్డులు జారీ చేయడం జరిగింది. ప్రధానంగా పెద్దలు ఉమ్మారెడ్డిగారు చెప్పినట్లు, ఆశించిన స్థాయిలో కౌలు రైతులకు రుణాలు అందడం లేదనేది వాస్తవం. దానికి కారణం భూమిని కౌలుకిచ్చి, ఆ భూస్వామే వెళ్లి బ్యాంకులో రుణాలు తీసుకుంటున్నాడు. దానివల్ల బ్యాంకులు నిరాశక్తి కనబరుస్తున్నాయి.

రెండోది భూమి గ్యారెంటీ లేకపోవడం వలన, సకాలంలో లోన్ రీపేమెంట్ చేసే విషయంలో జాప్యం జరుగుతుండడం వల్ల బ్యాంకులు కొంత నిర్లిప్తత వహిస్తున్నాయి. దానికోసమే ఇటీవల గౌరవముఖ్యమంత్రి గారి సమక్షంలో అగ్రికల్చర్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి గారు, కమీషనర్‌గారు, మేమంతా సమావేశమై, యాక్షన్ ప్లాన్ గురించి చర్చించడం జరిగింది. వచ్చే SLBCలో ఖరీఫ్, రబీ పంటలకు నిర్ణయించి టార్గెట్‌లో 5 నుంచి 10% కౌలు రైతులకు ఇస్తాము.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుః అధ్యక్షా, 5 నుంచి 10 శాతం అంటే అది చాలా తక్కువ. అది ఇచ్చినా ఇవ్వనట్టే.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః 5 నుంచి 10 శాతం ఖచ్చితంగా బ్యాంకుల నుంచి ఇవ్వాలని మేము చర్చించాము, మేము చర్చించింది మీ దృష్టికి తీసుకువస్తున్నాము, దానికి మీ సూచనలు కూడా తప్పకుండా తీసుకుంటాము. ఇంకా మీ దగ్గరేమైనా అదనంగా సూచనలు ఉంటే మాకు చెప్పండి. రేపు SLBC (State Level Bankers Committee) ముఖ్యమంత్రి గారి సమక్షంలో జరుగుతోంది కాబట్టి, మీరు చేసిన సూచనలను గురించి కూడా అక్కడ చర్చించడం జరుగుతుంది.

రెండోది, జెఎల్‌జి (జాయింట్ లయబిలిటీ గ్రూపులు) కూడ ఏర్పాటు చేస్తున్నాము. ఇవి గతంలో ఉన్నాయి, ఇటీవల ఎల్ఈసీకి మార్చాము. మరల తిరిగి జాయింట్ లయబిలిటీ గ్రూపులుగా ఏర్పాటు చేసి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాము. మూడోది స్వయం శక్తి సంఘాలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. ఇప్పటికి 1070 సంఘాలను ఏర్పాటు చేశాము.

డ్వాక్రా గ్రూపులు లాగానే రైతులను కూడా స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేసి, వాటిలో పొదుపు చేయడంతో పాటు, రుణసౌకర్యాన్ని కల్పించే ప్రయత్నం కూడా చేస్తున్నాము. ఇప్పటికి 1070 సంఘాలను ఏర్పాటు చేశాము. ఈవిధంగా కౌలు రైతులకు రుణాలు ఇప్పించే విధంగా చేస్తున్నాము.

సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డిగారు చెప్పిన సూచనలు తీసుకుని, జరగబోయే ఎస్ఎల్‌బీసీలో వాటిమీద కూడా చర్చించి, రాబోయే రోజులలో కౌలురైతులకు ఎక్కువ రుణాలు ఇచ్చేవిధంగా చేయడానికి చర్చించడం జరుగుతుంది. నీతి ఆయోగ్ కమిటి మీటింగు ఇటీవల తిరుపతిలో జరిగింది. నీతి ఆయోగ్ కూడా కౌలు రైతుల చట్టాన్ని పరిశీలించడం జరుగుతుంది. దానికితోడు త్వరలోనే ఒక మీటింగు ఏర్పాటు చేసి, మీ సూచనలన్నీ కూడా పరిగణనలోకి తీసుకుంటామని మీకు తెలియజేస్తున్నాను.

అదేవిధంగా గిట్టుబాటు ధరకు సంబంధించి, స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని కేంద్రం మీద ఒత్తిడి తీసుకువస్తూనే ఉన్నాము. మనకున్న బడ్జెటుని పోల్చుకుంటే కనీస మద్దతు ధరకి కేంద్ర సహకారం అవసరం. మీరన్నట్లు, సిఎసిపి కాకుండా స్టేట్ కమీషన్‌ని ఏర్పాటు చేస్తే, దానికి ఆర్థిక సహకారం అవసరం. ఆవిధంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రానికి రికమెండేషన్స్ పంపించి ఒత్తిడి తెస్తుంది. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలనే విధంగా ఒత్తిడి చేస్తున్నాము. అదేవిధంగా రానున్న కాలంలో కనీస మద్దతు ధర లేని పంటలైన పొగాకుకు కేంద్రం మరియు రాష్ట్రం కలిసి రెండువేల రూపాయలు, ఉల్లిపాయలకు రెండొందల రూపాయలు బోనస్ కింద ఇచ్చాము. అదేవిధంగా ఇటీవల నిమ్మకాయల ధరలు పడిపోతే అవి మనమే కొని రైతు బజార్ల ద్వారా అమ్మించాము.

అదేవిధంగా సభ్యులు శ్రీ సోము వీర్రాజు ధాన్యాన్ని రూ.1050కి కొంటే రూ.21లకే అమ్మవచ్చు కదా అంటున్నారు. రైతుబజార్లలో ఆవిధంగా అమ్ముకునేలా రైతులకు వెసులుబాటు కల్పించాము. వారు చెప్పింది కూడా వాస్తవం. ఎందుకంటే ఇప్పుడు బయట రూ.50లు అమ్ముతున్నారు. కానీ మార్కెట్ ధర చూసుకుంటే రూ.15, రూ.10. వాటిని ఎంత కన్వర్షన్ చేసినప్పటికీ రూ.30లకంటే ఎక్కువ ధర పలికే

అవకాశం లేదు. రైతుబజార్లో కూడా రైతులకు పండించిన ఉత్పత్తులు అమ్ముకునేలా వెసులుబాటు కల్పించాము. మీరన్నది వాస్తవం. రూ.30లు పెట్టి, రూ.50లు, రూ.40లు అమ్మవలసిన పనిలేదు. రైతులకు కూడా సన్నబియ్యం గానీ, ఎ-గ్రేడు వెరైటీలు గానీ తీసుకువచ్చి రైతుబజార్లలో అమ్ముకునే వెసులుబాటు కల్పించాము, ఈ రైతు బజార్లు వారికోసమే ఏర్పాటు చేశాము. ఇప్పటికి మొత్తం 83 రైతుబజార్లు ఉన్నాయి, ఇంకా 33 మండలాల్లో వీటి ఏర్పాటు ప్రాసెస్‌లో ఉంది. పరోక్షంగా రైతులకు మేలు కోసం ఎన్ని రైతుబజార్లైనా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాము. ఎక్కడో మార్కెట్‌కి వెళ్లి రూ.50, రూ.40 అమ్మేబదులు, రైతుకి మద్ధతు ధర కన్నా ఎక్కువ వచ్చేప్పుడు, ఈ రైతుబజార్లలో అమ్మి ఎక్కువ లాభం తెచ్చుకునేందుకు వీటిని ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు కందులు రూ.50కి కొంటున్నాము. సుమారు 77కేంద్రాల్లో కందులను కొనుగోలు చేయడం జరుగుతోంది. ఇప్పటివరకు సుమారు నాలుగు లక్షల యాభైవేల క్వింటాళ్లు కొన్నాము. నేను ఈరోజు కూడా చిలకలూరిపేటలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాను. రాష్ట్రంలో ఇంకా ఎక్కడైనా కందులు ఉంటే అక్కడ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర అందించడానికి ఈ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదని నేను మీద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, గౌరవసభ్యులు చేసిన సూచనలను పరిగణనలోనికి తీసుకుంటూనే, కౌలు రైతులతో బాటు, కనీస మద్దతు ధర పెంచడానికి, ప్రతిసారి కేంద్రం నిర్ణయించిన దానిలో రాష్ట్రప్రభుత్వం కూడా ఇంటర్‌ఫియర్ అవడం జరుగుతోందని మీ ద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

MR. CHAIRMAN: Question Hour is over. Now, I will take-up Item No. II. All the papers are deemed to have been laid on the Table of the House.

**2.PAPERS TO BE LAID ON THE TABLE:**

1. A copy of the 16th Annual Report of the Eastern Power Distribution Company of Andhra Pradesh Limited, for the Year 2015-16, as required under Section 394 of the Companies Act, 2013.
2. A copy of the 41st Annual Report of the Andhra Pradesh State Film Television and Theatre Development Corporation Limited, for the Year 2015-16, as required under Section 394 of the Companies Act, 2013.
3. Copies of the Annual Reports and Accounts of the Andhra Pradesh State Minorities Finance Corporation Limited, for the Years 2009-2010, 2010-2011, 2011-2012 and 2012-2013, as required under Section 619 (A) (3) of the Comapnies Act, 1956 and Article 99 (A) & (B) of the Memorandum and Articles of Association of Andhra Pradesh State Minorities Finance Corporation Limited.

We will go for Tea-Break. After Tea-Break, we will continue with the discussion on the Budget. Now, Tea-Break for 15 Minutes.

(Then, the House was adjourned at 11.17 a.m. for Tea-Break for 15 minutes)

* * *

మ. 12.00

After Tea-Break, the House Re-assembled at 12-05 p.m.
(The Hon'ble Chairman in the Chair)

* * *

## 3.SPECIAL MENTION

SRI PILLI SUBHASH CHANDRA BOSE: Respected Chairman, Sir, This is for the kind consideration of the Hon'ble Chief Minister. మన రాష్ట్రంలో దాదాపుగా 17వేల మంది హోంగార్డులు ఉన్నారు. పోలీస్ కానిస్టేబుల్స్‌తో సమానంగా ఉత్సవాలప్పుడు వారు విధులు నిర్వహిస్తారు. వి.ఐ.పిలకు వాళ్లే సెక్యూరిటీగా వ్యవహరిస్తారు, ఊరేగింపులప్పుడు డ్యూటీ చేస్తారు. పోలీస్ కానిస్టేబుల్స్ ఏవిధంగా విధి నిర్వహణ చేస్తారో వీరు కూడా అదే విధంగా చేస్తారు. వీరివి టెంపరరీ అపాయింట్‌మెంట్స్. వీరిని నేటివరకు రెగ్యులరైజ్ చేయలేదు. వీళ్లందర్నీ రెగ్యులరైజ్ చేసి 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపునివ్వమని గౌరవ ముఖ్యమంత్రిగారిని తమద్వారా కోరుతున్నాను. తెలంగాణా రాష్ట్రంలో దాదాపు 22,000 మంది ఉంటే మార్చి, 11 వ తేదీన వారిని రెగ్యులరైజ్ చేస్తామని తెలంగాణా గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా వారికి శాసన సభలో హామీ ఇచ్చారు. మన బడ్జెట్ తెలంగాణ బడ్జెట్ కంటే సుమారు రూ.7,000 కోట్లు ఎక్కువగా ఉంది. అందుచేత ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని ఆలోచన చేయకుండా, దయచేసి పోలీస్ కానిస్టేబుల్స్‌తో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు కాబట్టి హోంగార్డులను రెగ్యులరైజ్ చేసి, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపునివ్వమని తమద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

## 4.GOVERNMENT RESOLUTIONS

MR. CHAIRMAN: Now, I will take-up Item No.III, Government Resolutions.

SRI PRATHIPATI PULLA RAO ,(MINISTER FOR AGRICULTURE): Chairman Sir, on behalf of Sri Nara Chandrababu Naidu, Chief Minister, I beg to move the following Resolution:

"That the House resolves unanimously to request the Government of India, Ministry of Civil Aviation to change the name of Tirupathi Airport as "SRI VENKATESWARA AIRPORT, TIRUPATI."

MR.CHAIRMAN: Motion moved. Now the question is:

"That the House resolves unanimously to request the Government of India, Ministry of Civil Aviation to change the name of Tirupathi Airport as "SRI VENKATESWARA AIRPORT, TIRUPATI."

(PAUSE)

The Motion was carried and the Resolution was adopted unanimously.

## GOVERNMENT RESOLUTION No.2:

SRI PRATHIPATI PULLA RAO (MINISTER FOR AGRICULTURE): Chairman Sir, on behalf of Sri Nara Chandrababu Naidu, Chief Minister, I beg to move the following Resolution:

"That the House resolves unanimously to request the Government of India, Ministry of Civil Aviation to change the name of Vijayawada Airport as '' NANDAMURI TARAKA RAMA RAO AIRPORT, AMARAVATI."

MR.CHAIRMAN: Motion moved. Now, the question is:

"That the House resolves unanimously to request the Government of India, Ministry of Civil Aviation to change the name of Vijayawada Airport as '' NANDAMURI TARAKA RAMA RAO AIRPORT, AMARAVATI."

(PAUSE)

The Motion was carried and the Resolution was adopted unanimously.

## 5).2017–18 సంవత్సరానికి వార్షిక ఆదాయ వ్యయ పట్టిక (బడ్జెటు) పై సాధారణ చర్చ కొనసాగింపు :

Now, I will take-up Item No.IV, of the Agenda, General Discussion on Annual Financial Statement (Budget) for 2017-2018.

శ్రీ వి.వి.ఎస్. చౌదరి (శాసనసభా నియోజక వర్గం) : ధన్యవాదాలు అధ్యక్ష. 2017–18వ సంవత్సరపు రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం కల్పించడం నిజంగా నేను చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను. ముఖ్యంగా ఈ రోజు చరిత్రలో హిస్టారిక్ ఈవెంట్‌గా సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈవెంట్‌గా నేను వ్యక్తిగతంగా భావిస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారి మాటలలో చెప్పాలి అంటే ట్రాన్సిట్ కౌన్సిల్‌లో ఈ రోజు బడ్జెట్‌పై ప్రసంగించడం పట్ల కలుగుతున్న అనుభూతి నా మాటలకు అందడం లేదు.

మ.12.10

అధ్యక్షా, ఈ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన అనంతరం మన నేపథ్యాన్ని మనం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. అప్పటి పాలకుల కుట్ర రాజకీయాల కారణంగా, హేతుబద్ధత లేని విభజనవల్ల, అంతేగాకుండా విచ్చలవిడి అవినీతి, అరాచకాలతో మసకబారిన రాష్ట్ర ప్రతిష్ట, వీటన్నింటికి తోడు దిక్కుతోచని పరిస్థితి, సూర్యాస్తమయ స్థితిలో గాడాంధకారం నెలకొన్నప్పుడు, ఆ స్థితి నుంచి ఈ రోజున సన్‌రైజింగ్ స్టేజ్‌కి మలచడానికి ఈ వెయ్యిరోజుల ప్రస్థానం నిజంగా గౌరవముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడి గారి కార్యదక్షతకు, సమర్థతకు నిదర్శనమని నేను మీకు తెలియజేసుకుంటున్నాను. వెయ్యిరోజుల పాలనలో గత కాలపు చీకటి చెదిరిపోయింది. చీకటిని చీల్చుకుంటూ, స్వర్ణకిరణాల విజృంభణతో వెలుగులు నింపుతూ, విరజిమ్ముతూ, ఈరోజున సన్‌రైజింగ్ స్టేట్‌గా మన రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ సన్‌రైజింగ్ స్టేట్ స్థితినుంచి, శాశ్వతంగా ఒక సన్‌షైనింగ్ స్టేట్‌గా తీర్చిదిద్దాలనే ఒక ధృడ సంకల్పంతో ఈరోజున ముఖ్యమంత్రిగారు కృషి సాగిస్తున్నారని నేను మీకు ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధితో పాటు అన్ని రంగాలలోనూ దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలనే తపన మన ముఖ్యమంత్రిగారిది. ఇప్పటికే అనేక సంక్షోభాలను, అనేక సవాళ్లను అవకాశాలుగా మలచుకుంటూ, రాష్ట్రంలో ఒక స్థిరమైన అభివృద్ధిని, వృద్ధిని సాధించడంతోపాటుగా ఈ అభివృద్ధి ఫలాలు పేదలందరికీ అందేలా చర్యలు తీసుకొని, పేదరికం లేని సమాజ నిర్మాణం చేయడమే ఆయన ధ్యేయం. పేదవారి కళ్లల్లో వెలుగు, వారి జీవితాల్లో ఆనందం చూడాలనే తపన, ప్రతి కుటుంబంలో కూడా హ్యాపీనెస్ ఇండెక్స్ ఉండాలనే సంకల్పంతో ఆయన పేదరికం లేని సమాజ నిర్మాణాన్ని ఒక ధ్యేయంగా మలచుకున్నారు. నిన్న వారు చేసిన ప్రసంగంలో వారు తన అంతరంగాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, ఒక కుటుంబ వికాసం తద్వారా సమాజవికాసం, పర్యవసానంగా రాష్ట్ర సర్వతోముఖ వికాసం, ఇదే మనముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి ప్రసంగంలో ఆవిష్కరించబడిన ఆయన అంతరంగం.

అధ్యక్షా, మీరన్నట్లు ప్రజలు ఆయన పట్ల పెంచుకున్న విశ్వాసాన్ని, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని, ఆత్మీయతను శాశ్వతం చేసుకోవాలనే దృఢసంకల్పంతో ఆయన ప్రణాళిక రచించుకున్నారని మీకు ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను. అభివృద్ధి చెందిన రాష్ట్రంగానే కాకుండా, ఒక సంక్షేమ రాష్ట్రంగా కూడా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనేది ఆయన తాపత్రయం. ఈ స్థిరమైన అభివృద్ధి దిశగా ప్రపంచం పురోగమిస్తున్న సమయంలో, సంతోషం, సౌభాగ్యం కూడుకున్న సమాజంగా, దీనిలో పరివర్తన తీసుకురావాలనే దిశగా అభివృద్ధి చెందాల్సిన తరుణం వచ్చిందని ఆయన అభిప్రాయం. ఆయన ఒక గొప్ప మానవతా వాది, అభివృద్ధి కాముకుడు, దార్శనికుడు. ఆయన దార్శనికతకు దర్పణం పట్టేవిధంగా ఈ 2017–18వ సంవత్సర బడ్జెటు ఉందని చెప్పడం అతిశయోక్తి కాదని నేను తెలియజేసుకుంటున్నాను.

ప్రజల ఆకాంక్షను, ఆశయాలను ప్రతిబింబిస్తూ, అభివృద్ధి, సంక్షేమాలను సమతుల్యం చేస్తూ ఈ రోజున 2017-18వ సంవత్సర బడ్జెటు ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే outcome based Budget, need based Budget, result oriented Budget గా దానిని అభివర్ణించక తప్పదు. దానిలో ఎటువంటి అతిశయోక్తి లేదని నేను మీకు ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓట్లు పొందడం కాదు, సమాజంలో ప్రజల జీవితానికి సంబంధించి, వారి భాగస్వామ్యం, వారికున్న అవకాశాలు, సామర్థ్యాలు వినియోగించుకోవడమే ఒక సంపూర్ణ ప్రజాసామ్యమనే ప్రజాస్వామ్యవాది మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు. అందుకని ప్రతి కార్యక్రమంలో కూడా ప్రజల భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను.

ఆయన ప్రయారిటీలు ఆయన మాటల్లోనే చెప్పాలంటే రాష్ట్ర విభజన వల్ల చిన్నాభిన్నమైన ఎన్నో జీవితాలకు కొత్త ధైర్యాన్ని, భరోసాని ఇవ్వడం, ఆదర్శ రాజధాని నగరంగా విశ్వనగరంగా అమరావతిని నిర్మించుకోవడం, అంతేగాకుండా చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టుని త్వరితగతిన పూర్తి చేయడం, పారిశ్రామికాభివృద్ధి, సుపరిపాలన, అవినీతి, కరవు రహిత రాష్ట్రంగా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం మన ముఖ్యమంత్రిగారి అంతరంగం. ఆయన తన అంతరంగాన్ని, తపనని కార్యరూపందాల్చడం కోసం అనేక కార్యక్రమాలను వారు రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా భారతదేశంలోనే తొలిసారిగా వ్యవసాయ బడ్జెటుని ప్రవేశపెట్టిన ఘనత కూడా ఈ తెలుగుదేశం ప్రభుత్వానిదేనని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

(ట్రెజరీ బెంచెస్‌నుంచి హర్షధ్వానాలు)

అధ్యక్షా, లాభసాటి వ్యవసాయం, రైతుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. వ్యవసాయాన్ని ఒక వాణిజ్యరంగంగా రూపొందించడం కోసం, రైతుల భాగస్వామ్యంతో Farmers Produce Organisationని ప్రోత్సహించడానికి ఒక విధాన పత్రాన్ని, నిర్దేశ సూత్రాలను బడ్జెటులో రూపొందించడం జరిగిందని ఈ సందర్భంగా నేను మీకు తెలియజేసుకుంటున్నాను. అధ్యక్షా, కొంత మంది మిత్రులు మాట్లాడుతూ, అనేక రకాల సందేహాలను వెలిబుచ్చడం జరిగింది. లోటు బడ్జెటు ఉన్నప్పుడు జిడిపి గ్రోత్ రేటు 10.99% ఎలా ఉంటుందనేది వారి సందేహం. అవి కొంతమంది ఆర్థికవేత్తల సందేహాలు కూడా కావచ్చు. కానీ దూరదృష్టితో పరిశీలిస్తే, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గ్రోత్‌ని సాధించాలనుకున్నప్పుడు, సాధారణంగా బడ్జెటు వ్యయం పెరుగుతుంది, లోటు కూడా ఉంటుంది. కానీ, అదేసమయంలో అవినీతిరహిత పరిపాలన, సుపరిపాలన అందించాలి. ప్రజలలో అవినీతి, అక్రమాలు, లంచగొండితనం అనే భారాలను మోపి వారి ఆదాయం కోల్పోయిన సంఘటనలు కూడా గతంలో మనం చూశాము. ఆ పరిస్థితుల నుండి సుపరిపాలనను అందిస్తున్నప్పుడు సహజంగానే వారి ఆదాయాలు పెరుగుతాయి. ఆదాయాలు పెరిగినప్పుడు, వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇదంతా నేను ఆర్థికవేత్తను కాకపోయినప్పటికీ ఒక స్థూలదృష్టితో పరిశీలించి ఒక సామాన్యుడిగా నేను చెబుతున్నాను. ఖచ్చితంగా జిడిపి పెరగడంలో ఆశ్చర్యం ఏమీ లేదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ముఖ్యంగా వ్యవసాయరంగంలో గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయాన్ని, వ్యవసాయ అనుబంధ రంగాల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రతి రైతుకి, రైతు కుటుంబానికి, అదేవిధంగా రైతు కూలీలకు, కౌలు రైతులకు ఆదాయం పెంచడం ద్వారా వారి తలసరి ఆదాయాల్ని పెంచే దిశగా ఈ ప్రభుత్వం కృషి చేస్తున్నప్పుడు జిడిపి పెరగడంలో ఆశ్చర్యం లేదని నేను ఈ సందర్భంగా మనవి చేసుకుంటున్నాను.

మ. 12.20

అధ్యక్షా, ఇక నదుల అనుసంధానం కార్యక్రమం చూస్తే, ఇది ఏమీ క్రొత్తది కాదు. గతంలో ఎప్పుడో ప్రారంభించిన నదుల అనుసంధానం కార్యక్రమం ఈ రోజు క్రొత్త కాదని చెప్పడం జరిగింది. నిజమే అధ్యక్షా. ఇది క్రొత్త కాకపోవచ్చు. కానీ, ప్రాక్టికల్‌గా నెరవేరుతున్న సందర్భం మాత్రం ఇదే ప్రథమం అని ఈ సందర్భంగా తమ ద్వారా మనవిచేసుకుంటున్నాను. అని గతంలో శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయ్ గారు ప్రధానమంత్రిగా ఉండగా Major River Linkage Committee వేయడం జరిగింది. కానీ, ఆ కమిటీ రికమెండేషన్లు కానీ, ఆ కమిటీ కార్యాచరణ ప్రణాళిక కానీ అప్పట్లో కార్యరూపం దాల్చలేదు.

డా.కె.ఎల్. రావు గారు కేంద్ర మంత్రిగా ఉండగా, నదుల అనుసంధాన కార్యక్రమంలో భాగంగా, గంగా-కావేరి నదుల మధ్య అనుసంధానమనేది ఆయన యొక్క స్వప్నం. ఎప్పుడైతే నదుల అనుసంధానం జరుగుతుందో అప్పుడే రాష్ట్రాభివృద్ధి కూడా వేగంగా జరుగుతుంది. గతంలో గంగా-కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాల సౌభాగ్యం, సౌశీల్యం ఎప్పుడైతే సుసంపన్నం అవుతాయో, రాజకీయంగా వారి ఆధిపత్యం కూడా పెరుగుతుందనే అభిప్రాయం ఉండేది. అప్పట్లో గంగా-కావేరి నదుల అనుసంధానానికి కూడా మోకాలు అడ్డుపెట్టి అడ్డుకున్న ఘనత కూడా గత ప్రభుత్వాల పాలకులదేనని ఈ సందర్భంగా తమ ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజున ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం చేపట్టారు. తద్వారా ఇది కృష్ణా-గోదావరి నదుల అనుసంధానమే కాకుండా, రాయలసీమ జిల్లాలను సుభిక్షం చేయడం కోసం బచావత్ ట్రైబ్యునల్ ద్వారా శ్రీశైలం నుంచి రావలసిన నీటిని రాయలసీమ జిల్లాలకు మళ్ళించారు. తద్వారా ఆ రాయలసీమ జిల్లాలను కూడా సశ్యశ్యామలం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడిగారిదేనని ఈ సందర్భంగా తమ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ రకంగా నదుల అనుసంధాన కార్యక్రమానికి కార్యరూపంలో శ్రీకారం చుట్టింది మాత్రం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని ఈ సందర్భంగా తమ ద్వారా మనవి చేసుకుంటున్నాను.

అధ్యక్షా, ఇక పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చూస్తే, ఈ ప్రాజెక్టు గతంలో చాలామందికి అది ఒక రాజకీయ నినాదంగా ఉండేది. గత పాలకుల హయాంలో దశాబ్దాల కాలంగా ఒక రాజకీయ నినాదంగానే మిగిలిపోయింది. కొంతమంది అయితే, ఆ పోలవరం ప్రాజెక్టును కూడా జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ, మొబిలైజేషన్ అడ్వాన్సుల రూపంలో దోచుకోవడానికి ఉపయోగించుకున్నారు తప్ప పోలవరం ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తిచేయాలనే, చిత్తశుద్ధి వారిలో లోపించింది. ఈ విషయాలు తమకందరికీ తెలుసు. గతంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అంతర్‌రాష్ట్ర సమస్యలు ఉన్నాయి. అలాగే, పర్యావరణ అనుమతులు కూడా రావలసి ఉంది. అలాగే, కొన్ని ముంపు మండలాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని పోలవరం ప్రాజెక్టుకు అనుమతులు రావడానికి కూడా ఆలస్యమవుతుందనే ఉద్దేశంతోను, దూరదృష్టితో అప్పట్లో తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం - పురుషోత్తపట్నం తాడిపూడి ఎత్తిపోతల పథకాల ద్వారాను, పోలవరం ప్రాజెక్టు ద్వారా సాగులోకి తెచ్చే ఆయకట్టు ఏదైతే ఉందో, అంతవరకూ సాగునీరు అందించే లక్ష్యంతో ఈ పుష్కర ఎత్తిపోతల పథకం, తాడిపూడి ఎత్తిపోతల పథకం కూడా గతంలోనే శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ప్రారంభించిన సంగతిని కూడా తమ ద్వారా గుర్తుచేస్తున్నాను.

ఆ తరువాతి కాలంలో పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు కాలువలకు సమాంతరంగా కాలువలను త్రవ్వుకుంటూ, అలైన్‌మెంట్‌లో కూడా అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డారు. కేవలం మొబిలైజేషన్ అడ్వాన్స్ రూపంలో ఉన్నటువంటి నిధులను దుర్వినియోగం చేసిన ఘనకార్యాలన్నీ కూడా

మనం గతంలో తెలుసుకున్నాము. అంతేకాదు, అప్పట్లో ప్రజల్లో ఇది ఒక చర్చనీయాంశంగా ఉన్న సంగతిని కూడా తమ ద్వారా గౌరవ సభ్యుల దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజున పోలవరం ప్రాజెక్టు సత్వరం పూర్తి కావాలంటే, 7 ముంపు మండలాలను విభజనానంతరం మన ఆంధ్రప్రదేశ్‌లో కలిపినప్పుడే సత్వర నిర్మాణం జరుగుతుందనే ఒక సంకల్పం బలంగా ఏర్పడింది. ఈ ప్రభుత్వం గత 10 సంవత్సరాల నుండి అధికారంలో లేకపోయినా, ఆ తరువాతి కాలంలో ఎన్నికలు జరిగిన సందర్భంలోనూ, రాష్ట్ర విభజన జరిగిన సందర్భంలో ప్రజలు తమ మీద ఉన్న నమ్మకంతోను, ప్రజలు ఈ ప్రభుత్వానికి పట్టం కట్టారు. ఈ ప్రభుత్వం ఒక పవిత్రమైన ఉద్దేశ్యంతో ఈ 7 మండలాలను మన భూభాగంలో కలిపే వరకు నేను ముఖ్యమంత్రిగాను, మంత్రివర్గ ప్రమాణ స్వీకారం చేయనని చెప్పి, ఆ లక్ష్య సాధనకోసం, ఆ పవిత్రమైన ఉద్దేశం కోసం తన పదవిని కూడా తృణప్రాయంగా భావించిన ఘనత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజున పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు ప్రతి సోమవారాన్ని ఆయన తన క్యాలండరులో పోలవారంగా మార్చుకున్నారు. అది ఒక virtual inspection ద్వారా త్వరితగతిన నిర్మాణం కోసం ఆయన అనునిత్యం కూడా కష్టపడుతున్న సంగతిని ఒకసారి తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈరోజున ఈ బడ్జెట్‌లోని ఎక్కువ గణాంకాలలోకి వెళ్ళదలచుకోలేదు. కొన్ని ముఖ్యమైన అంశాలను మాత్రం ప్రస్తావించదలచుకున్నాను. 2017-18 సంవత్సరపు మొత్తం బడ్జెట్ దాదాపుగా రూ.15699.40 కోట్లుగా ప్రకటించారు. దీనిని నిజంగా పేదల కోసం ప్రవేశపెట్టిన బడ్జెటుగా నేను భావిస్తున్నాను. ఎందుకంటే, రేషన్ కోసం రూ.2,800 కోట్లు, పెన్షన్ల కోసం రూ.4,376 కోట్లు, ఎన్.టి.ఆర్ వైద్య సేవల కోసం రూ.1,000 కోట్లు, విద్యుత్ సబ్సిడీ కోసం రూ.3,300 కోట్లు, గృహనిర్మాణానికి రూ.1,456కోట్లు, రైతు ఋణమాఫీకి వాయిదాగా రూ.24,000 కోట్లను ఉపసంహరణ చేశారు. దానికి రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా కూడా తనంతట తానుగా ఆ ఋణాలను ఉపసంహరణ చేసిన ఘనత ఒక్క శ్రీ నారా చంద్రబాబు నాయుడిగారిదేనని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, డ్వాక్రా మహిళల కోసం దాదాపు రూ.10,000 కోట్లతో ఋణ విముక్తి చేస్తే, అందులో ఈరోజున వాయిదాగా దాదాపు రూ.1600 కోట్లు ఇచ్చారు. ఈనాడు ఆయన పేదల సంక్షేమం కోసం ఈ బడ్జెట్‌ను రూపొందించారు. ఇది పేదల బడ్జెట్ అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అలాగే, అన్నింటినీ మించి ఈనాడు నిరుద్యోగ యువతకి తొలిసారిగా నిరుద్యోగ భృతి ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువత సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించడం జరిగింది. వారికి నిరుద్యోగ భృతిని అందించడంతో పాటుగా, వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం దాదాపుగా రూ.398 కోట్లు కేటాయించారు. వారి నిరుద్యోగ భృతికోసం టోకెన్ బడ్జెట్‌గా రూ.500కోట్లు కేటాయించారు. కొంతమంది ఈ బడ్జెట్ ఏ మూలకి సరిపోతుందని విమర్శిస్తున్నారు. కానీ, ఇది సరిపోదనే ప్రశ్నే లేదు. ఎంతైనా నిరుద్యోగ భృతిని కేటాయించడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

అధ్యక్షా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కోసం రూ.398కోట్లు, ఇతర పథకాల ద్వారా రూ.275కోట్లు కేటాయించడంతో ఈరోజున యూత్ పాలసీని కూడా ఏర్పాటు చేస్తున్నాను. Yes, it is Youth Empowerment Scheme. అంటే, యువజన సాధికారత కోసం తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్కీంగా నేను ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను. రేపు 30వ తేదీన ఇదే కౌన్సిల్‌లో ప్రమాణస్వీకారం చేయబోయే మా యువ నాయకుడు, జాతీయపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా

లోకేష్ గారి ఆధ్వర్యంలో ఈ Youth Empowerment Scheme మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుందని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, రాబోయే సంవత్సరంలో రెవెన్యూ లోటు మూడు శాతం ఉంది. ఒక రకంగా చూసుకుంటే, ఇది manageable deficit. ఈ రకంగా రెవెన్యూ లోటును తగ్గించుకోవడం ఆర్థిక క్రమశిక్షణకు ఒక ప్రాతిపదికగా ఈ బడ్జెట్ రూపొందించబడిందని చెప్పి ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేసుకుంటున్నాను. మనకు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ కూడా రెవెన్యూ లోటుని 0.78 శాతానికి బడ్జెట్ లోటును జిఎస్‌డిపిని 3.06శాతానికి అదుపు చేయడం ప్రభుత్వ సామర్థ్యానికి, పనితీరుకి నిదర్శనంగా నేను భావిస్తున్నాను.

మ. 12.30

అధ్యక్షా, ఉద్యోగులకు కూడా బడ్జెట్‌లో అనేక వరాలను ఇవ్వడం జరిగింది. ఉపాధి హామీ పథకం గ్రాంట్లను ఉపయోగించుకుని గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నందున, ఉపాధి హామీ పథకంలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉంది. నిధుల సమీకృతంద్వారా సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఓహెచ్‌ఎస్ఆర్‌లు వంటి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇది ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను.

బడ్జెట్‌ను స్థూలంగా పరిశీలిస్తే బడ్జెట్ ప్రయారిటీస్‌ను కూడా ఇందులోనే పొందుపరచడం జరిగింది. పరిశ్రమల శాఖకు 114శాతం, జలవనరులశాఖకు 60శాతం, గ్రామీణాభివృద్ధికి 31శాతం, మహిళలకు 33.3శాతం, గృహనిర్మాణ రంగానికి 29శాతం, పౌరసరఫరాలకు 28శాతం కేటాయించి ప్రభుత్వం యొక్క ప్రాధాన్యతలను ఈ బడ్జెట్‌లో తెలియజేసింది. అంతేగాకుండా వ్యవసాయరంగానికి ప్రత్యేకించి రూ.9,091కోట్లు కేటాయించడం ద్వారా వ్యవసాయం, వాటి అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడానికి కూడా చర్యలు తీసుకోబడుతోంది.

ఈరోజున గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రత్యేకించి రూ.19565కోట్లు కేటాయించబడిందంటే ముఖ్యంగా గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌కు ఎంతటి ప్రాధాన్యత ఉందో తెలుస్తోంది. అంతేగాకుండా బి.సిల అభివృద్ధికి గత సంవత్సరం రూ.8832కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో దానిని రూ.10,000కోట్లకు పెంచడం జరిగింది. మొట్టమొదటిసారిగా మోస్ట్ బ్యాక్‌వార్డ్ క్లాసెస్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, రూ.60కోట్లతో దానికి ఫైనాన్స్ కార్పొరేషన్ కూడా ఏర్పాటుచేయడం జరిగింది. ఆర్థికంగా వెనుకబడిన కులాలవారితోపాటు, అగ్రవర్ణాలైనా ఆర్థికంగా వెనుకబడినవారికి కులంతో సంబంధం లేకుండా వారికి కూడా ప్రత్యేక కేటాయింపులు చేయడం ఈ బడ్జెట్ విశేషమని ఈ సందర్భంగా మీకు తెలియజేసుకుంటున్నాను.

ఇవిగాక రూ.695కోట్లు మిగిలిన అన్ని వర్గాలవారికి కేటాయించగా, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.75కోట్లు, కాపు కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించడం జరిగింది. అదేవిధంగా మైనారిటీ సంక్షేమానికి, ఎస్.సి, ఎస్.టిలకు కూడా ఇతోధికంగా నిధులనివ్వడమనేది ప్రభుత్వంయొక్క ఓరియంటేషన్. సంక్షేమ కార్యక్రమాలు, పెరిగిన అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందాలనీ, తద్వారా వారియొక్క జీవన ప్రమాణాలు, కొనుగోలుశక్తి పెరగాలనే దృఢ సంకల్పంతోనే ఈ బడ్జెట్‌ను రూపొందించడం జరిగింది.

ఒక దార్శనికుడి దార్శనికత అంటే విజన్‌కు అద్దంపట్టే విధంగా ఈ బడ్జెట్ ఉంది. అదే రకంగా ఒక మానవతావాది అంతరంగానికి అనుగుణంగా పేదల సంక్షేమ బడ్జెట్‌గా దీనిని రూపొందించారు. మహిళలకు కూడా ప్రాధాన్యతనిస్తూ, మహిళా సాధికారితను పెంచుతూ జెండర్ బడ్జెట్‌గా కూడా రూపొందించడం ఆయన దూరదృష్టికి తార్కాణం. ఈరోజున ఈ బడ్జెట్‌మీద ప్రసంగించే అవకాశం కలగడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగుదేశం ప్రభుత్వంపట్ల, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి పట్ల ఈరోజు ప్రజలు పెంచుకున్న విశ్వాసం, ఆత్మీయత, అనుబంధం శాశ్వత ప్రాతిపదికన ఈ రాష్ట్రం ఉన్నంతవరకూ ఉంటుందని మీకు ఈ సందర్భంగా తెలియజేసుకుంటూ నాకు ఈ అవకాశం కల్పించినందుకు మీకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిజేసుకుంటున్నాను.

(గౌరవ సభ్యుల హర్షధ్వానాలు)

శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్: అధ్యక్షా, నిన్న రాజధానికి భూసేకరణ గురించి మాట్లాడుతుండగా సమయాభావంవల్ల మధ్యలోనే నిలిపివేయడం జరిగింది. నిన్న మనం అనుకున్న విధంగా పశ్చిమబంగల్‌లో టాటా నానో కార్లకి కేవలం 300 ఎకరాల సేకరణ కోసం ప్రయత్నంచేస్తే అక్కడ రాష్ట్రం మొత్తం కూడా అల్లకల్లోలమైపోయి దాదాపు పాతిక, ముప్ఫై సంవత్సరాలు అధికారంలో ఉన్న కమ్యూనిస్టు ప్రభుత్వమే కూలిపోయే పరిస్థితిలోకి వచ్చింది.

అయితే, ఇక్కడ రాజధానికోసం అత్యంత విలువైనటువంటి, కృష్ణానది పక్కనే, అత్యంత చైతన్యవంతమైన ప్రజలున్న ఈ ప్రదేశంలో ఎటువంటి ఆటంకం లేకుండా ఒక ధర్నా, రాస్తారోకో, లాఠీఛార్జీ, నిరసనవంటివి ఏమీ లేకుండా చాలా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజల ఆమోదంతో 33,000 ఎకరాలను ఈ రాజధానికి సేకరించడమనేది శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి నాయకత్వ లక్షణం. నిజంగా చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. ఇప్పటివరకూ కూడా భూసేకరణ గురించే విన్నాము. భూ సమీకరణ అని పెట్టి ఈ ప్రాంత అభివృద్ధిలో ఆ భూములిచ్చిన రైతుల్ని కూడా భాగస్వాములను చేయడమనేది ఈ రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే కాదు, ప్రపంచంలోనే మన రాష్ట్రంలో, మన ప్రభుత్వం, మన నాయకుడు ప్రవేశపెట్టి చేయడమనేది చాలా గొప్ప విషయం. కనుక ఈ సందర్భంగా మనమిక్కడ కొత్తగా తాత్కాలిక శాసనసభను, శాసనపరిషత్తును, సచివాలయాన్ని నిర్మించుకోవడం, దీనికి అవకాశమిచ్చినటువంటి ఆ రైతులకు ప్రప్రథమంగా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈరోజు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ అప్పుడే పుట్టినటువంటి పసిపిల్ల దశ నుంచి ముదుసలి వరకూ, చనిపోయిన తరువాత కూడా వాళ్ళ కుటుంబాన్ని ఏరకంగా ఆదుకోవాలి? ఏరకంగా అన్ని వర్గాల ప్రజల్ని అభివృద్ధిలోకి తీసుకెళ్ళాలనేది స్పష్టంగా కనబడుతోంది. నిజంగా ఈ రాష్ట్రం విడిపోయిన తరవాత ఆదాయం, వనరులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఉద్యోగాలు లేనందువల్ల ఈ రాష్ట్రం ఏమైపోతుందోనని అందరమూ భయపడ్డాము. ఆ దశనుంచి ఈ రోజున అడిగినవారికి, అడగనివారికి, ఇచ్చినటువంటి హామీలను, ఇవ్వనటువంటి హామీలను, మేనిఫెస్టోలో పెట్టినవీ, పెట్టనివి కూడా అమలుచేసి ఇన్ని లక్షల కోట్ల రూపాయలు అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చుపెడుతున్నారంటే అదీ శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి విజన్.

శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి దార్శనికత, ఈ బడ్జెట్‌లో కనబడిందని ఇందాక మా చౌదరిగారు చెప్పారు. అది వాస్తవం. నిజంగా ఒక్కోసారి ఆలోచిస్తే నాకు చాలా ఆశ్చర్యమేస్తుంది. ఇన్ని వేల కోట్లు, ఇన్ని లక్షల కోట్లు ఎలా జనరేట్ చేస్తున్నారు. ఈ సంపద ఎలా సృష్టింపబడుతోంది? నిజంగా చంద్రబాబునాయుడుగారి తెలివితేటలకి హాట్సాఫ్ చెప్పాలి. ఈరోజున రాష్ట్రంలో ఎన్.జి.ఓలు కానీ, ఉద్యోగులు కానీ ఇలా ఎవ్వరూ కూడా మాకిది కావాలని నోరు తెరిచి అడిగితే కాదనకుండా, వాళ్ళు అడిగినదానికన్నా ఎక్కువగా చేసిన ఉపకారాలను గురించి మనం ఒక్కసారి మననం చేసుకోవాలి.

ఇక మా పంచాయతీరాజ్ విషయానికివస్తే, ఈరోజున ఈ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు, సర్పంచ్‌లకు స్వర్ణయుగం నడుస్తోంది. ఇవి గోల్డెన్ డేస్. కొన్ని వందల వేల కోట్ల రూపాయలు గ్రామాల అభివృద్ధికోసం కేటాయించడం జరిగింది.

మ. 12.40

అధ్యక్షా, 14వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.12 వేల కోట్లు గ్రామ పంచాయతీలకు ఇస్తుంటే అవి సరిపోవని ఎన్.ఆర్.ఇ.జి.యస్. నిధులు కూడా కలిపి ఈరోజు ఖర్చు పెట్టడం జరుగుతోంది. పక్కా పనులు చేయడం జరుగుతోంది. అదే గతంలో ఎన్.ఆర్.ఇ.జి.యస్. వస్తే అడ్డగోలుగా పార్టీ కార్యకర్తలకు ఇవ్వడం జరిగింది. ఎక్కడా కూడా పక్కా కట్టడాలుగాని, పక్కా నిర్మాణాలకు గానీ ఆ నిధులు వెచ్చించినటువంటి దాఖలాలు కూడా కనపడలేదు. ఈ రోజు గ్రామ పంచాయతీలకు, డ్వాక్రా సంఘాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పాఠశాలలకు భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

అత్యంత ముఖ్యంగా చంద్రన్న బాట రూపంలో సుమారు 5 వేల కిలో మీటర్లు సిమెంటు రోడ్లు వేయడం జరిగింది. ఇంకొక రెండుమూడు సంవత్సరాలలో ఇంకో పది వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్లు వేయడానికి మొత్తానికి 2019వ సంవత్సరానికి ఈ ప్రభుత్వం టర్మ్ ముగిసేలోపు అన్ని గ్రామాలలో సంపూర్ణంగా సిమెంటు రోడ్లను, డ్రైన్లను, వాటర్ ట్యాంకులను నిర్మించడానికి ఈ ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో మా గౌరవ మంత్రి శ్రీ అయ్యన్న పాత్రుడు గారి నేతృత్వంలో అద్భుతంగా పనిచేయడం జరుగుతోంది.

అధ్యక్షా, అంతేకాకుండా స్మశాన వాటికల అభివృద్ధి కోసం అలాగే, అక్కడున్నటువంటి శానిటేషన్, మేనేజ్‌మెంట్, లింక్‌రోడ్లు, గ్రామాల అభివృద్ధి కోసం అనేక రకాలుగా పంచాయతీరాజ్ వ్యవస్థ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరుగుతోంది. ఇంత బాగా గ్రామీణ ప్రజలను ఆదుకుంటూ, గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేస్తూ ఒక చిన్న విషయాన్ని ప్రభుత్వం మరచిపోవడమో లేదా విడిచిపెట్టడమో జరిగింది. మా పంచాయతీరాజ్ శాఖ మంత్రిగారు లేదా ఆర్థిక శాఖా మంత్రిగారు గానీ ఉంటే బాగుండేది. ఈ రోజు గ్రామ పంచాయతీలు విద్యుత్ దీపాల బిల్లుల వలన తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. గతంలో అన్న నందమూరి తారకరామారావుగారు ముఖ్యమంత్రిగా ఉండగా గ్రామ పంచాయతీలలో, మైనర్ పంచాయతీలలో వీధి దీపాలకు ఉచితంగా కరెంటును అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత డా. వై.యస్.రాజశేఖర్ రెడ్డిగారి హయాంలో వాటికి బిల్లులు జారీ చేయడం జరిగింది. ఆ తరువాత ముఖ్యమంత్రిగా శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారు వచ్చే నాటికి అప్పటి వరకూ గ్రామ పంచాయతీలకు కరెంటుకు ఉండే యూనిట్ ధర రూ.1ని రూ.5.56 చేయడం జరిగింది. అప్పుడు గ్రామ పంచాయతీలన్నీ

కుదేలయ్యాయి. గ్రామ పంచాయతీలలో పన్నులు మొదలైనటువంటి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఇప్పుడు కరెంటు బిల్లులు కట్టాల్సి వచ్చింది.

అధ్యక్షా, అంతేకాకుండా ఈ రోజు 14వ ఆర్థికసంఘం నుండి నిధులు వస్తుంటే వాటి నిధులను కూడా కరెంటు బిల్లులు కట్టడానికి ఉపయోగించమంటున్నారు. గ్రామాలలో పూర్తి స్థాయిలో పనులు చేసుకునే అవకాశం ఉండడం లేదు. కనుక, ప్రభుత్వానికి నేను విజ్ఞప్తి చేసేదేమిటంటే గతంలో ఏవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం సర్గీయ శ్రీ ఎన్.టి.రామారావుగారు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మైనర్ పంచాయతీలకు ఉచితంగా వీధి దీపాలకు విద్యుత్‌ను అందించారో, అదే తరహాలో ఇప్పుడు కూడా వీధి దీపాలకు విద్యుత్‌ను ఉచితంగా ఇప్పించవలసిందిగా నేను తమరిద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజు యూనిట్ ధర ఒక్కసారిగా రూపాయి నుండి ఐదు రూపాయల ఏభై ఆరు పైసలు చేసే సరికి పంచాయతీల విద్యుత్ బిల్లుల బకాయిలు సుమారుగా రూ.1800 కోట్లకు పేరుకుపోయింది. ఆ బకాయిలను కూడా రద్దు చేసి ఇక నుండి సక్రమంగా విద్యుత్ బిల్లులు కట్టుకునే విధంగా చేయాలని నేను కోరుతున్నాను.

అదేవిధంగా, అధ్యక్షా, మీకు తెలిసినదే, మీరు కూడా గ్రామీణ ప్రాంతం నుండి వచ్చారు. పంచాయతీరాజ్ లో మూడు రకాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్. గ్రామ పంచాయతీలలో సర్పంచులు, వార్డు మెంబర్సు ఉన్నారు. ఇంతకు ముందు నేను చెప్పిన విధంగా వారికి ఇప్పుడు స్వర్ణయుగంగా నడుస్తోంది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు వచ్చే సరికి ఎమ్.పి.టి.సి., జెడ్.పి.టి.సి.లకు కనీస మాత్రంగా కూడా నిధులు ఇవ్వడంలేదు. వారికి ఏవిధమైన అధికారాలుగాని, నిధులు గాని ఇవ్వకపోవడం వలన వారు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారు. అందులో, ప్రత్యేకంగా 14వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామ పంచాయతీలలో సర్పంచులకు మాత్రమే నిధులు ఇవ్వండి. మిగతా మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఎమ్.పి.టి.సి., జెడ్.పి.టి.సి.లకు నిధులు అవసరం లేదని వారు సిఫార్సు చేయడం జరిగింది. 1వ ఆర్థిక సంఘం నుండి 13వ ఆర్థిక సంఘం వరకూ కూడా మొత్తం పంచాయతీరాజ్‌లో ఉన్న అన్ని మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఎమ్.పి.టి.సి., జెడ్.పి.టి.సి.లకు, సర్పంచులకు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వడం జరిగింది. కానీ, ప్రప్రథమంగా ఈ 14వ ఆర్థిక సంఘంలోనే ఎమ్.పి.టి.సి., జెడ్.పి.టి.సి.లకు నిధులను ఆపివేయడంవలన పూర్తిగా మండల, జిల్లా పరిషత్తులు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేక పోతున్నారు. తమకు ఓటు వేసినటువంటి తమ గ్రామీణ ప్రజానీకానికి కనీసం ఒక చేతిపంపుగాని, ఒక చిన్న రోడ్డు వేసేటువంటి అవకాశం లేక వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై మేము రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. అలాగే, కేంద్రప్రభుత్వంలో కూడా అక్కడ పంచాయతీరాజ్ శాఖా మంత్రిగారికి, కేంద్ర మంత్రి శ్రీ వెంకయ్యానాయుడు గారికి, కేంద్ర హోం శాఖా మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది. దీనిపై పునరాలోచిస్తామన్నారు. కానీ, ప్రయత్నం మొదలు పెట్టలేదు. ఒకసారి 14వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసి, దానిని పార్లమెంట్ ఆమోదించింది కాబట్టి దీనిని మార్చలేమంటున్నారు.

అధ్యక్షా, భారతదేశ రాజ్యాంగాన్ని సుమారు 110 నుండి 120 సార్లు మార్చారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను మార్చుకోలేమా? ఒక పంచాయతీ రాజ్ కుటుంబంలో ఉండేటటువంటి సభ్యులలో ఈ వివక్షత ఉండకూడదు. తప్పనిసరిగా అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించి అయినా సరే, కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్‌లో, పార్లమెంటులో నిర్ణయం తీసుకునైనా సరే ఎమ్.పి.టి.సి.లకు, జెడ్.పి.టి.సి.లకు నిధులు తప్పనిసరిగా ఇవ్వాల్సిందిగా నేను కోరుతున్నాను.

అధ్యక్షా, పోలవరం గురించి, ఈ రోజు రాష్ట్రంలో సోమవారాన్ని పోలవారంగా మార్చుకుని మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు పోలవరం నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. దానికి వారు మా కాంగ్రెస్ పార్టీ హయాంలో అయితే రూ.10వేల కోట్లకే పోలవరం కడదామనుకున్నాము. మీరు దానిని రూ.40వేల కోట్లు చేశారు. మీరు కమీషన్ కోసం చేస్తున్నారు. అందుకే, కేంద్రప్రభుత్వం నుండి నిధులు తీసుకుని మీరు పోలవరం ప్రాజెక్టు కడుతున్నారని వారు మమ్మల్ని విమర్శిస్తున్నారు. ఆరోజు రూ.10వేల కోట్లు ఉన్నా 2004వ సంవత్సరంలో కేవలం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద ప్రజలకిచ్చే దానికి రూ.2000కోట్లు మాత్రమే కేటాయించడం జరిగింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇప్పుడున్నటువంటి ఎస్.ఎస్.ఆర్. రేట్ల ప్రకారం రూ.40వేల కోట్లు అయితే అందులో రూ.28వేల కోట్లు అక్కడ ఉన్న భూనిర్వాసితుల కోసం, భూమిని ఇచ్చిన రైతుల కోసం ఖర్చు పెట్టడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రోజు రైతులకు 20 శాతం ఇస్తామని అంటే ఈ రోజు తెలుగుదేశం ప్రభుత్వం వారికి 70 శాతం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. అలాగే, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చాలా శ్రద్ధ చూపిస్తున్నారు.మేము కడదామని, ఎస్టిమేట్లు తయారు చేశామని అన్నారు. నేను కూడా రాష్ట్రపతిని అయిపోవాలని అనుకుంటాను. అయితేనే కదా? అలాగే, పోలవరం ప్రాజెక్టును కట్టి చూపిస్తేనే కదా మంచి పేరు వచ్చేది, మీరు అందరూ చెప్పుకునేది. ఈ రోజు మన గౌరవ ముఖ్యమంత్రి గారు కట్టి చూపిస్తున్నారు. 2018వ సంవత్సరానికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 2019వ సంవత్సరానికి నీటిని లెఫ్ట్‌కెనాల్, రైట్‌కెనాల్ ద్వారా అందించడానికి ప్రయత్నిస్తుంటే, వారేమో కేంద్రప్రభుత్వంతో రాజీ పడిపోయారు, ప్రత్యేక హోదా గురించి అడగడం లేదు. కేంద్రమంత్రి శ్రీ వెంకయ్యనాయుడు గారు మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక్కటే ఆ నాయుడు ఈ నాయుడు ఒకటేనని అంటున్నారు.

అధ్యక్షా, ఈ రోజున మన తెలుగు జాతికి కీర్తి కిరీటాలు లాంటివారు మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, కేంద్రమంత్రి శ్రీవెంకయ్యనాయుడు గారు. మన రాష్ట్ర.రాజకీయాలలో లివింగ్ లెజండ్స్ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, కేంద్రమంత్రి శ్రీ వెంకయ్యనాయుడు గారు. వారిని విమర్శించే అర్హత మనకు ఉందా? ఆ స్థాయి మనకు ఉందో లేదో మనం గుర్తుంచుకోవాలి. వారు జీవితంలో ఎమ్.ఎల్.ఏ, ఎమ్.పి., ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి మొదలైన అన్ని పదవులను అనుభవించారు. వారికి ఇంకేమి కావాలి? వారు ఇంకేమి కోరుకుంటున్నారు? తెలుగుజాతి గుండెల్లో చిరస్థాయిగా నిలబడిపోవాలని చెప్పే మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు గానీ, కేంద్రమంత్రి శ్రీవెంకయ్యనాయుడు గారు గానీ నష్టపోయినటువంటి, మోసపోయినటువంటి ఈ రాష్ట్రానికి న్యాయం చేయాలని నిరంతరం కృషి చేయడం జరుగుతోంది. వారు చేసినటువంటి కృషిని అభినందించి వారిని ప్రోత్సహించవలసింది పోయి వారిని విమర్శిస్తే ఏమి వస్తుంది?

మ. 12.50

అధ్యక్షా, ఇవాళ కాంగ్రెస్ పార్టీ వారు కానీ, వైఎస్ఆర్‌సిపి పార్టీ వారు కానీ, వెంకయ్యనాయుడుగారు కాడి వదేశారని అంటున్నారు. ఓకె. మరి వీళ్ళు ఢిల్లీకి వెళితే అక్కడ ఇంటర్వ్యూ ఇచ్చే దిక్కు కూడా ఉండదు. అక్కడ పట్టించుకునే నాథుడు కూడా ఉండడు. మరి అటువంటి మనకు అక్కడ ఒక పెద్ద దిక్కుగా వెంకయ్యనాయుడు గారు ఉండి, మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారిని ప్రోత్సహిస్తూ, వీరిద్దరూ కలిసి కృష్ణార్జునులు లాగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే, అది చూసి తట్టుకోలేక ఈర్ష్య, అసూయా ద్వేషాలతో, కుటిల రాజకీయం కోసం ఇటువంటి కుటిల విమర్శలు చేయడమనేది దారుణం. శ్రీ వెంకయ్యనాయుడు గారికి, చంద్రబాబు నాయుడిగారికి నష్టం ఏమీ చేకూర్చదు. వాళ్ళు జీవితంలో అన్నీ

చూసేశారు. ఇంక చూడవలసింది ఏమీ లేదు. కానీ, దానివలన మనం నష్టపోతాము. మన తెలుగు జాతి, తెలుగు రాష్ట్రం కూడా నష్టపోతుంది. ఇక మనల్ని ఆదుకునేవాళ్ళు ఎవరు? కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందా? వైఎస్ఆర్‌సిపి ఆదుకుంటుందా? కమ్యూనిస్టు పార్టీ వారు ఆదుకుంటారా? ప్రత్యేక హోదా, ప్రత్యేక హోదా, ప్రత్యేక హోదా అంటూ మబ్బుల్లో నీళ్ళు చూసి ముంత ఒలకపోసుకుంటున్నట్లు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని, పాలసీలను మార్చుకుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రణాళికా సంఘాన్ని, జాతీయ అభివృద్ధి మండలిని కూడా రద్దు చేశారు. ప్రత్యేక హోదా లేదని, ఇవ్వమని చెపుతున్నారు. ఇప్పటివరకూ ఈ దేశంలో ఉన్న 11 రాష్ట్రాలలో 8 రాష్ట్రాలకు ఆపేశామని అన్నారు. మిగతా మూడు రాష్ట్రాలకు రేపు మార్చి నెలాఖరు నుంచి ఆపివేస్తామని అంటున్నారు. చాలా స్పష్టంగా, క్లారిటీగా వాస్తవాలు ఇలా ఉంటే, లేనిదాన్ని ఊహించుకుని, కావాలని చెప్పి, అల్లరి చేయడం, గేలి చేయడం ఎంత వరకు సబబు? కృష్ణానది ప్రక్కకు వాళ్ళూ నీళ్ల వస్తారు. చొక్కా విడిచేసి ఆ నది ప్రక్కన కూర్చుని ఫొటోలు దిగుతారు. దానిద్వారా ప్రత్యేక హోదాకు గుర్తింపు ఉంటుందా?

MR. CHAIRMAN: Please conclude. I have to distribute the time.

శ్రీ వై.వి.బి. రాజేంద్రప్రసాద్ : అధ్యక్షా, ఈనాడు ప్రత్యేక హోదాకు మించిన ప్రత్యేక ప్యాకేజీని మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు తీసుకురావడం జరిగింది. ఆయన ఒక ఛాలెంజ్ చేస్తున్నారు. ప్రత్యేక ప్యాకేజి క్రింద మనకు ఇచ్చిన వాటిని చూస్తే, కేవలం ప్రత్యేక ప్యాకేజీల్లో లేకుండా ఈ ప్రత్యేక హోదాలో ఏం ఉందో చెప్పమనండి అధ్యక్షా? ఆయన దానిని కూడా తీసుకువస్తామని చెపుతున్నారు. కానీ, ఆ ప్రశ్నకి జవాబు లేదు. ప్రత్యేక ప్యాకేజీలో లేనిది ఏం ఉన్నది, ప్రత్యేక హోదాలో ఏం ఉంది? కేవలం పేరులో తేడా అంతే. మన రాష్ట్రానికి ముఖ్యంగా ఇన్‌స్టిట్యూషన్లు కావాలి. అందుకు సంబంధించిన నిధులు, నీళ్ళు కావాలి. వీటికోసం నిరంతరం, శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు కృషి చేస్తూ ఉంటే, కనీసం మీరు వారిని ప్రోత్సహించవలసిన అవసరం లేదు, పొగడవలసిన అవసరం లేదు. విమర్శలు, కువిమర్శలు చేయకుండా ఉంటే చాలు. మీరు కేంద్రంతో కుమ్ముక్కైపోయారని అంటున్నారు. ఈ కుమ్ముక్కైపోవడం వలన మాకేమి అవసరం? మా మీద ఏమైనా కేసులు ఉన్నాయా? మేము ఏమన్నా జైళ్ళల్లో ఉన్నామా? ఎలా అధ్యక్షా? కనుక, ఇటువంటి కువిమర్శలు చేయకుండా, ఈ రాష్ట్రాభివృద్ధి కోసం మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు చేస్తున్నటువంటి కృషికి, ఆయన చేసే ప్రయత్నాలకు అందరినీ సహకరించవలసిందిగా తమ ద్వారా కోరుతూ, ఇంత మంచి బడ్జెట్‌ను ఈ రోజున ప్రవేశపెట్టినటువంటి రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆర్థిక శాఖామంత్రిగారికి, ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం: అధ్యక్షా, ముందుగా మీకు ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, తెలుగుజాతి చరిత్రలో నేడు ఒక కీలకమలుపు. రాష్ట్ర విభజన తరువాత, మన నేలపై, మన నూతన రాజధానిలో, మన నూతన శాసనమండలి భవనంలో ప్రవేశపెట్టిన 2017-18 తొలి బడ్జెట్ ఇది. కేవలం ప్రజాప్రతినిధులే కాదు, ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి యావత్ 5 కోట్ల ప్రజానీకం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నటువంటి శుభ సందర్భం ఇది. మన ఆర్థిక మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ జనరంజకంగా ఉందని సంతోషంగా చెబుతున్నాను.

అధ్యక్షా, రైతులకు, పేదలకు, మహిళలకు, యువతకు పెద్ద పీట వేసిన బడ్జెట్ ఇది. అందుకే ఈ బడ్జెట్‌ను నేను స్వాగతిస్తూ, నా మద్దతును తెలుపుతున్నాను. అంతేగాకుండా, అటు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ, ఇటు అభివృద్ధి కార్యక్రమాలను నడిపిస్తూ, సమన్వయంతో ముందుకు తీసుకుపోయిన బడ్జెట్ ఇది. మరి ఏ రాజకీయ పార్టీ అయినా, ఎన్నికల ముందు ఒక మేనిఫెస్టోని ప్రజల ముందు ఉంచుతుంది. ప్రజల ముందుంచిన మేనిఫెస్టోని చూసి, అధికారాన్ని ప్రజలకు కట్టబెడతారు. ఈ బడ్జెట్‌ని చూస్తే, ఎన్నికల మేనిఫెస్టోలో ఏ రకంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ఆనాడు చెప్పారో, ఈనాడు ఆయన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత, మన రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఉన్నా, ఈ బడ్జెట్‌లో ఎన్నికల మేనిఫెస్టోలో ఉన్న అంశాలను అమలు చేసే దిశలో ఉన్నట్లుగా చాలా స్పష్టంగా కనిపిస్తోంది.

అధ్యక్షా, అలాగే నేలను త్రవ్వడం, దుక్కిదున్నటం మరచిపోతే, మనల్ని మనం మర్చిపోయినట్లేనని జాతిపిత మహాత్మాగాంధీ గారు అన్నటువంటి మాటలనే మార్గదర్శకంగా తీసుకుని ఈ ప్రభుత్వం ముందుకు పోతోంది. అందుకే అధ్యక్షా, మన రైతుల గురించి ఒకసారి ఆలోచించండి. ఆనాడు శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు పాదయాత్రలు చేసే సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల ఋణ మాఫీ చేస్తామని చెప్పారు. దానికి కట్టుబడి ఉన్నారు. ఈ రాష్ట్రం విడిపోవడం వల్ల మన రాష్ట్రం దాదాపు రూ.16,079 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉండి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం దాదాపు రూ.24,000 కోట్లను టార్గెట్‌గా పెట్టుకుందంటే, ఈ రైతు ఋణ మాఫీకి కట్టుబడి ఉన్నది ఈ ప్రభుత్వమేననే మాట తమ ద్వారా స్పష్టం చేస్తున్నాను.

అధ్యక్షా, ఇప్పటికే రూ.16,079 కోట్లు లోటు బడ్జెట్‌లో ఉన్న ఈ ప్రభుత్వం రైతుల ఉపశమనం కోసం 55 లక్షల మంది రైతుల ఖాతాలలో రూ.11,000 కోట్లను ఇప్పటికే జమ చేసింది. ఈ బడ్జెట్‌లో దాదాపు రూ.3,600 కోట్లను రైతులకు కేటాయించడం చాలా సంతోషంగా ఉంది. ఇది రైతు బడ్జెట్. ఇకపోతే, ఎంతో అనుభవం కలిగినటువంటి ప్రతిపక్ష నాయకులు కూడా ఎప్పుడూ ఒకటే మాట అంటున్నారు – అప్పులు చేస్తున్నారు, అప్పులు పెరిగిపోతున్నాయి, ఈ అప్పుల అంకెలు కూడా తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని చాలా సీనియర్ నాయకులు కూడా చెప్పడం చాలా బాధాకరం. తమ ద్వారా ఈ ప్రభుత్వానికి మనవి చేసేదేమిటంటే – కాగ్ నివేదికల ప్రకారంగా, 2014–15 ఉమ్మడి రాష్ట్రంలో మనమందరం కలిసి ఉన్నప్పుడు మన అప్పు దాదాపు రూ.1,66,522.32 కోట్లు. ఇది వాస్తవమే అధ్యక్షా. నిన్ననే గౌరవ సభ్యులు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ గారు కూడా చెప్పారు.

అలాగే, మన రాష్ట్రం విడిపోయిన తరువాత, అప్పు కూడా పెంచారు. అది దాదాపు రూ.97,123.93 కోట్లు. ఇప్పుడు ఆ అప్పు బాగా పెరిగిపోతోందని, పెంచుకుంటూ పోతున్నారని చాలా రాద్ధాంతం చేస్తున్నారు. ఒక కుటుంబ యజమాని కష్టాలలో ఉన్నప్పుడు, అప్పులతో పంచుకున్నప్పుడు కొన్ని కనీస అవసరాలు కూడా ఉంటాయి. ఆ అవసరాలను తీర్చడం కోసం అప్పులు చేసి, ఆ కుటుంబాన్ని ముందుకు తీసుకుపోవలసినటువంటి పరిస్థితి ఆ కుటుంబ యజమానికి ఉంటుంది. ఈనాడు ఈ ఆంధ్రరాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను గనుక చూసినట్లయితే, అప్పు పెరుగుతున్నటువంటి మాట వాస్తవమే. ఈ అప్పులు ఎందుకు చేస్తున్నారంటే, విడిపోయినటువంటి ఈ రాష్ట్రానికి కనీసం రాజధాని కూడా లేదు. ఆ అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో ఆయన అప్పు చేస్తున్నారు. ఆ అప్పు కూడా ఎలా

ఇస్తారంటే అధ్యక్షా, ఒక నిబద్ధత ప్రకారం ఇస్తారు. మన గ్రామాలలో ఎవరికి వారే ఆస్తులు లేకుండా అప్పు అడిగితే ఇవ్వరు. ఆస్తులు ఉంటేనే, ఆ ఆస్తి చూసి అప్పులు ఇస్తారు. ఈనాడు మన రాష్ట్ర పరిస్థితి కూడా అదే. మన రాష్ట్ర జిడిపి బాగుంటేనే మనకు అప్పు పుడుతుంది. ఈనాడు ఆంధ్రప్రదేశ్ జిడిపి 10.99 శాతంగా ఉంది. దీని కొరకు అప్పు చేస్తుంటే ఇవి తప్పుడు లెక్కలని మళ్లా రాద్ధాంతం చేస్తున్నారు. నేను ఒక్కటే మనవి చేస్తున్నాను. అప్పు ఇచ్చేటప్పుడు ఇది వాస్తవమా, కాదా అనే విషయాలని కూడా చూస్తారు. కాబట్టి, ఇంత ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం, అవసరాలు తీర్చడం కోసం ఈ బడ్జెట్ ప్రవేశపెట్టి ముందుకు తీసుకుపోతున్నారు. ఒకసారి బడ్జెట్ గురించి మనం పరిశీలిస్తే, మొత్తం బడ్జెట్ రూ.1,56,999 కోట్లు. రెవెన్యూ వ్యయం రూ.1,25,911 కోట్లు. పెట్టుబడి వ్యయం రూ.31,087 కోట్లు. ఆర్థిక లోటుని రూ.23,054 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూ లోటుని రూ.416 కోట్లుగా అంచనా వేశారు. వ్యవసాయానికి రూ.9,090 కోట్లు అంటే 5.79 శాతం కేటాయింపులు ఈ బడ్జెట్‌లో పెట్టాము. ఒక్కసారి మనం ఈ విశ్లేషణ చేస్తే ఎస్సీల సంక్షేమం గురించి చెప్పాలి.

మ. 1.00

అట్టడుగున ఉన్న ఎస్సీల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్న విషయాన్ని నారా చంద్రబాబునాయుడు గారు ఈ బడ్జెట్‌లో స్పష్టంగా చూపించారు. గతంలో ఎస్సీ కుటుంబాలను ఆదుకోవడం కోసం 50 యూనిట్ల కరెంటు ఉచితంగా ఉండేది. దానివల్ల 10.53 లక్షల కుటుంబాలు లబ్ధి పొందేవి. ఇప్పుడు దానిని 75 యూనిట్లకు పెంచడమైనది. అందుకోసం రూ.3300 కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించారు. అమరావతిలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేసి 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి సమావేశ మందిరం, ధ్యానమందిరం, గ్రంథాలయాలు ఏర్పాటు చేసి ఎస్సీ సంక్షేమం కోసం ఏపిఐఐసి ద్వారా నిర్మాణం చేపట్టేందుకు రూ.97.69 కోట్లు ఈ బడ్జెట్‌లో పెట్టారు.

సమాజంలో సగం బి.సి. వర్గాల వారున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు వారి పరిస్థితి ఎలా ఉండేదో అందరికీ తెలుసు. కేవలం ఓటు వేసే యంత్రాలుగా చూసేవారు. ఆ తరువాత గొర్రెలివ్వండి, బర్రెలివ్వండి అని యాచకులుగా మిగిలిపోయే దౌర్భాగ్య పరిస్థితి ఆనాడు ఉంటే, 1982వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ పెట్టిన తరువాత, అధికారం చేపట్టిన తరువాత బీసీలకు స్వాతంత్ర్యం వచ్చిందని సగర్వంగా మనవిచేస్తున్నాను. 2015-16 సంవత్సరం బడ్జెట్ చూస్తే రూ.6,640 కోట్లు ఉంటే, 2016-17 సంవత్సరానికి రూ.8,832 కోట్లు పెంచగా, 2017-18 సంవత్సరానికి పదివేల కోట్లకు పెంచిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని చెప్పవచ్చు. ఈ విధంగా చూసినట్లయితే బిసిల పక్షపాతిగా కనబడుతున్నది.

మొట్టమొదటగా మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కి ఒక కార్పొరేషన్ పెట్టి రూ.60 కోట్లు కేటాయింపు చేశారు. విద్యార్థుల ట్యూషన్ ఫీజుకి రూ.1316 కోట్లు చూపించారు. హాస్టల్ నిర్వహణకి రూ.307 కోట్లు కేటాయించారు. స్టడీ సర్కిల్‌కు రూ.30 కోట్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ 32 ఉంటే, వాటిని 41కి పెంచుతున్నారు. "ఎన్‌టిఆర్ విదేశీ విద్యాదరణ" కొరకు రూ.79 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం

321 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పది లక్షల చొప్పున విదేశాలలో విద్యార్జన కోసం సహాయం అందించారు. ఈ రకంగా బీసీ సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఖర్చుపెడుతున్నదని నేను మనవిచేస్తున్నాను.

మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి రూ.840 కోట్లు కేటాయించారు. ఎస్టీ సంక్షేమానికి రూ.3,528 కోట్లు కేటాయింపులు చూపించారు. కాపు కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.75 కోట్లు, క్రిస్టియన్ కార్పొరేషన్‌కు రూ.35 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి, వికలాంగులకు అందరికీ సమతుల్యాన్ని పాటిస్తూ, అన్ని వర్గాలకూ న్యాయం చేస్తూ ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు.

పింఛన్లకు సంబంధించి మాట్లాడాలంటే ముందుగా శ్రీ నందమూరి తారక రామారావు గారి గురించి చెప్పుకోవాలి. వారే మొదటిసారిగా పింఛన్లు ఇచ్చారు. చంద్రబాబు నాయుడు గారు రూ.75లు పింఛను ఇస్తే, డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారు రూ.200 లు పెంచారు. ఆనాడు అంత పెంచారని ఆ పార్టీకి చెందిన నాయకులు గొప్పగా చెబుతున్నారు. మరి ఈనాడు ముఖ్యమంత్రిగారు రూ.200ల పెన్షన్‌ను రూ.1000లకు పెంచి 48 లక్షల కుటుంబాలను ఆదుకుని సంవత్సరానికి రూ.5, 6 వేల కోట్లను ఖర్చు చేస్తున్నారు. ఇది సంక్షేమ ప్రభుత్వం అధ్యక్షా. గతంలో బియ్యం 4 కేజీలు ఇచ్చేవారు. దానిని ఇప్పుడు 5 కేజీలు చేశారు. గతంలో కుటుంబానికి 20 కేజీలు సీలింగ్ ఉండేది. కానీ, ఇప్పుడు కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నాము. ఈ రకమైనటువంటి కార్యక్రమాలను చేస్తూ ఈ ప్రభుత్వం ముందుకు వెళుతున్నది.

మహిళలకు పెద్దపీట వేసిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం. డ్వాక్రా మహిళలకు మొట్టమొదటగా గుర్తింపునిచ్చి వారికి ఆర్థిక స్వాతంత్ర్యం ఇవ్వాలని ఆలోచించిన ప్రభుత్వం శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి ప్రభుత్వమని మనవిచేస్తున్నాను అధ్యక్షా. మేము అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని ఇచ్చిన మాటకి కట్టుబడి ఉన్నది ఈ ప్రభుత్వం. అందుకోసం రూ.10,000కోట్లు టార్గెట్ పెట్టుకున్నది. ఒక్కొక్కరికీ రూ.3,000 చొప్పున రెండు సార్లుగా రూ.6,000 చెల్లించారు. అంటే ఇప్పటికి రూ.4,972కోట్లు, వడ్డీ క్రింద రూ.1338 కోట్లు వారి ఖాతాలలో జమ చేయడమైనది. ఈ సంవత్సరం రూ.1600 కోట్లు కేటాయింపులు జరపడమైనది. వారికి 'దీపం పథకం' క్రింద రూ.350 కోట్లు కేటాయించి, ప్రతివారికి పొగ లేని ఇల్లు ఉండాలని, పొగ పీల్చడం ద్వారా వారి ఆరోగ్యం పాడవుతుందని ఎల్‌పిజి గ్యాస్ ఇవ్వడం జరిగింది.

ఇంకా చాలా కార్యక్రమాలు ఉన్నాయి, వాటి గురించి మాట్లాడడానికి సమయం లేదు. ఏది ఏమైనా శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రశంసిస్తూ, అన్ని వర్గాల పట్ల సమతుల్యతను పాటిస్తూ మంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని నేను భావిస్తున్నాను. దీనికి నేను మనస్ఫూర్తిగా మద్దతునిస్తూ, స్వాగతిస్తూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి.డి. జనార్ధన్ (నామినేటెడ్) : అధ్యక్షా, విభజనానంతరం ఈ రోజు మన నేలపై మనం పాలన సాగిస్తూ, చరిత్ర సృష్టించబోయే నగరం అమరావతిలో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌పై మాట్లాడేందుకు అవకాశమిచ్చినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. అలాగే, అవకాశం ఇచ్చిన మీకు, ముఖ్యమంత్రిగారికి కూడా ధన్యవాదాలు, ఈ బడ్జెట్ ప్రవేశపెట్టిన శ్రీ యనమల రామకృష్ణుడు గారికి

మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. మూడు దశాబ్దాల నుండి రాజకీయాలలో ఉన్నాను. అనేక బడ్జెట్‌లు చూశాను. కానీ, ఇది ప్రగతి కోరే బడ్జెట్. జనరంజకమైన బడ్జెట్‌ను మా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది సర్వజనామోదమైనటువంటి బడ్జెట్. ఈ మాట ఎందుకన్నానంటే, బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత వారం రోజులుగా మనం చూస్తున్నాం. సమాజంలోని వివిధ రంగాలవారందరూ కూడా దీనిని ఆదరిస్తున్నారు, అభిమానిస్తున్నారు. పూర్వం బడ్జెట్ వచ్చినప్పుడు విమర్శలు ఎలా వచ్చేవో మనకు తెలుసు. అటువంటి పరిస్థితి ఈనాడు ఈ బడ్జెట్‌పై ఎక్కడా లేదు. అంతేగాకుండా 15 శాతం వృద్ధి రేటు సాధించిన పరిస్థితి ఉన్నది. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, అన్ని వర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూ, చరిత్రలో నిలిచిపోయే బడ్జెట్ ఇది. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో మేనిఫెస్టోలో మేము చెప్పాము. చంద్రబాబు నాయుడు గారు ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి వాటన్నింటినీ తెలుసుకోవడం కోసం, ప్రజలకు బాసటగా ఉండడం కోసం మహా పాదయాత్ర ప్రారంభించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలిశారు. వారి సాధకబాధకాలను తెలుసుకొని అక్కడికక్కడే చలించి హామీలు ఇచ్చారు. ఆ హామీలన్నింటినీ నెరవేర్చడం కోసం గత రెండు సంవత్సరాలుగా బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులు చేస్తూ అందరినీ ఆదుకుంటూ పాలన సాగిస్తున్నారు. రూ.16,000కోట్లు లోటు ఉన్నా దేశవ్యాప్తంగా అందరూ ఆశ్చర్యపోయే విధంగా రెండంకెల ప్రగతిని వరుసగా రెండు సంవత్సరాలు సాధించిన ఘనత ఈ ప్రభుత్వానిది. గతంలో కంటే అధికంగా ఈ సంవత్సరం కూడా అన్ని రంగాలకు కేటాయించడం జరిగింది. ఇవన్నీ గమనిస్తే, ప్రపంచ పటంలో నిలపాలన్న తపన గౌరవ ముఖ్యమంత్రిగారి మనసులో ఉన్నట్లు తెలుస్తున్నది.

రేపటి తరానికి ఏం కావాలో ఆలోచించే నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. 1995వ సంవత్సరంలో వారు పాలన చేపట్టినప్పుడు రాష్ట్రంలో కరెంటు లేని పరిస్థితి నెలకొని ఉన్నది. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉన్నది. ఆర్థిక పరిస్థితి కూడా చాలా అధ్వాన్నంగా తయారైంది. ఖజానా ఖాళీ అయిపోయింది. అప్పుడు శ్వేతపత్రాలు ప్రకటించి ప్రజలందరి మద్దతు కూడగట్టి ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టారు. పది సంవత్సరాల పాలన తరువాత ప్రభుత్వం మారిపోయి అధికారంలోకి వచ్చినటువంటి వాళ్లు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చక్కబెట్టిన ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టారు. రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ప్రజా ధనం దోపిడీ అయిపోయింది.

01.10

ఆనాడు శ్రీ చంద్రబాబు నాయుడు గారు సంపదను సృష్టించి, నారు వేసి, నీరుపోసి, చెట్టుగా చేసి, ఫలాలు వచ్చే సమయానికి, ఆ ఫలాలు పేదలకు చెందవలసి ఉండగా, అప్పుడు అధికారంలోకి వచ్చిన పాలకులు దోపిడీ చేయడం జరిగింది. మళ్లీ రాష్ట్ర విభజన జరిగిన అనంతరం, అదే క్లిష్ట సమయంలో శ్రీ చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ కష్టాలను, సమస్యలను పరిష్కరించే విధంగా, రేపటి తరానికి ఏమి కావాలో ఆలోచించి శ్రీ చంద్రబాబు నాయుడు గారు చేస్తున్న పాలన గురించి అర్థంకాని ప్రతిపక్షాలు అర్థరహితమైన విమర్శలు చేయడం జరుగుతోంది. ఒక రాజకీయ నాయకుడు రేపటికి ఏమి కావాలో ఆలోచిస్తాడు. ఒక రాజనీతిజ్ఞుడు రాబోయే తరానికి ఏమి కావాలో ఆలోచిస్తాడు. ఈ

మాటను నేను ఆషామాషీగా చెప్పడం లేదు. ఇది ఆచరణలో జరిపి చూపించినటువంటి విషయం. ఆనాడు హైటెక్ సిటీని నిర్మించడం వల్ల అది భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని, ఆదాయం సమకూరుస్తుందని శ్రీ చంద్రబాబునాయుడు గారు చెబితే, ఆనాడు ప్రతిపక్షాలు ఆయనను విమర్శించాయి. ప్రజలు కూడా దూరదృష్టితో దానిని ఆలోచించలేకపోయారు. కానీ, ఈనాడు అది నిజమని నిరూపణ అయింది. మాదాపూర్‌లో హైటెక్ సిటీని నిర్మించడం వల్ల లక్షలాది మంది సామాన్య ప్రజల పిల్లలకు ఉపాధి అవకాశాలు వచ్చాయి. ఐ.టి. పరిశ్రమలో కూలీల పిల్లలు, రైతుల పిల్లలు ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఐ.టి. పరిశ్రమ వచ్చిన తర్వాత ఐ.ఏ.ఎస్. మరియు ఐ.పి.ఎస్. లాంటి పోస్టులకు కూడా ఆదరణ తగ్గింది. కాబట్టి ఏది చేసినా శ్రీ చంద్రబాబు నాయుడు గారు దూరదృష్టితో ప్రజల సంక్షేమం కోసం చేస్తారు.

అధ్యక్షా, ఎన్నికలలో హామీ ఇచ్చినవి మాత్రమే కాక, హామీ ఇవ్వనివి కూడా ఆయన చేశారు. తల్లి - బిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకాన్ని ప్రవేశపెడితే విశేషమైన ఆదరణ వచ్చింది. నదుల అనుసంధానం గురించి ఆనాడు తొలి పంచవర్ష ప్రణాళిక కాలంలో కూడా చర్చించారు. భారతదేశం వ్యవసాయిక దేశం. వ్యవసాయం సుభిక్షంగా ఉంటే ప్రజలు సుభిక్షంగా ఉంటారు. అందువల్ల ఏకైక మార్గం నదుల అనుసంధానమని ఆ కాలంలో చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి సుమారు 60 సంవత్సరాలు దాటింది. ప్రతి ప్రభుత్వంలో మాటలు చెబుతూ ఉన్నారు. కొంతమంది చేయాలని ప్రయత్నించారు కానీ, ఎవరికీ సాధ్యం కాలేదు. స్వతంత్ర భారత చరిత్రలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒకే ఒక్కడు కృష్ణా, గోదావరి నదులను కలిపి నదుల అనుసంధానికి శ్రీకారం చుట్టారు. దాని ఫలితాలను మనం చూస్తూనే ఉన్నాము. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు కృష్ణా నదికి రాకపోతే 14 లక్షల ఎకరాల డెల్టా ప్రాంతం ఎడారిగా మారి ఉండేది. గత సంవత్సరం పంటలు పండకపోవడాన్ని మనం చూశాము. కానీ, ఈ సంవత్సరం పట్టిసీమ నుంచి నీరు వచ్చి పారితే, ఎకరాకు 40 నుంచి 42 బస్తాలు దిగుబడి వచ్చి రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. కొంతమంది రైతులు వచ్చి ముఖ్యమంత్రి గారిని అభినందించడం కూడా మనం చూశాము.

అధ్యక్షా, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గోదావరి నీరు డెల్టాకు మళ్లించి కృష్ణా నది నీటిని రాయలసీమ ప్రాంతానికి ఇస్తున్న పరిస్థితి ఉంది. సాక్షాత్తూ, పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నా, ఆ కాలంలో వాళ్లు చేయని పనిని శ్రీ చంద్రబాబు నాయుడు గారు రెండున్నర సంవత్సరాలలో పులివెందులకు నీరు ఇచ్చి చూపించారు. అనంతపురం జిల్లాకు 40 టి.ఎం.సి.ల నీటితో చెరువులన్నీ నింపారు. ఇంకా అది చాలదని ఈరోజు ముచ్చుమర్రి ప్రాజెక్టు ద్వారా అక్కడున్నటువంటి కాలువలన్నీ వెడల్పు చేశారు. వరదలు వచ్చినపుడు నీరంతటినీ రాయలసీమ ప్రాంతంలోని చెరువులన్నీ నిండే విధంగా మన ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారు బృహత్తరమైన ప్రణాళికలు రచించి వాటిని అమలుచేశారు.

అధ్యక్షా, చెప్పిన మాట ప్రకారం రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం కోసం పెద్దఎత్తున బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఉద్యానవన పంటలకు కూడా రూ.10 వేల వరకూ మాఫీ చేయడం జరిగింది. ఈ బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్నుల ప్రస్తావన ఎక్కడా లేదు. ఎప్పుడూ బడ్జెట్ అనగానే ప్రజలకు పన్నులు గుర్తొస్తాయి. ఎవరిపై ఎటువంటి పన్నులు వేస్తారో అని అనుకుంటారు. ఎక్కడా ప్రజలకు

ఇబ్బంది కలగకుండా బడ్జెట్‌ను రూపొందించారు. దీనిని సభ్యులు గమనించాలి. పరోక్ష పన్నులను ఎక్కడా పెంచలేదు. అయినా రెండంకెల అభివృద్ధి సాధించడం జరిగింది. ఇది చరిత్ర. మా ప్రభుత్వం బలపరుస్తున్న బడ్జెట్ ఎక్కడైనా, ఎప్పుడైనా వినూత్నంగా ఉంటుంది. ప్రప్రథమంగా చరిత్రలో గతసారి వ్యవసాయ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టాము. ఈసారి నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిని ప్రవేశపెట్టడం జరిగింది. ప్రారంభం నుంచి పేదలకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వం, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నటువంటి ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం. కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో పేదప్రజలకు తినడానికి తిండి, నివసించడానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్టలు ఇవ్వాలనే సంకల్పంతో స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు ఆనాడు రాజకీయాలలోకి అడుగుపెట్టారు. "సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు" అనే నినాదమే మా ప్రభుత్వ విధానం. "అన్నగారూ, కమ్యూనిజమ్ అంటున్నారు, క్యాపిటలిజమ్ అని అంటున్నారు మరి మీదే ఇజం" అని ఒక విలేఖరి స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారిని అడిగితే, "బ్రదర్, నాది యువనిజం, ఏ పార్టీ చెప్పినా, ఏ ఇజం చెప్పిన మానవతావాదమే కదా, మానవుల సమస్యల పరిష్కారమే కదా" అని చెప్పిన గొప్ప మానవతావాది అన్నగారు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారు. ఆయన స్ఫూర్తితో నడుస్తున్నటువంటి ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం.

అధ్యక్షా, మాటలే కాదు, బడ్జెట్ కేటాయింపులను చూసినా చేతల గురించి తెలుస్తుంది. అన్నగారు రాజకీయాలలోకి రాకముందు దాదాపు 35 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ పాలన రాష్ట్రంలో మరియు కేంద్రంలో కంటిన్యూగా కొనసాగింది. "గరిభీ హటావో" అనే నినాదం చెప్పి అధికారాన్ని సంపాదించారు. కానీ, ఒక్కరి పేదరికాన్ని తొలగించడానికి ఏదైనా ప్రయత్నం చేశారా? పేద ప్రజలకు తిండి పెట్టడానికి ప్రయత్నం చేశారా? అన్నగారు అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే పేదవాడికి కిలోబియ్యం రెండు రూపాయలకు పథకాన్ని అమలులోకి తెచ్చారు. మొట్టమొదటిసారి పేదవాడిని పక్కా గృహంలో ఉంచాలని ఆయన ఆలోచించారు. పేదవాడు పేదవాడిగానే ఉండాలని కాకివాసాలు, తాటాకులు ఇవ్వడం అంతకుముందు కూడా చూశాము. పేదవాడు సంపన్నుడు కావడానికి ఎవరూ ప్రయత్నం చేయలేదు. కానీ, పేద ప్రజలకోసం పక్కా గృహాలను నిర్మించడం, పేద ప్రజల ఆకలి తీర్చడం, వారికి జనతా వస్త్రాలను ఇవ్వడం, గ్రామ గ్రామానికి మంచినీటి పథకం, పాఠశాలలన్నింటినీ గురుకుల పాఠశాలలుగా మార్చడం ద్వారా పేద ప్రజల పిల్లలు కూడా మంచి విద్యను అభ్యసించడం కోసం అవకాశాలు కల్పించిన ఘనత ఒక్క తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుంది. ఇప్పటికి కూడా ఆ పథకాలన్నీ కొనసాగిస్తూనే ఉన్నాము.

అధ్యక్షా, పెన్షన్ల కోసం రూ.4,376 కోట్లు కేటాయించాము. భారతదేశంలో మొట్టమొదట పెన్షన్ల పథకాన్ని ప్రవేశపెట్టింది ఎవరంటే, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు. ఇది మర్చిపోలేని సత్యం. ఆయన ఆనాడు రూ.30 లతో పెన్షన్ ప్రారంభిస్తే, శ్రీ చంద్రబాబునాయుడు గారు ఆ తర్వాత రూ.75 లకు ఆ మొత్తాన్ని పెంచారు. ఆ తర్వాత కేంద్రం రూ.400 లు ఇచ్చినా రూ.200 లు మాత్రమే పేదలకు ఇచ్చింది మధ్యలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మరొక ప్రభుత్వం. ప్రజలు పడుతున్న బాధలను చూసి ప్రస్తుతం ఆ మొత్తాన్ని ఐదు రెట్లుకు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు పెంచారు. ఐదు రెట్లంటే, నెలకు రూ.1000 లు, సంవత్సరానికి రూ.12 వేలు పెన్షన్‌గా ఇస్తున్నారు. ఒక ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకుంటే,

సుమారు రూ.12 వేలు ఆదాయం వచ్చే పరిస్థితి ఉంది. అంటే, ఒక్కొక్క పేదవాడికి పెన్షన్ ద్వారా ఎకరం పొలం ఇచ్చినదానికి సమానమవుతుంది. ఎందుకు ఈ మాటను చెబుతున్నానంటే, పొలంలో వ్యవసాయం చేస్తే, నారు పోయాలి, నీరు పోయాలి, పురుగుల మందు కొట్టాలి, రోజూ పొలం పోవాలి, అరకు దున్నాలి, ఇన్ని పనులు చేస్తే, పంట పండుతుందో లేక పండదో తెలియదు. అది ప్రకృతి దయాదాక్షిణ్యంపై ఆధారపడి ఉంది. కానీ, 1వ తారీఖు వచ్చేనాటికే రూ.1000 లు పేద ప్రజలకు పెన్షన్ రూపంలో అందుతోంది. ఆ విధంగా ఎకరం పొలం వారికి ఇచ్చిన దానితో సమానమవుతుంది. పేద ప్రజల ఇళ్ల నిర్మాణం కోసం రూ.1457 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది.

మ. 01.20

జ్వరం దగ్గరినుంచి అన్ని రకాల జబ్బులకు, పేదవారికి వైద్యం అందేవిధంగా ఎన్.టి.ఆర్ వైద్యసేవను రూపొందించడం జరిగింది. చిన్న జబ్బు నుంచి పెద్ద జబ్బు వరకు పేదవారికి రూపాయి ఖర్చులేకుండా ఆరోగ్య, వైద్య సదుపాయం కల్పించడం జరుగుతోంది. అంతేకాక పేద రైతులకు విద్యుత్ సబ్సిడీకోసం రూ.3300కోట్లు కేటాయించడం జరిగింది. వచ్చే జూన్ నాటికి ప్రతి పేద మహిళకు గ్యాస్ కనెక్షన్ ఇస్తానని ముఖ్యమంత్రిగారు హామీ ఇచ్చి, దానికొరకు బడ్జెట్‌లో దాదాపు రూ.350కోట్లు కేటాయించారు. భారతదేశంలో పేద మహిళ పొయ్యి దగ్గర కూర్చొని ఊది ఊది కళ్ళు మండి ఊపిరితిత్తులు దెబ్బతినే పరిస్థితి ఉంటే చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రి అయ్యేంతవరకూ కూడా పేద మహిళకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలనే స్పృహ భారతదేశంలో ఏ ప్రభుత్వమూ చెయ్యలేదు. కానీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడుగారు వచ్చిన తరువాత మొట్టమొదటిసారి మహిళలకి గ్యాస్ కనెక్షన్ ఇచ్చినప్పుడు, అలా ఇవ్వడానికి వీల్లేదని ఆనాడు ప్రతిపక్షంవారు కోర్టుకు కూడా వెళ్ళారు. గ్యాస్ గ్రిడ్ వారితో మాట్లాడి జూన్ 2 నుంచి ప్రతీ మహిళకి మన ముఖ్యమంత్రిగారు ఇవ్వబోతున్నారు. అందుకు వారిని మహిళాలోకం తరఫున మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

అంతేకాదు, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం కోసం ఖర్చు తగ్గించి ఆదాయం పెరిగే అనేక మార్గాలను బడ్జెట్‌లో సూచించడం జరిగింది. చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి కల్పించడం కోసం ఒక అథారిటీని స్థాపించి రూ.125కోట్లు కేటాయించారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించడమనేది రైతులపాలిట వరంగానే చెప్పవచ్చు. వ్యవసాయంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పించడం కోసం పశు పోషణ, మత్స్య పరిశ్రమకు అదనపు బడ్జెట్ కేటాయించి రైతులకు బాసటగా నిలబడడం జరిగింది.

దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ ఈరోజు ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయడంకోసం ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. గతంలో చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తోటపల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేయగా, మధ్యలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పది సంవత్సరాలూ ఆ ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదు. వాళ్ళంతా కమీషన్లు ఎక్కడొస్తే అక్కడ పనులు చేశారు. ప్రాజెక్టులు పూర్తిచేయడంమీద దృష్టిపెట్టలేదు. కానీ చంద్రబాబునాయుడుగారు వచ్చాకనే తోటపల్లికి నీళ్ళివ్వడం జరిగింది.

నూతన యంత్రాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఈరోజు పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. లోటు బడ్జెట్ ఉన్న అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అగ్రవర్ణ పేదలకు కూడా తగిన న్యాయం చేకూర్చేందుకు

ఆర్థికాభివృద్ధి కార్యాచరణ రూపొందించడం జరిగింది. రాలయసీమ నుంచి రాజధానికి రాకపోకలు సాగించడానికి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎక్స్‌ప్రెస్ హైవేకి రూ.27,000 కోట్లు కేటాయించి ఆరు వరుసల హైవేను ఏర్పాటుచేస్తున్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో సుమారు నాలుగు గంటల సమయంలోనే రాయలసీమ నుంచి అమరావతికి రాకపోకలు సాగించడానికి అవకాశం కల్పించబడుతుంది. కేటాయింపులకే పరిమితం కాకుండా ఖర్చయ్యే ప్రతి పైసాని సద్వినియోగం చేయడానికి మా ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంది. గవర్నర్‌గారు చెప్పినట్లు ప్రభుత్వ పథకాల ఫలితాలు పేదలకు చేరుకునే విధంగా, ఎవరికోసం పథకం నిర్దేశిస్తే వారికి అది అందేవిధంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవడానికి కృషి చేస్తూ ప్రజలకు నిరంతరమూ సేవ చేసే ప్రభుత్వంగా ఉంటుంది.

రాజధాని కొరకు రైతులు భూములిచ్చారు. చరిత్రలో మనం చూస్తే నాగార్జునసాగర్‌కు, పులిచింతలకు, అలాగే వాన్‌పిక్‌కు రైతులు భూములిచ్చారు. వారిలో చాలామంది బికారులు, కూలీలైనారు. మహోన్నతమైనటువంటి ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులను సంతృప్తికరంగా ఆదుకోవాల్సిన అవసరముంది. ఆ భూమిపై వచ్చిన ప్రాజెక్టుల ఫలితాలు ఆ రైతులకు అందడంలేదు. ఇది చాలా అన్యాయం, అమానుషం. అయితే చంద్రబాబునాయుడుగారు పాదయాత్ర చేసినప్పుడు వీటన్నింటినీ గమనించారు. అందుకే ఈ రాజధానిలో వచ్చే ఫలితాలు మీ అందరికీ అందచేస్తానని రాజధానికి భూములిచ్చినటువంటి రైతులకు చెప్పారు. ప్రపంచంలోనే ఇది ఒక అద్భుతం. ఏ దేశంలోనూ, ఎక్కడా లేని ఒక వినూత్న ప్రయోగమిది. తద్వారా 33,000 ఎకరాల భూమి చంద్రబాబునాయుడుగారిమీద ఉన్న నమ్మకంతో ఇచ్చారు. 100 ఎకరాలు నానో ప్రాజెక్టు గురించి ప్రభుత్వాలే తలకిందులై పల్టీకొట్టినటువంటి పరిస్థితిని పశ్చిమబంగ లో చూశాము. కానీ ఇక్కడ 33,000 ఎకరాలు ఇచ్చిన రైతులకు అందులో ఫలితం చేకూరేవిధంగా కార్యాచరణను రూపొందించడంలో విజయవంతమయ్యాము. దీనివల్ల ఇప్పుడు విమానాశ్రయానికి భూములు కూడా సులభంగా సేకరించగలిగాము. ఎక్కడ ఏ ప్రాజెక్టుకు భూములిచ్చినా, దానివల్ల వచ్చే ఫలితాలు భూములిచ్చిన రైతులకు అందచేయాలనేది మా ప్రభుత్వంయొక్క విధానం.

కేంద్రంతో సఖ్యతగా ఉండాలనేదే మా ప్రభుత్వ విధానం. రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఏడు ముంపు మండలాలు మనకు ఇవ్వకపోతే పోలవరం కట్టలేని పరిస్థితి. అందుకని తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికైన తరువాత ఏడు మండలాలు ఇస్తేనే నేను ప్రమాణస్వీకారం చేస్తాను లేకపోతే చెయ్యలేనని ముఖ్యమంత్రిగారు నిర్మొహమాటంగా చెప్పడం జరిగింది. దానితో ప్రధానమంత్రి మోడీగారు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మొట్టమొదటి మంత్రివర్గ సమావేశంలోనే తీర్మానం చేయడం జరిగింది. ఆ విధంగా పోలవరాన్ని సాధించాము. అంతేగాకుండా కేంద్ర ప్రాజెక్టు అంటే కనీసం పది శాతం పెట్టుకోవాలి. కొన్ని ప్రాజెక్టుల్లో అయితే 40శాతం వరకూ రాష్ట్రం వాటా ఉండాలి. కానీ ఇక్కడ మొట్టమొదటిసారి పూర్తిగా నూటికి నూరు శాతం కేంద్రమే భరించే విధంగా ప్రాజెక్టును మంజూరు చేయించుకోవడం జరిగింది.

ప్రభుత్వం వచ్చిన సంవత్సరం, రెండు సంవత్సరాల కాలంలోనే కేంద్రం నుంచి ఎన్నో విద్యాసంస్థలను కూడా మనం సాధించుకోవడం జరిగింది. ఇంతకుముందు విభజన జరిగి ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు రెండు, మూడు వేల కోట్ల రూపాయలకు మించి కేంద్రం నుంచి వచ్చిన పరిస్థితిలేదు. అదేవిధంగా ఇప్పటికీ ఆ రాష్ట్రాలకు విద్యా సంస్థలన్నీ సమకూరిన పరిస్థితి లేదు. కానీ ఇక్కడ చంద్రబాబునాయుడుగారి చాకచక్యం, మోడీగారి సహకారం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో భారతదేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా రెండు సంవత్సరాల అనతి కాలంలోనే అనేకమైన ప్రాజెక్టులను, సంస్థలను, రాజధాని అభివృద్ధికి నిధులను సంపాదించుకున్నాం. ఇంతకుముందు విభజన చేసిన రాష్ట్రాలను పరిశీలిస్తే, మన రాజధానిలాగా ఇంత వేగంగా నిర్మాణం జరిగిన పరిస్థితి లేదు. ఏదేమైనా ప్రత్యేక హోదా ద్వారా రాష్ట్రానికి వస్తాయనుకున్న

దానికంటే ఎక్కువగా ప్యాకేజీలో పొందుపరచడం జరిగింది. ఎందుకంటే హోదా అనే పదాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించిందిస్తున్నారు. ఈ కాలంలో హోదా అనేది లేదు. అందువల్ల దానికి ఏమాత్రం తగ్గకుండా నిధులను కేటాయించారు. అయితే రాజకీయాల కోసమే ప్రజల్ని కొంతమంది తప్పుదారి పట్టిస్తున్నారు. జరుగుతున్నటువంటి అభివృద్ధి అంతా ప్రజలు గమనిస్తున్నారు. అందుకే ఈ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. అంతేకాదు నదుల అనుసంధానంద్వారా ఇంకా పోలవరం– పెన్నా, కృష్ణా–పెన్నాని కలపడానికి ప్రయత్నం జరుగుతోంది. దీనిద్వారా రాష్ట్రంలో కరవు లేకుండా అన్ని ప్రాంతాలకు, ప్రతి ఎకరానికి నీటిసౌకర్యం కల్పించాలని ప్రయత్నం చేస్తున్నారు.

మిస్టర్ ఛైర్మన్ః త్వరగా క్లోజ్ చేయండి.

శ్రీ టి.డి.జనార్ధన్ః చింతలపూడిద్వారా ఉత్తరాంధ్ర మొత్తానికి కూడా నీటి వసతిని కల్పించడం కోసం వేగంగా ప్రయత్నం జరుగుతోంది.

మ. 01.30

ఈ సంవత్సరంలోనే నీళ్లు ఇవ్వబోయే పరిస్థితి ఉంది. ఎలాంటి పరిస్థితులలో ఈ ప్రభుత్వం ఇవన్నీ సాధించిందనేది గమనించాలి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రూ.16వేలకోట్లు లోటు, రూ.97వేల కోట్లు అప్పు, రాజధాని ఎక్కడో తెలియదు, ఏం చేయాలో తెలియదు. మనం వచ్చిన తరువాతే రాజధాని నిర్ణయం చేశాము. ఇటువంటి పరిస్థితులలో బస్సులో వచ్చి, బస్సులోనే పడుకుని ముఖ్యమంత్రి పాలన సాగించారు. రెండుసంవత్సరాల అనతి కాలంలోనే ఈవిధంగా ఏర్పాటు చేయడం జరిగింది. అగమ్యమైన పరిస్థితి ఆనాడు ఉంది. చీకటిలో తిట్టుకుంటూ ఉండే కంటే చిరు దీపమైనా వెలిగిస్తే కొంత వెలుతురు వస్తుందనే నమ్మకంతో ధైర్యంతో, సాహసంతో పూర్తిగా రాష్ట్రాభివృద్ధికి అంకితమై చంద్రబాబు నాయుడు గారు ప్రయత్నం చేశారు. ఆ ఫలితాలు ఇప్పుడు వస్తున్నాయి. కాబట్టి ప్రజలందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. అధ్యక్షా, రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌లో హిరోషిమా మీద ఆటంబాంబు వేయడం జరిగింది. ఫలితంగా సర్వనాశనం అయ్యింది. జపాన్ ప్రజలు కసితో, కక్షతో, పట్టుదలతో "బూడిద నుండి ప్రారంభం చేద్దాము" అనే నినాదం ఇచ్చి పట్టుదలతో అభివృద్ధిని ప్రారంభించి ఈ రోజు ప్రపంచ దేశాలను తలదన్నే విధంగా ప్రపంచ దేశాలలోనే ప్రథమ స్థానంలో ఉండే విధంగా జపాన్ ఆరోజుకీ, ఈ రోజుకీ కూడా పనిచేస్తున్న పరిస్థితి ఉంది. అలాగే తెలుగుజాతి కూడా పట్టుదలగా ఈ పరిస్థితిని ఎదుర్కొని భారతదేశంలోనే కాదు, ప్రపంచ దేశాల సరసన ఈ రాష్ట్రాన్ని నిలపాలనే తపనతో దూరదృష్టితో ముఖ్యమంత్రిగారు పనిచేస్తున్నారు. పుట్టబోయే బిడ్డ దగ్గరి నుండి చనిపోయేంత వరకూ మనిషికి ఏం కావాలి, గ్రామాలకు ఏం కావాలి, రాష్ట్రానికి ఏం కావాలి, భావితరానికి ఏం కావాలి అనేది ఆలోచిస్తూ ఆయన చేసిన సవివరమైన ప్రసంగం మనం విన్నాము. ఇంత దూరదృష్టితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి గారు చేసే కార్యక్రమాలకు మనం అందరం బాసటగా ఉండాల్సిన సమయం ఆసన్నమయ్యింది. అలాంటి ప్రయత్నం చేసిన ముఖ్యమంత్రికి ప్రజలు పూర్తిగా అండదండలు అందజేస్తారని ఆశిస్తున్నాను. ప్రతిపక్షాలు కూడా పునరాలోచించి మంచి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాను. ఆవిధంగా ఒక ప్రక్క పార్టీని, మరో ప్రక్క ప్రభుత్వాన్ని సమన్వయం చేస్తూ, నడుపుతున్న పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. చక్కని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక

మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారిని కూడా అభినందిస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు, సభ్యులకు, సభకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మేకా శేషుబాబు: అధ్యక్షా, బడ్జెట్ మీద మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నిన్న మాట్లాడిన శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ గారు, శ్రీ పి.జె. చంద్రశేఖర రావు గారు ఎన్నో విషయాలు తెలియజేయడం జరిగింది. వారు చెప్పిన విషయాలతో నేను ఏకీభవిస్తూ, ముఖ్యంగా ఏ రాష్ట్రమైనా ముందుకు పోవాలి అంటే వ్యవసాయం ప్రథమం. వ్యవసాయ రంగం బాగుంటే మిగతా అన్ని రంగాలు కూడా బాగుంటాయనే విధంగా మన పెద్దలు చెప్పడం మనం అందరం చూస్తున్నాము. ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి సంబంధించి ఆటుపోటులతో రైతులు, కౌలురైతులు, కార్మికులు ఏవిధంగా ఇబ్బంది పడుతున్నారో మనం అందరం చూస్తున్నాము. అటువంటి పరిస్థితులలో రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఈ రోజు చూసినట్లయితే రైతులకు సంబంధించి ఎకరాకు 40 బస్తాలు పండినా, 50 బస్తాలు పండినా రైతుకు ఒక్క రూపాయి కూడా మిగిలే పరిస్థితి లేదు. అంటే రైతు పరిస్థితి ఏ రకంగా ఉందో మనం అందరం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎందుచేతనంటే ఉత్పత్తి వ్యయం బాగా పెరిగిపోయింది. కనీసం రైతుకు సంబంధించి ఏ పని చేయాలన్నా అప్పులు మాత్రమే మిగిలే పరిస్థితి ఉంది. దానికి తోడు ప్రకృతి వైపరీత్యాలు, అదే విధంగా సరైన గిట్టుబాటు ధర, మద్దతు ధర లేకపోవడం లాంటి అనేక రకాలైనటువంటి ఆటుపోట్లకు గురవుతున్న పరిస్థితి మనం అందరం చూస్తున్నాము. అంతేకాకుండా, ఈ రోజు చూసుకున్నట్లయితే రాయలసీమ ప్రాంతాలలోనే కాకుండా ఈ రోజు మా పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలలో డెల్టా రైతులు అనేక రకాలుగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే రైతుల పరిస్థితి మనం అర్థం చేసుకోవాలి. పొగాకు, వరి రైతులకు ఈ రోజు గిట్టుబాటు ధర, మద్దతు ధర పెంచవలసిన అవసరం ఉంది. ఈ రోజు చూసినట్లయితే బస్తా ధాన్యం ధర రూ.1050/-ఉంది. దీనిని మరో రూ.250/- పెంచవలసిన అవసరం ఉంది. ఎందుచేతనంటే మిగతా రంగాలలో ఎవరు తయారుచేసుకున్న వస్తువుల ధరలను వారే నిర్ణయించుకునే అవకాశం ఉంది కాని రైతు విషయంలో ఆ అవకాశం లేదు. వారికి సహకరించాల్సిన అవసరం ఈ ప్రభుత్వాలకు ఉందనే విషయాన్ని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను.

రైతు అంటే చాలు రుణాలు ఇవ్వము అని బ్యాంకు మేనేజర్లు చెబుతున్నారు. ఈ రోజున రైతులకు రుణాలు ఇచ్చే పరిస్థితి కనబడడం లేదు. రుణాలు రీ షెడ్యూల్ చేసే పరిస్థితీ లేదు. అదేవిధంగా అనేక రకాలుగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీని గురించి ప్రత్యేకంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కూడా అమలు చేసి రైతులను ఆదుకున్నట్లయితే అన్ని రంగాలలో రైతులు వ్యవసాయంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అనేక అంశాలను ప్రస్తావించడం జరిగింది. ముఖ్యంగా నిరుద్యోగులకు రాష్ట్రప్రభుత్వం ప్రతీ ఒక్కరికీ ఉద్యోగాలు ఇస్తాము, ఒకవేళ ఉద్యోగాలు ఇవ్వలేకపోతే ప్రతీ ఒక్కరికీ రూ.2000/- నిరుద్యోగ భృతి ఇస్తామని ఆనాడు చెప్పడం జరిగింది. కానీ ఈరోజు ఎక్కడా కూడా పరిశ్రమలు రానటువంటి పరిస్థితి ఉంది. పరిశ్రమలకు సంబంధించి ఎన్ని దేశాలు తిరిగివచ్చినా కూడా కొత్త పరిశ్రమలు రాలేదు. మూత పడిన

పరిశ్రమలు కూడా తెరిపించే పరిస్థితి లేదంటే ఈరోజు ఉద్యోగ అవకాశాలను, ఉపాధి అవకాశాలను ఏరకంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అందిస్తుందని ప్రశ్నిస్తున్నాను.

ఈరోజు చూసినట్లయితే ప్రత్యేక హోదా రాకపోవడం వలన పరిశ్రమలు పెట్టే అవకాశం లేదు, ప్రత్యేక హోదా కనుక వచ్చినట్లయితే వడ్డీ రాయితీలు, సబ్సిడీలు, అనేక రకాలైన అవకాశాలు వచ్చే పరిస్థితి ఉండేది. మూతపడిన పరిశ్రమలలో ఏ ఒక్క పరిశ్రమను కూడా పునఃప్రారంభించే పరిస్థితి కనబడడం లేదు. ఇటువంటి అవకాశాలు లేనప్పుడు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఏవిధంగా వస్తాయనే విషయాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ప్రత్యేక హోదా రాని కారణంగా ఈ రోజు అనేక రకాలైన అవకాశాలను మనం కోల్పోయాము. అటువంటి అవకాశాలు కోల్పోయిన పరిస్థితులలో నిరుద్యోగులకు అవకాశాలు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ బడ్జెట్‌లో అటువంటి విషయాలను ఎక్కడా ప్రస్తావించకపోవడం అనేది చాలా బాధాకరమైన అంశం.

మత్స్య పరిశ్రమ విషయంలో మొత్తం భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొట్టమొదటి స్థానంలో ఉందని చెబుతున్నారు. ఈరోజు ఈ రాష్ట్ర ప్రభుత్వం దానికి ఏవిధమైన సహాయ సహకారాలు అందజేస్తుంది? ఆక్వా రైతులకు అనేక రకాలుగా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. విదేశీ మారకద్రవ్యాన్ని తీసుకుని రావడంలో మొట్టమొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది అంటే ఆ రైతులకు ఏరకంగా ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందజేస్తున్నామనే అంశాన్ని ఒకసారి ఆలోచించాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. రాష్ట్రప్రభుత్వం దీనికి సంబంధించినటువంటి సీడ్ హెచరీస్‌కు గానీ, అదేవిధంగా ల్యాబ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్స్‌కు, రైతులకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తున్నదా అనే విషయాన్ని అడుగుతున్నాను.

మ .1.40

అధ్యక్షా, ఈ రోజు చూస్తే, ఎక్కడైనా సరే ఈ రాష్ట్ర ప్రభుత్వం సీడ్ హెచెరీస్‌ని కానీ, ల్యాబ్‌ని కానీ, ల్యాబ్ టెక్నీషియన్‌ని కానీ పెట్టి, రైతులకు ప్రోత్సాహం ఇచ్చేవిధంగా అవకాశాలు కల్పిస్తుందా అని అడుగుతున్నాను. 25 కేజీల బస్తా సీడు రూ.2200/-లకు అమ్ముతున్నారు. అది కేవలం వెయ్యి రూపాయలకే తయారవుతుంది. దీని ధరల మీద ఏమైనా నియంత్రణఉందా? అని నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను. ఈ రోజు ఎక్కడ చూసినా రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారు.

ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు రొయ్యలు, చేపలు చనిపోతున్నాయి. ప్రభుత్వం ద్వారా ఎక్కడైనా వాటిని కొనుగోలు చేసే అవకాశం ఉందా అనే విషయాన్ని ఆలోచించాలని తెలియజేస్తున్నాను. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆక్వాకల్చర్‌లో ప్రథమ స్థానంలో ఉన్నప్పుడు వారికి మనం ఇంకా ఎక్కువ ప్రోత్సాహం అందించి, అవకాశాలు కల్పించినట్లైతే ఆదాయాన్ని పెంచుకోవడానికి అదేవిధంగా మరింత మందికి ఉపాధిని కల్పించడానికి అవకాశం ఉంటుంది. ఈ మత్స్య పరిశ్రమలో కేవలం 30%మంది మాత్రమే లాభం పొందుతున్నారు, మిగిలిన 70% మంది నష్టపోతున్నారు. వారి గురించి రాష్ట్రప్రభుత్వం ఆలోచించి మత్స్య పరిశ్రమకు క్షేత్రస్థాయిలో సబ్సిడీ ఇచ్చేవిధంగా, లోన్లు, వడ్డీరాయితీలు ఇచ్చేవిధంగా, వారికి కావాల్సిన పరికరాలకు సంబంధించి సబ్సిడీలు ఇచ్చి వారిని ఆదుకొని, మార్కెటింగ్ కల్పించే విధంగా, నాణ్యమైన సీడ్‌ను, ఫీడ్‌ను అందించే విధంగా మనం చర్యలు తీసుకుని ఈ పరిశ్రమని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని తెలియజేస్తున్నాను. ఈ రోజు మన రాష్ట్ర బడ్జెటులో మత్స్య పరిశ్రమ మొదటి స్థానంలో

ఉందన్నారు తప్ప, దానికి ఇచ్చే ప్రోత్సాహకాలను, సహకారాలను గురించి బడ్జెటులో ఏమీ కేటాయించలేదని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విషయానికి వస్తే, అవి అరకొర సౌకర్యాలతో అనేక ఇబ్బందులు పడుతున్నాయి. అక్కడ క్రీడలకు సంబంధించి ఆటస్థలాలు కానీ, క్రీడోపకరణాలకు కానీ సరిగా లేవు. నేను కొన్ని పాఠశాలలకు వెళ్లినపుడు వాళ్లు ఎన్నో సమస్యలు చెబుతున్నారు. అక్కడ క్రీడలకు సంబంధించి ప్రోత్సాహకాలను, సహాయ సహకారాలను అందించడంలేదని నేను తెలియజేస్తున్నాను. ఈ పరిస్థితులలో అనేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య రోజురోజుకి గణనీయంగా తగ్గిపోతుంది. కార్పోరేట్ స్కూల్స్‌ను, కార్పోరేటు వ్యవస్థని పెంచి పోషించే విధంగా ఈ విద్యావ్యవస్థ నడుస్తోంది. దానిని ఏవిధంగా తగ్గించాలి, ప్రభుత్వ పాఠశాలల్ని, ప్రభుత్వ ఉద్యోగాల్ని ఏ రకంగా ప్రోత్సహించాలి, రాబోయే రోజులలో చదువుకున్న యువతీయువకులకు ఏరకంగా ఉద్యోగావకాశాలు కల్పించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈరోజు ప్రైవేటు పాఠశాలల్లో లక్షలాది రూపాయలు ఫీజుల కింద వసూలు చేస్తున్నారు. అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేవు, కేవలం అపార్టుమెంట్లలో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. వాటిపైన సరైన అజమాయిషీ కానీ, సరైన మానిటరింగ్ కానీ చేయడం లేదు. దీని గురించి ఆలోచించి, కార్పోరేట్ వ్యవస్థని తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల్ని పెంచి పోషించే విధంగా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా విద్యావ్యవస్థ ఉండాలి. సామాన్య మానవులు, మధ్యతరగతి ప్రజలు విద్యాలయాలలో ఫీజులు కట్టలేక అప్పుల పాలవుతున్న పరిస్థితులలో మనం ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను.

అదేవిధంగా పౌరసరఫరాల విషయానికి వస్తే, గతంలో తొమ్మిది రకాల సరకులను ఈ చౌకధరల దుకాణాలలో ఇవ్వడం జరిగేది. ప్రస్తుతం బియ్యం, పంచదార, కిరోసిన్‌కి మాత్రమే ఈ చౌకధరల దుకాణాలు పరిమితమయ్యాయి. వీటన్నింటిని చూస్తుంటే ఈ ప్రభుత్వానికి సామాన్య ప్రజలు, మధ్యతరగతి ప్రజల మీద చిత్తశుద్ధి లేనట్లుగా కనపడుతుంది. గతంలో తొమ్మిది రకాల సరకులు ఇచ్చేవారు, ఇప్పుడు ఎందుకివ్వడం లేదని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని నేను ప్రశ్నిస్తున్నాను. గతంలో గోధుమలు, చింతపండు, ఆటాపిండి, ఆయిల్ లాంటి తొమ్మిది రకాల సరకులు ఇవ్వడం జరిగేది. దీనిని ఎందుకు నిలుపుదల చేశారు. వీటిని మరల పునరుద్ధరించి పేదప్రజల్ని ఆదుకోవాలి. అలా చేసినప్పుడే పౌరసరఫరాలకు సంబంధించినటువంటి స్ఫూర్తి ఉంటుందని మీకు ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈరోజు ఈ రాష్ట్ర ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తామని చెప్పడం జరిగింది. ప్రతి ఒక టౌన్లో , ప్రతి చోటా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని, రూ.5/- లకే భోజనం అందిస్తామని మేనిఫెస్టోలో కూడా పెట్టడం జరిగింది. ఎక్కడా కూడా వీటి నిర్మాణం జరుగడం లేదు. మీరు అధికారంలోకి వచ్చి ఇప్పటికే మూడు సంవత్సరాలు కావస్తోంది. వెంటనే ఈ క్యాంటీన్లను నిర్మించి, మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

బీసీల సంక్షేమ విషయానికి వస్తే, ఈ రాష్ట్రంలో సుమారు ఐదుకోట్లమంది జనాభా ఉంటే, వారిలో సుమారు రెండుకోట్ల యాభైఆరు లక్షల మంది బీసీలు ఉన్న విషయం మనందరికీ తెలుసు. కేవలం వారందరూ కూడా కులవృత్తుల మీద ఆధారపడి, కార్మికులుగా ఉండి అనేక రకాలైన ఇబ్బందులు పడుతున్నది మనం చూస్తూనే ఉన్నాం. బీసీ ఫెడరేషన్లు, బీసీ కార్పోరేషన్లు ఏర్పాటు చేసి, పదవులు కల్పించారు కానీ, బడ్జెటు కేటాయింపు మాత్రం చాలా తక్కువగా ఉంది. ఈ రోజు జనాభా ప్రాతిపదికన చూసినట్లైతే వారు ఎక్కువగా ఉన్నారు, అందువల్ల వాళ్లు ఎక్కువ పన్నులు కట్టాల్సిన పరిస్థితి ఉంది. మరి వారికి జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించే విధంగా, బడ్జెటులో వారికి మౌలికసౌకర్యాలు, ఉపాధి,

ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తున్నాను. బీసీ వసతి గృహాలను చూసినట్లైతే అక్కడ సరైన మౌలిక సౌకర్యాలు లేక, త్రాగునీరు లేక, విద్యుత్ సమస్యలు ఉన్నట్లు మనం చూస్తున్నాము. అక్కడ రెండు మూడు వసతిగృహాలకు కలిపి ఒకే వార్డెన్ ఉండడం, అదేవిధంగా నైట్‌వాచ్‌మెన్ లేకపోవడం, సరైన మానిటరింగ్ లేకపోవడం వల్ల బీసీ వసతిగృహాలు మూతపడడం జరుగుతోంది. వసతిగృహాలు ఎక్కువగా అద్దె భవనాల్లో ఉంటున్నాయి. అటువంటి పరిస్థితులలో బీసీ వసతి గృహాలను పునరుద్ధరించాలి. ఈరోజు నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోయాయి కాబట్టి వారికి మెనూ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచి వారందరికీ పౌష్టికాహారం అందించే విధంగా, పేదవిద్యార్థులు చదువుకోవడానికి అవకాశాలు కల్పించే విధంగా ఎక్కువ నిధులు కేటాయించాలనే విషయాన్ని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను.

తరువాత చేనేత పనివారు గాని, రజకులు గానీ, కల్లుగీత, వడ్డెర వీటన్నింటికి సంబంధించి కార్పోరేషన్లు, ఫెడరేషన్లు ఉన్నాయి. వీటన్నింటికి నిధులు కేటాయించి వాటిని బలోపేతం చేయాలి. కులవృత్తుల వారు ఎవరైతే ఉన్నారో, వాళ్లు కూడా ఈరోజు చదువుకుంటున్నారు కాబట్టి, వాళ్లకు టెక్నికల్‌గా లోన్లు ఇచ్చినట్లయితే వాళ్లు అభివృద్ధి చెందడానికి, కుటుంబాన్ని పోషించడానికి అవకాశాలు ఉంటాయని ఈ సందర్భంగా నేను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. నిరుద్యోగభృతికి సంబందించి బడ్జెటులో కేవలం రూ.500కోట్లు మాత్రమేపెట్టడం జరిగింది. ఏ ఉద్యోగమైనాసరే అది క్లర్క్ పోస్టుకానీ, నాలుగవ తరగతికి చెందిన పోస్టుకుకానీ నోటిఫికేషన్ ఇస్తే ప్రతి ఒక్క జిల్లానుంచి లక్షలాది మంది అప్లికేషన్లు పెట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. అటువంటి పరిస్థితుల్లో నిరుద్యోగభృతి క్రింద కేవలం రూ.500కోట్లు కేటాయిస్తే, అవి కనీసం ఒక జిల్లాకు కూడా సరిపోని పరిస్థితి కనబడుతుంది. బాబు వస్తే జాబు వస్తుందని అన్నారు, అటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ కూడా ఉద్యోగం ఇవ్వాలి, అలా కాని పక్షంలో రాష్ట్రంలో ఎంతమంది డిగ్రీలు చేసి నిరుద్యోగులుగా ఉన్నారో, వారందరికీ కూడా ప్రతిఒక్కరికి రూ.2000/–లు నిరుద్యోగభృతి క్రింద ఇవ్వాలని ఈ సందర్భంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

అదేవిధంగా కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం అనే విషయాలు మనందరం చెప్పుకుంటున్నాము. అటువంటి సందర్భంలో ఈ మూడు సంవత్సరాలలో ఎక్కడ చూసినా గృహ నిర్మాణానికి సంబంధించి పనులు నిలిపి వేయడం జరుగుతోంది. ఎంతోమంది లోన్లు పెట్టుకుని, బేస్‌మెంటు వేసుకుని, లింటెల్ లెవల్‌లో కానీ, శ్లాబ్‌లెవల్‌లో కానీ ఉన్నాయి. పేదవారందరూ తమ ఇళ్లను తొలగించి ఇళ్లకోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. వారికి బిల్లులు చెల్లించకుండా, కొత్త ఇళ్లను శాంక్షన్ చేయకుండా అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. మనం స్థానిక సంస్థల్ని కూడా బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈరోజు ఒక సర్పంచ్ కానీ, ఎంపీటీసీ కానీ వారి విధులు వారు నిర్వర్తించుకునే పరిస్థితి లేదు. జన్మభూమి కమిటీలతో వారందరూ పరిపాలన సాగిస్తున్నారు. ఇళ్లు ఇవ్వాలన్నా, పెన్షన్లు ఇవ్వాలన్నా, లోన్లు ఇవ్వాలన్నా వారి సంతకాలు కూడా పెట్టాలని వారందరూ చెబుతున్నారంటే, స్థానికసంస్థలకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు ఏవిధంగా ఇబ్బందులు పడుతున్నారనేది మనందరికి అర్థమవుతుందని ఈ సందర్భంగా మీకు తెలియజేస్తున్నాను.

మ. 01.50

అధ్యక్షా, ఈ రోజున మనకు అనేక రకాలైన ఇబ్బందులు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో రైతుల ఋణమాఫీకి సంబంధించి మరియు డ్వాక్రా మహిళలకు సంబంధించిన ఋణ మాఫీ కానీ, ఎన్ని వేల కోట్ల రూపాయలు ఉన్నా, వాటన్నింటిని రద్దు చేస్తామని, ఎవరూ కూడా బ్యాంకులకు వెళ్ళవలసిన అవసరం లేదని అన్నారు. అలాగే, బంగారం పైన ఉన్నటువంటి ఋణాలను రద్దు చేస్తామని చెప్పడం వల్ల

ఎవరూ కూడా లోన్లు కట్టలేదు. అలాగే, ఋణాలను కూడా రీ–షెడ్యూల్ చేయని పరిస్థితి ఉంది. ఆ రకంగా వారికి వడ్డీలన్నీ పెరిగిపోయి, ఆర్థిక భారం పెరిగిపోతే, వారికి బ్యాంకులు నోటీసులు ఇచ్చాయి. ఆ రకంగా పేదవారి పరపతిని దెబ్బతీసే పరిస్థితి ఉందని తమ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. ఏదిఏమైనా సరే, గతంలో డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిగారు అధికారంలో ఉండగా ఎంతోమంది పేద విద్యార్థులు ఫీజు రీ–యింబర్స్‌మెంట్ ద్వారా బి.టెక్, ఎం.ఫార్మసీ చదువుకోవడానికి అనేక రకాలుగా అవకాశాలు కల్పించిన పరిస్థితులు ఆనాడు ఎక్కువగా ఉన్నాయని తమ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, అంతేగాకుండా, ఆనాడు డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిగారు ప్రవేశపెట్టినటువంటి ఫీజు రీ–యింబర్స్‌మెంట్ కార్యక్రమం, ఆరోగ్య కార్యక్రమాలయిన 108, 104 కార్యక్రమాలకు ఎక్కువ నిధులు కేటాయించి, అవన్నీ సఫలీకృతమయ్యే విధంగా ఆనాడు ఏవైతే పథకాలను ఏర్పాటు చేశారో, అవి పూర్తయ్యే విధంగా తగిన ఆలోచనలు చేశారు. ఆ పథకాలన్నీ కూడా ప్రజోపయోగ పథకాలు కావున వాటన్నింటిని మరింతగా ముందుకు తీసుకువెళ్ళాలని తమ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ఇక పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చూసినట్లయితే, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు అవుతోంది. ఇప్పటికి చాలా తక్కువ శాతమే పనులు అయ్యాయి. ఇంక కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే సమయం ఉంది. ఈ పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోతే, అనేక రకాలైన ఇబ్బందులు కూడా ఉన్నాయి. దానికి సంబంధించిన భూసేకరణ కానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజిలో కూడా ఎంతోమందికి భూములు కోల్పోయిన వారందరికీ కూడా అవకాశాలు కల్పించే విధంగా నిధులను కూడా మంజూరు చేయవలసిన అవసరం ఉంది. అధ్యక్షా, కేవలం పోలవరం ప్రాజెక్టు సమీక్షలు చేసినంత మాత్రాన ఈ ప్రాజెక్టు అవదు. వాటికి సంబంధించిన నిధులను కూడా త్వరితగతిన మంజూరు చేయవలసిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చి, రైతులకు త్రాగునీరు, సాగునీరు అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. అధ్యక్షా, సభలో నాకు మాట్లాడే అవకాశం కల్పించినందుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

SRI R. REDDAPPA REDDY (నామినేటెడ్) : Thank you Sir. I would like to use this occasion only to bring four or five important issues to the notice of the House through you Sir. ఈ బడ్జెట్‌ని చూస్తుంటే, అటవీ శాఖకు దాదాపు రూ.350కోట్లు కేటాయించారు. Almost 1/3rd of the State is under Forest area and Environment is being deteriorated. గ్లోబల్ వార్మింగ్ అవుతోంది. రూ.350 కోట్లలో కూడా కేవలం అభివృద్ధికి సంబంధించి కేవలం రూ.50 కోట్లు మాత్రమే ఇచ్చారు. మిగతా అంతా ఎస్టాబ్లిష్‌మెంట్ కోసం పోతోంది. I appeal to the Government through you Sir to enhance the Budget by allocating at least Rs.1300 crores i.e. @ Rs.100 crore per District. ఇస్తే, నిజంగా ఏదైనా ఫారెస్ట్ డిపార్టుమెంటుకి న్యాయం చేసినట్లు, పర్యావరణానికి న్యాయం చేసినట్లు ఉంటుంది. కాకపోతే మన ఫారెస్ట్ డిపార్టుమెంటు just has become an organisation for giving NOCs. అసలు Forest Department is meant for Developing Forest కాకుండా, it has become a Department meant for giving NOCs or clearances for various industrial purposes అనిపించింది సార్. That is one aspect. మరొక అంశం ఏమిటంటే సార్, చిత్తూరు జిల్లాలో western parts మదనపల్లి సబ్ డివిజన్‌లో particularly in the matter of drought, that is the worst affected area among all the 13 Districts.

అధ్యక్షా, ఇప్పుడు హంద్రీ–నీవా ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ శాసనమండలిలోనే 2015వ సంవత్సరం డిసెంబరు నాటికల్లా గౌరవ ముఖ్యమంత్రిగారు పుంగనూరుకు నీరు తీసుకువస్తామని అన్నారు. మళ్ళీ డిసెంబరు 2015వ సంవత్సరం గడువు దాటిన తరువాత ఒక సందర్భంలో వారిని అడిగితే, జూన్, 2016వ సంవత్సరానికల్లా నీరు తీసుకువస్తామని అన్నారు. ఇప్పుడు 2017వ సంవత్సరం వచ్చింది.

ఇంకా ఆ పనులు పూర్తికాలేదు. ఒకవేళ ఆ పనులు పూర్తి అయినా కూడా, ఇప్పుడు మనది lower and last riparian State, Upper riparian States అంతా కూడా ఇల్లీగల్‌గానో, లీగల్‌గానో చాలా ప్రాజెక్టులు కట్టేశారు. ఒకవేళ ఈ కాలువ పనులు పూర్తి అయినా కూడా నీరు వచ్చే పరిస్థితి లేకుండా ఉంది. ఈ కాలువ ద్వారా కనుక నీళ్ళు రాకపోతే, in course of years Madanapalli sub-division will become a desert. Already desertification has started. ఆ హంద్రీ-నీవా ప్రాజెక్టుకు నీళ్ళు వచ్చే ప్రక్రియకు సంబంధించి ఏ విధంగా అయితే సభలో హామీ ఇచ్చారో, ఆ విధంగా దానిని నెరవేర్చాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇక మూడవ అంశానికి సంబంధించి పరిశీలించినట్లయితే – important National Highways. Chittor District is bordering the States of Tamilnadu & Karnataka, a lot of accidents. వాళ్ళేమో నాలుగు వరుసల రహదారులు చేసుకున్నారు. మన రాష్ట్రంలో మాత్రం నాలుగు వరుసలు కాలేదు. కాబట్టి, ప్రస్తుతం మన సభలో భవనాలు, రహదారులకు సంబంధించిన మంత్రిగారు కూడా ఉన్నారు. ఈ విషయానికి సంబంధించి నేను చాలాకాలం నుంచి చెపుతున్నాను. NH-4 Bangalore to Chennai passing through Chittoor. Lot of accidents are taking place. అందులో మనది మాత్రమే ఫోర్‌లైన్ కాలేదు. మిగిలిన రాష్ట్రాలవన్నీ అయిపోయాయి. కానీ, ఇది మాత్రం ఎందుకు పెండింగులో ఉందంటే, టెండర్లు కూడా అయిపోయాయి. District Collectors have to pass land compensation awards. They are taking months together. The Hon'ble Minister is also present in the House. I request him to pull up the District officers, they please only some people, but, they don't work in the Districts. This is one aspect. My humble request is, you will save thousands of lives by completing this. ఆ సింగిల్ రోడ్డులో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడైనా బెంగుళూరు – తిరుపతి రహదారిలో వెడితే, you will notice that how bad our part of the road is. ఆ నాలుగు వరుసలు రహదారి వస్తే ఎంత కంఫర్టబుల్‌గా జర్నీ ఉందో తెలుస్తుంది.

MR. CHAIRMAN: Is it via Kuppam?

SRI R. REDDAPPA REDDY: No Sir, it is Bangalore to Chennai via Chittor. తమిళనాడు రాష్ట్రంలో రాణీపేట నుంచి చెన్నై నాలుగు వరుసల రహదారిగా అయిపోయింది. కర్ణాటక రాష్ట్రంలో ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు నుంచి బెంగుళూరు వరకు నాలుగు వరుసల రహదారి అయిపోయింది. ఇందులో కేవలం మన రాష్ట్రంలో Chittoor District part is remaining. Then, the third issue I wanted to bring to the notice of the House is corruption. I am not talking of the higher levels. కానీ, సామాన్య మానవుడు మాత్రం... I spend two days per week in my village. Most people who come to me are victims of corruption. పోలీస్ స్టేషన్ కానీ, మండల ఆఫీసు కానీ, electricity department and also Education Department. I won't take much time. I will conclude Sir. Just two days back when I was in my village, ఒకతను స్కూల్ పెడుతున్నానని నా దగ్గరకు వచ్చి నన్ను రిక్వెస్ట్ చేయమన్నారు. ఎందుకంటే, లంచాలు ఎక్కువ అడుగుతున్నారు, తగ్గించమని అన్నారు. నేను ఏమేమి లంచాలు ఇస్తున్నావని అడిగితే – ముందు మాకు పర్మిషన్లు కావాలంటే మునిసిపల్ కమీషనర్‌కి ఎన్.ఓ.సి నిమిత్తం రూ.10,000లు లంచమని, ఆ తరువాత అగ్నిమాపక శాఖకు సంబంధించి ఫైర్ ఆఫీసర్ వస్తే, ఆయన రూ.25,000లు లంచం అడుగుతున్నారన్నారు. ఆ తరువాత ఏదైనా స్కూలులో ఫైర్ యాక్సిడెంట్ అయితే, ఫైర్ డిపార్టుమెంట్ నుంచి ప్రతి సంవత్సరం స్కూల్స్‌కు ఎన్.ఓ.సి. కావాలని పెట్టారు. దీనివల్ల వాళ్ళు ఎన్.ఓ.సి.కి ఫీజులు పెట్టేశారు. మొదటిసారి ఇచ్చినప్పుడు రూ.25,000లు, ప్రతి సంవత్సరం కూడా Every year they have to give money for NOCs. ఫైర్ డిపార్టుమెంటుకి ఎన్.ఓ.సి. నిమిత్తం డబ్బులు ఇవ్వాలి. దాని బదులు I

am requesting the Government through you that ఒక అఫిడవిట్‌ని ఫైల్ చేయమనండి. స్కూలులో ఫైర్ గైడ్‌లైన్స్ ఉన్నాయని చూపించమనండి. Let them file an affidavit before the Sub-collector or Tahsildar saying that we have complied with the fire regulations, so that లంచాలు ఇచ్చే బాధ్యత ఫైర్ డిపార్టుమెంటుకి పోతుంది.

అధ్యక్షా, ఇక మూడవ అంశం – It goes to the DEO. There, they have to pay Rs.60,000/- to the Superintendent and Rs.65,000/- to D.E.O.. Then I had to request the Superintendent saying that ఆ స్కూలుని అభివృద్ధి చేసేవారు, తెలిసిన వాళ్ళని చెప్పి వదిలేశారు. నువ్వు రూ.65,000లకు బదులు రూ.30,000 తీసుకోమన్నారు. ఆ తరువాత స్కూలు పర్మిషన్లు వచ్చిన తరువాత, ఆ స్కూల్ రికగ్నిషన్ కోసం ఈ లంచాలన్నీ రిపీట్ అవుతున్నాయి. మళ్ళా Directorate of School Education again they have to spend Rs.1 and 1.5 lakh. ఇది ఒక అంశంగా తమ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ఇక పోలీసు స్టేషన్లకు సంబంధించి చూస్తే, – of course, this has been in the past also. Inspectors and DSPs come on political leaders' letters. I am not pointing the present Government. It has been a precedent. The officers are such that they have no regard - వాళ్ళు పేదవాళ్ళా ఏమిటా అని చూడరు, except collecting money. లా–అండ్ ఆర్డర్‌లో ఉన్నంత కాలము నేను ఎంతగా పట్టించుకోవాలి. లేకపోతే నేను ఇంటెలిజెన్స్ వింగ్స్‌కి పోతానని, అక్కడ డబ్బులు కూడా ఉండవని చెప్పి, they are virtually going berserk and...

మిస్టర్ ఛైర్మన్ : మీరు గతంలో ఏ డిపార్టుమెంటులో ఉండేవారు..

SRI R. REDDAPPA REDDY: Sir, earlier I was an IPS Officer. నేను చెప్పినా కూడా వాళ్ళు ఎవరిమాట వింటున్నారంటే, ఇప్పుడు అక్కడ ఒక సిస్టం వచ్చింది. వాళ్ళ ట్రాన్స్‌ఫర్స్‌కి ఎవరు కారకులో వాళ్ళ మాట తప్ప ఎవరి మాట వినరు. For them, protocol means the leaders who affect their transfers. వాళ్ళే వాళ్ళ బాసులు, అంతే. మిగిలిన వాళ్ళు ఎవరు చెప్పినా వినడం లేదు. మీరు ఎప్పుడైనా మా ప్రాంతానికి వచ్చినప్పుడు చూస్తే, అక్కడ ఇసుక ఎలా ఉంటుందో. ప్రతి ఇన్‌స్పెక్టరుకు రూ.25,000లు per lorry, per month. Police Officers are starting their own business establishments in the jurisdiction in which they are working. అసలు వారికి భయమే లేదు. నార్మల్‌గా లంచాలు తీసుకునే వాళ్ళు భయపడతారు. కానీ, వీరికి అసలు భయమే లేదు. పౌల్ట్రీ ఫామ్స్ అన్ని రకాలుగా కూడా అసలు భయమే ఉండడం లేదు. So, that is the corruption which the people are facing.

అధ్యక్షా, ఒకప్పుడు కాల్‌మనీకి సంబంధించి ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. Private vaddiee is going on as usual ఎవరన్నా బాధితులు పోయి, కంప్లైంట్లు ఇస్తే, డబ్బులు వడ్డీకి ఇచ్చిన వాళ్ళని, వాళ్ళు చెప్పినట్లుగా వీళ్ళమీదే ఎదురు కేసులు పెడుతున్నారు. ఎందుకంటే, వడ్డీకి డబ్బులు ఇచ్చిన వాళ్ళు, ఆర్థికంగా ఉన్నవాళ్ళు and special branch is there to inform. But, Special Branch has become a centre point to collect money from the Inspectors in the Districts and share it at all levels. I am telling this because, it is not an imagined talk. This is what I am facing sitting in the Village every day. As an IPS Officer, I have been requesting Sub-Inspectors, Circle-Inspectors stating that they are poor people, go by the merits of the case and not on political considerations or on corrupt interests. But, they don't go. Corruption is the top priority for them. That is one aspect.

Secondly, democratic forums - I don't know why the Government is not interested in functioning. Earlier, DDRCs ఉండేది. ఆ ఫోరం ఉంటే, జిల్లా అధికారులను అపోజిషన్ వాళ్ళు,

రూలింగ్ పార్టీవారు ప్రశ్నిస్తూ ఉండేవారు. అప్పుడు వారికి ఒక భయం ఉండేది. ఇప్పుడు డిడిఆర్‌సి సమావేశాలు లేవు. Nobody is there to ask the Collector, nobody is there to ask the Joint Collectors, nobody is there to ask the District Officers about so many deficiencies. So, I request the Government to revive the DDRC. ఇప్పుడు జిల్లాపరిషత్ సమావేశం ఉందని ఆర్థిక శాఖా మంత్రిగారు చెప్పారు. అందుకని మేము డిడిఆర్‌సి పెట్టలేదని అన్నారు. జిల్లాపరిషత్ సమావేశాలకు వెడితే, అక్కడ 60, 70 మంది జెడ్‌పిటిసిలు ఉంటారు. మీకు అసెంబ్లీ, కౌన్సిల్ ఫోరం ఉంది కదా, మాకు అవకాశం ఇవ్వమని వాళ్ళు ఏదో స్థానికంగా ఉండే జెడ్‌పిటిసిలకి సంబంధించిన విషయాలను మాట్లాడతారు.

మ. 02.00

వారు జడ్‌పిటీసికి సంబంధించిన విషయాలు మాట్లాడుతారు. So, they won't allow the MLAs and MLCs to question the District Officers. అప్పుడు జిల్లా అధికారులను ప్రశ్నిస్తారని శాసనపరిషత్ సభ్యులు, శాసనసభ్యులంటే భయం ఉండేది. ఇప్పుడు ఎవరూ కూడా కనీసం స్పందించడం లేదు. ఎవరు ట్రాన్స్‌ఫర్ చేస్తారో వారికి మాత్రమే రెస్పాండ్ అవుతారు. Even they don't care MLAs and MLCs.

MR. CHAIRMAN: In Zilla Parishat meetings, the in-charge Minister, Local Minister, concerned Minister and also the Collector will be there. Only thing is you have to take the opportunity.

SRI R. REDDAPPA REDDY: Sir, you are right. I am coming to the point. Zilla Parishat meeting once in every three months and every ZPTC has a point to ask.

MR. CHAIRMAN: Earlier, I have also attended ZPTC meetings.

శ్రీ ఆర్ రెడ్డప్ప రెడ్డి: సార్, ఛైర్మన్‌గా మీకు గౌరవం ఇచ్చేవారేమో! చిత్తూరు జిల్లాలో జడ్.పి.టి.సి.లకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వండి, శాసనసభ్యులకు సమయం ఇవ్వలేమని అంటుంటారు.

MR. CHAIRMAN: When you brought the local issue, why don't you discuss that issue in the Zilla Parishad meeting. Because, you can't discuss Zilla Parishat meeting issues here.

SRI R. REDDAPPA REDDY: Sir, I have been discussing that issue there also and I am bringing it to the kind notice of the functioning of the democratic forums. It will also help the ruling parties. ఎవరైనా ప్రశ్నిస్తారని జిల్లా అధికారులకు భయం ఉంటే అతను సక్రమంగా పనిచేస్తే ఎవరికి క్రెడిట్ వస్తుంది, ఆ క్రెడిట్ రూలింగ్ పార్టీకి వస్తుంది. డెమోక్రటిక్ ఫోరంని ఫంక్షన్ చేయకుండా ఉంటే, it is a disadvantage to the ruling party.

శ్రీ గుండుమల తిప్పేస్వామి (శాసనసభా నియోజక వర్గం) : అధ్యక్షా, అది వాస్తవం. నేను కూడా జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేసినప్పుడు నేను కూడా చెప్పేవాడిని. ఎందుకంటే, జడ్.పి.టి.సి.లపై ఒత్తిడి ఆ విధంగా ఉంటుంది కాబట్టి, వారికి అవకాశం ఇస్తాం. గౌరవ సభ్యులు రెడ్డప్ప రెడ్డి గారు చెప్పింది వాస్తవం. నేను కూడా గతంలో ఛైర్మన్‌గా పనిచేశాను.

SRI R. REDDAPPA REDDY: Sir, Second thing is that when I have joined as a Member in the year 2007 in one of the seminars, at that point of time, the Speaker was telling that the House Committees function play a pivotal role of the house during the

intermediate Session i.e. between the two Sessions of the House and the Committees play a pivotal role. Sir, I have been appointed as a Member of a Committee, which was not met even after one year. So, the House Committees did not meet and how can we question Secretaries of various departments, the Heads of Departments and how do we question and how do we bring the public importance issues to the notice of the Senior Officers.

MR. CHAIRMAN: So, you are referring the matter, which was happened in the year 2007. Earlier also you have also brought the issue to my notice.

SRI R. REDDAPPA REDDY: Sir, The House Committee play a role of a Session in between the Sessions of the House. So, we are unable to play that role. So, I request the Government through you and the Leader of the House to see that the Committees functioning, those who are appointed as Chairmen of the Committees have entrusted in conducting the meetings of the Committee. Even the Ex-Officio Chairman can nominate another person as Chairman of the Committee and therefore, we can question the Secretaries and the Heads of the Departments. Thereby, the department's functioning will definitely improve.

MR. CHAIRMAN: He is referring the earlier House Committees of 2007, 2008 and 2009.

SRI R. REDDAPPA REDDY: Sir, Let all the Members should face the House Committees then ultimately, the functioning of the Government will definitely improve. So, these are some of the issues, which I wanted to bring it to the notice of the House. Thank you very much for giving me this opportunity and I hope that the Government will respond to it.

MR. CHAIRMAN: It is already 2-00 p.m. Today, we will close the business and tomorrow, we will continue discussion on the Budget.

Now, the House is adjourned to meet again on Wednesday, the 22$^{nd}$ March, 2017 at 10.00 a.m.

(Then, the House was adjourned at 2-04 p.m. to meet again on Wednesday, the 22$^{nd}$ March, 2017.)

* * *